

స్వచ్ఛ విశాఖ సాధనకు ప్రతిజ్ఞ



స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. కొమ్మాదిలో జరిగిన కార్యక్రమంలో స్వచ్ఛ సాధనకు పాటుపడతామని ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఇతర అధికారులు.

- 8వ పేజీలో

మంత్రి నారా లోకేశ్‌కు ఘన స్వాగతం

గోపాలపట్నం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా భోగాపురంలో ఓ వివాహ కార్యక్రమానికి హాజరయ్యేందుకుగాను శనివారం నగరానికి విచ్చేసిన రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖల మంత్రి నారా లోకేశ్‌కు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఉదయం తొమ్మిది గంటలకు విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో విశాఖ చేరుకున్న లోకేశ్‌కు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, పలువురు పార్టీ నేతలు స్వాగతం పలికారు. అనంతరం లోకేశ్ రోడ్డు మార్గంలో భోగాపురం బయలుదేరి వెళ్లారు. అక్కడ నుంచి తిరిగి మధ్యాహ్నం 12.45 గంటలకు విమానాశ్రయానికి చేరుకున్న లోకేశ్‌కు పలువురు ప్రజా ప్రతినిధులు, టీడీపీ నేతలు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఆయన ప్రత్యేక విమానంలో హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు.

నారా లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న పల్లా శ్రీనివాసరావు, గుమ్మడి సంధ్యారాణి, శ్రీభరత్, చిరంజీవిరావు, లలితకుమారి



యూసీడీ పీడీ పాపునాయుడే వైసీపీకి అనుకూలంగా పనిచేయించారు

- మంత్రి లోకేశ్‌కు డ్వాక్రా ఆర్పీల ఫిర్యాదు
- తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశ వర్కర్ల వినతి



మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆశ వర్కర్లు, ఆర్పీలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీలో యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ పాపునాయుడు వైసీపీ ప్రభుత్వ హయాంలో డ్వాక్రా ఆర్పీల మెడలో ఆ పార్టీ కండువాలు వేయించి, అనుకూలంగా పని చేయించారని శనివారం విశాఖపట్నం వచ్చిన మంత్రి నారా లోకేశ్‌కు రీసోర్స్ పర్సన్‌లు ఫిర్యాదు చేశారు. భోగాపురంలో ఒక కార్యక్రమానికి హాజరు కావడానికి వచ్చిన మంత్రి లోకేశ్‌ను వారు విమానాశ్రయంలో కలిసి వినతిపత్రం అందించారు. అప్పుడు తాము వైసీపీకి అనుకూలంగా పని చేశామని ఆరోపిస్తూ తమ ఉద్యోగాలు తీయించేస్తామని కూటమి కార్పొరేటర్లు బెదిరిస్తున్నారన్నారు. పీడీ పాపునాయుడు వల్లే అప్పుడు అలా జరిగిందని, తమకు రాజకీయాలతో సంబంధం లేదన్నారు. తమను మూడేళ్లు మాత్రమే కొనసాగిస్తామని ఉత్తర్వులు ఇచ్చారని, వాటిని రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు పెంచాలని ఆశలు వినతిపత్రం సమర్పించారు. వీటిపై మంత్రి సానుకూలంగా స్పందించి, తగిన నిర్ణయం తీసుకుంటామని వారికి భరోసా ఇచ్చారు.

తొలి పది నెలల్లో కస్టమ్స్ ఆదాయం రూ.11,198.36 కోట్లు

కస్టమ్స్ చీఫ్ కమిషనర్ సంజయ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి):



విశాఖపట్నంలోని కస్టమ్స్ విభాగం ఈ ఆర్థిక సంవత్సరంలో జనవరి నెలాఖరు వరకు రూ.11,198.36 కోట్ల ఆదాయం సాధించిందని చీఫ్ కమిషనర్ సంజయ్ వెల్లడించారు. అక్కయ్యపాలెంలోని విశ్వనాథ్ కన్వెన్షన్‌లో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ కస్టమ్స్ దినోత్సవంలో ప్రసంగించారు. గత ఆర్థిక సంవత్సరం (2023-24) రూ.15,167.62 కోట్ల ఆదాయం సాధించామన్నారు. విశాఖపట్నం, గంగవరం పోర్టులతో పాటు విశాఖపట్నం కంటెయినర్ టెర్మినల్, విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయం, కంటెయినర్ ఫ్రైట్ స్టేషన్ల ద్వారా అధిక ఆదాయం వస్తోందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశాఖపట్నం

... మిగతా 6వ పేజీలో

అమ్మాయిలు మిస్సింగ్!

నగరంలో పెరుగుతున్న కేసులు

- స్నేహం పేరిట ఫేస్‌బుక్, ఇన్‌స్టాలో మోసగాళ్ల రిక్వెస్ట్‌లు
- తర్వాత ప్రేమ పేరుతో వల
- పెళ్లి చేసుందామంటూ మాయమాటలు
- కాదంటే మార్ఫింగ్ ఫొటోలు పంపించి పరువు తీస్తామని బెదిరింపులు
- నమ్మి మోసపోతున్న కొందరు
- భయపడి ఇళ్లు వదిలివెళ్లిపోతున్నవారు మరికొందరు
- బాధితుల్లో పెళ్లై పిల్లలున్నవారు కూడా...

మిస్సింగ్ కేసులు		ఆచూకీ తెలిసినవారు
మహిళలు	539	388
బాలికలు	163	149



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో యువతులు, మహిళల అదృశ్యం కేసులు పెరుగుతున్నాయి. అందుకు గల కారణాలను పరిశీలిస్తే అత్యధికం ప్రేమ పేరిట మోసాలు, స్నేహం పేరుతో వంచన, సన్నిహితుల బ్లాక్‌మెయిలింగ్ వంటివే ఉంటున్నాయి.

ప్రస్తుతం స్మార్ట్ ఫోన్‌ల వినియోగం పెరిగింది. పిల్లల నుంచి పెద్దల వరకూ ప్రతి ఒక్కరూ సోషల్ మీడియాలో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లు కలిగి ఉంటున్నారు. వాటిల్లో తమ వ్యక్తిగత వీడియోలను అప్‌లోడ్ చేయడం, ఇతరులు అప్‌లోడ్ చేసిన వీడియోలు, ఫొటోలను వీక్షించడం వ్యసనంగా మార్చుకుంటున్నారు. కొంతమంది మోసగాళ్లు దీనిని ఆసరాగా తీసుకుని అమాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. మొదట్లో స్నేహం పేరుతో రిక్వెస్ట్‌లు పంపిస్తారు. ఆ తరువాత తీయని మాటలతో చాటింగ్ మొదలెడతారు. ఫోన్ నంబర్లు తీసుకుంటారు. పొగడ్తలతో ముంచెత్తుతూ దగ్గరవుతారు. తర్వాత ప్రేమ పేరుతో ముగ్గులోకి దింపుతున్నారు. అక్కడి నుంచి కుటుంబ ఆర్థిక పరిస్థితులు తెలుసుకుని సమస్యలేమైనా ఉన్నట్టయితే వాటిని అధిగమించేలా చేస్తామంటూ ఆకట్టుకుంటారు. వారితో చనువుగా మాట్లాడినప్పుడు కాల్ రికార్డు చేస్తుంటారు. అలాగే వ్యక్తిగతంగా కలిసినప్పుడు సన్నిహితంగా ఉన్న ఫొటోలు, వీడియోలు తీసుకుంటారు. వాటిని అడ్డం పెట్టుకుని పెళ్లి చేసుకుందామని కొందరు, తన కోర్కె తీర్చాలని మరికొందరు, డబ్బులు ఇవ్వాలని ఇంకొందరు వేధించడం మొదలుపెడుతున్నారు. నిరాకరిస్తే తమ వద్ద ఉన్న ఫొటోలు, వీడియోలు, మార్ఫింగ్ వీడియోలను

... మిగతా 6వ పేజీలో

అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ

- సీపీ శంఖబ్రతబాగ్చి



నగరంలో ప్రేమ, పెళ్లి పేరుతో జరుగుతున్న మోసాలను అరికట్టేందుకు ప్రత్యేక కార్యాచరణకు రూపకల్పన చేశాం. ప్రతి ఒక్కరూ సోషల్ మీడియాలో అకౌంట్‌లు కలిగి ఉండడం, ఎక్కువ సమయం వాటిల్లోనే గడపుతుండడంతో మోసాలకు ఆస్కారం పెరుగుతోంది. దీనిపై బాలికలతో పాటు మహిళలకు ఏయూలోని మహిళా అధ్యయన కేంద్రం సహకారంతో డాక్యుమెంటరీలు, కళాజాతాలు, పోస్టర్ల ద్వారా అవగాహన కల్పిస్తాం. మిస్సింగ్ కేసుల్లో అత్యధికం తెలిసిన వారి మాయమాటలే కారణం కావడంతో అలాంటి వారి తీరుతెన్నులు, మాట తీరు ఎలా ఉంటాయనేది కూడా కేస్ స్టడీస్‌తో వివరిస్తాం.

పిల్లలను ఓ కంట కనిపెట్టండి

కొంతమందిలో చిన్న వయసు నుంచి ప్రవర్తనలో మార్పులు

- తల్లిదండ్రులు సకాలంలో గుర్తించాలంటున్న వైద్యులు
- లేనిపక్షంలో కౌమార దశకు వచ్చేసరికి మానసిక సమస్యలకు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరిక
- అడిగినవన్నీ అందించాల్సిన అవసరం లేదు
- ఆర్థిక పరిస్థితులు, కుటుంబ ఇబ్బందులు వంటివి అర్థమయ్యేలా చెప్పాలి
- వారికి ప్రతిరోజూ కొంత సమయం కేటాయించాలి
- అతి గారాబంతో అనేక రకాల ఇబ్బందులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి):

పిల్లల వైఖరిలో తీవ్రమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. తల్లిదండ్రులు చెప్పే మాటలను వినేందుకు కొంతమంది ఇష్టపడడం లేదు. అయితే అటువంటి పరిస్థితిని ప్రాథమిక దశలోనే గుర్తించి, సరిదిద్దాలని వైద్యులు సూచిస్తున్నారు. చిన్న వయసులో తల్లిదండ్రుల మాట వినని పిల్లలు...కౌమార దశకు వచ్చేసరికి విపరీతమైన ధోరణి తారస్థాయికి చేరి మానసిక సమస్యల బారినపడే అవకాశముందని హెచ్చరిస్తున్నారు. పిల్లలను తొలి నుంచి ఒక కంట కనిపెడుతూ ఉండడం, వారి వ్యవహారశైలిలో వస్తున్న మార్పులను గుర్తించి సరిచేయడం ద్వారా తప్పుడు మార్గాల వైపు వెళ్లకుండా, ఇతర సమస్యల బారినపడకుండా కాపాడుకునేందుకు అవకాశం ఉంటుందని మానసిక వైద్యులు సూచిస్తున్నారు.



సెల్‌ఫోన్‌తో సమస్యతో మొదలు..

ప్రతి ఒక్కరికీ ఇప్పుడు స్మార్ట్ ఫోన్ అత్యవసర వస్తువుగా మారిపోయింది. పెద్దలే కాదు.. పిల్లలు కూడా స్మార్ట్ ఫోన్ లేకపోతే తల్లిపెట్టే గోరు ముద్దలను కూడా తినడం లేదు. ఇదంతా తల్లిదండ్రులు చేసిన అలవాటే. అయితే, ఈ అలవాటే భవిష్యత్తులో పిల్లలను అనేక ఇబ్బందుల బారినపడేలా చేస్తుంది. ఒక వయసు దాటిన తరువాత పిల్లల గంటల తరబడి ఫోన్‌కు అలవాటు పడి అనేక సమస్యలను కొని తెచ్చుకుంటున్నారు. గంటల తరబడి ఫోన్ చూడడం వల్ల బ్రెయిన్‌లో ఉండే వైట్ మేటర్ (మెదడులోని టిష్యూ)పై ప్రభావం పడుతోంది. సాధారణంగా మెదడు విశ్రాంతి కోరుకున్నప్పుడు వెంటనే రెస్ట్ మోడ్‌లోకి వెళ్లాలి. అలా వెళ్లడం ద్వారా ఒత్తిడి నుంచి ఉపశమనం పొంది మళ్లీ బ్రెయిన్ రిఫ్రెష్ అవుతుంది. అయితే, చాలా మంది ఫోన్‌లో వీడియోలు చూస్తూ మెదడు మరింత ఒత్తిడికి గురయ్యేలా చేస్తున్నారు. దీనివల్ల మనిషి ఆలోచనల్లో మార్పులు చోటుచేసుకుంటాయి. ముఖ్యంగా పిల్లల్లో అయితే మెదడు భిన్నరకాలుగా స్పందిస్తుందని వైద్యులు పేర్కొంటున్నారు. మెదడులోని టిష్యూ ఒత్తిడికి గురికావడం వల్ల పిల్లలు ఏకాగ్రతను కోల్పోవడం తద్వారా తీవ్రమైన ఒత్తిడికి గురికావడం జరుగుతోంది. ఏకాగ్రత లోపించడం వల్ల అన్నింటిలో వెనుకబడి విశ్వాసం కోల్పోతారు. ఆ తరువాత దిగులు (డిప్రెషన్) ప్రారంభమై ఎవరితో కలిసేందుకు ఇష్టపడరు. ఇది క్రమంగా మానసిక సమస్యలకు దారితీస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇవి మూడు నుంచి పదేళ్ల వయసు మధ్య పిల్లల్లో

... మిగతా 6వ పేజీలో

బర్డ్‌ఫ్లూ టెన్షన్

- చికెన్, గుడ్లు వినియోగంపై అనుమానాలు
- ఆందోళన అవసరం లేదంటున్న వైద్యులు
- బాగా ఉడికించిన తరువాత మాత్రమే తీసుకోవాలని సూచన
- ఆమ్లెట్లు, సగం ఉడికిన గుడ్లు, గ్రిల్డ్ చికెన్, ఉడికీ, ఉడకని చికెన్‌కు దూరంగా ఉంటే మంచిది



- బర్డ్ నుంచి మనిషికి ఫ్లూ సోకే అవకాశం చాలా తక్కువ
- అయినా తగిన జాగ్రత్తలు తీసుకోవడం మేలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్రంలో ఇప్పుడు బర్డ్ ఫ్లూ టెన్షన్ పెడుతోంది. ఫ్లూ బారినపడి అనేకచోట్ల పెద్దఎత్తున కోళ్లు మృతిచెందుతున్నాయి. ఇటువంటి తరుణంలో కోడిమాంసం, గుడ్లు తినొచ్చా?, తినకూడదా?...అనే అనుమానాలు జనంలో వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో పలువురు వైద్యులతో మాట్లాడి అందిస్తున్న ప్రత్యేక కథనం...

బర్డ్ ఫ్లూ అనేది కోళ్లకు, వాటి ద్వారా మనుషులకు వస్తుంది. దీన్ని ఏవియన్ ఇన్‌ఫ్లూయెంజా అని పేర్కొంటారు. దీనిని తొలిసారి 2006లో భారత్‌లో గుర్తించారు. అప్పటి నుంచి అడపాదడపా ఏదో ఒక రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ వ్యాప్తిచెందిందనే వార్తలు వస్తూనే ఉన్నాయి. తాజాగా ఉమ్మడి పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, గుంటూరు జిల్లాల్లో వేలాది కోళ్లు చనిపోయాయి. అయితే, బర్డ్ ఫ్లూ గురించి అంత ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు అంటున్నారు. బర్డ్ ఫ్లూ వెలుగుచూసిన ప్రాంతం నుంచి పది కిలోమీటర్లు మేర మాత్రమే వేగంగా వ్యాప్తి చెందుతుంది. అంతేగాకుండా బర్డ్ ఫ్లూ సోకిన ప్రాంతాల్లో గల ఫారాల్లోని కోళ్లను పూర్తిగా పాతిపెట్టారు. అందువల్ల ఇతర ప్రాంతాలకు వ్యాప్తి చెందే అవకాశం చాలా తక్కువ. అయితే కోడి మాంసం, గుడ్లు తినొచ్చా?...అంటూ పలువురు తెలిసిన వైద్యులను అడుగుతున్నారు. కోడి మాంసాన్ని అధిక డిగ్రీల్లో (160కుపైగా) ఉడికించి

... మిగతా 6వ పేజీలో

బర్డ్ ఫ్లూతో 'జూ'లో అలర్ట్

- మూడు వారాల నుంచి జంతువులకు చికెన్, గుడ్లు సరఫరా నిలిపివేత
- పక్షుల ఎన్‌క్లోజర్ల వద్ద మరిన్ని జాగ్రత్తలు
- నేడే, రేపో ప్రవేశ ద్వారాల వద్ద శానిటైజేషన్ కార్యక్రమం

- 6వ పేజీలో

డీజిల్ పంచాయితీపై కలెక్టర్ సీరియస్

- జీవీఎంసీ మెకానికల్, ప్రజారోగ్య శాఖ అధికారులకు క్లాస్
- ఫాగింగ్ నిలిచిపోవడంపై ఆగ్రహం
- రెండు రోజుల్లో సమస్య పరిష్కరించాలని ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విశాఖపట్నం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ వాహనాలకు డీజిల్, పెట్రోల్ సరఫరాకు సంబంధించి మూడు విభాగాల మధ్య నడుస్తున్న వివాదంపై ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ సీరియస్ అయినట్టు తెలిసింది. డీజిల్ సరఫరా లేకపోవడంతో దోమల నియంత్రణకు ఫాగింగ్, జోన్-2 పరిధిలో చెత్త తరలింపు వాహనాలు నిలిచిపోయిన విషయం తెలిసిందే. అందుకు ఆయా విభాగాల అధికారుల మధ్య నెలకొన్న సమన్వయ లోపమే కారణమంటూ ఈనెల 14న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమవ్వడంతో కలెక్టర్ స్పందించారు. మెకానికల్, ప్రజారోగ్యం, ఆడిట్ విభాగాల అధికారులను శుక్రవారం తన ఛాంబర్‌కు పిలిపించారు. ఫాగింగ్‌తోపాటు జోన్-2 పరిధిలో చెత్త తరలింపు వాహనాలు నిలిచిపోవడానికి గల కారణాలను ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఐ.నరేష్ కుమార్‌ను అడిగి

... మిగతా 6వ పేజీలో



డీజిల్ బిల్లుపై ఆడిట్ అభ్యంతరం

ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన కథనం

భారీ డిస్కౌంట్ల పేరుతో బురిడీ



- బ్రాండెడ్ దుస్తులంటూ ప్రచారం
- అక్కడకు వెళితే అవేవీ కనిపించవు
- మూడు రోజుల్లోనే దుకాణం ఎత్తివేత
- లోపాలు బయటపడితే ఎక్కడికి వెళ్లాలి?
- కొనుగోలుదారులూ తస్మాత్ జాగ్రత్త!!

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

'భారీ డిస్కౌంట్ అమ్మకాలు' పేరుతో విశాఖపట్నం ప్రజలను బురిడీ కొట్టించే సంస్థలు ఎక్కువైపోతున్నాయి. ఇటువంటి విక్రయాలు చేపట్టేవారంతా... విదేశాలకు ఎగుమతి చేయాల్సిన సరకు నౌక రద్దు కావడంతో ఇక్కడే ఉండిపోయిందని, ఫ్యాక్టరీని మూసేస్తున్నామని...అందుకే 60 శాతం నుంచి 70 శాతం తక్కువ ధరకు బ్రాండెడ్ దుస్తులు విక్రయిస్తున్నామని ప్రకటనల ద్వారా ఊదర గొడుతుంటారు. ఈ అమ్మకాలు కూడా ఎక్కువ రోజులు ఉండవని, కేవలం మూడు రోజులు మాత్రమేనని చెబుతారు. ప్రజలకు విశ్వాసం కలిగించేందుకు హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లలో ఈ సేల్స్ పెడుతున్నారు. వాస్తవానికి అక్కడ అమ్మే దుస్తుల్లో బ్రాండెడ్ రకాలు చాలా తక్కువ. ఎప్పుడూ వినని, చూడని బ్రాండ్లే ఎక్కువగా ఉంటున్నాయి. ఫ్యాక్టరీల్లో మిగిలిపోయిన వాటిని, ఆర్డర్లు రద్దయి వెనక్కి వచ్చిన వాటిని

... మిగతా 6వ పేజీలో

పీహెచ్‌సీలో స్వచ్ఛాంధ్ర

మధురవాడ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ విశాఖ కార్యక్రమాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రశాంతి ఆధ్వర్యంలో పరిసరాలను సిబ్బంది శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది వీరబ్రహ్మం, సౌభాగ్యమణి, సత్యవతి, మణికంఠ పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినులకు దుప్పట్ల పంపిణీ



విద్యార్థులతో వైద్యులు మూర్తి, సుందరి

భీమునిపట్నం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): భీమిలి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులకు అపూర్వ హాస్పిటల్ వైద్యులు చిల్డ్రన్స్ స్పెషలిస్ట్ మూర్తి, గైనకాలజిస్ట్ సుందరిలు రగ్గులు, దుప్పట్లు, పెన్నులు, నోట్ పుస్తకాలు అందజేశారు. శనివారం ఇరువురు వైద్యులు ఆ విద్యాలయంలోని తరగతి గదులు, వంటగది, డైనింగ్ హాలు, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం, డాక్టర్ సుందరి మాట్లాడుతూ విద్యార్థినులందరూ బాగా చదువుకుని కుటుంబాలకు, సమాజానికి ఉపయోగకరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, టీచర్లు పాల్గొన్నారు.

గిరిజనుల అభ్యున్నతికి సంత్‌శ్రీ సేవాలాల్ సేవలు అమోఘం



సేవాలాల్‌కు నివాళి అర్పిస్తున్న రాణిమందా

సాగర్‌నగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గిరిజన జాతుల అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత ధర్మగురువు సంత్‌శ్రీ సేవాలాల్ మహరాజ్ అని రుషికొండ గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణా మిషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రాణిమందా అన్నారు. శనివారం సంత్‌శ్రీ సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనచిత్రపటానికి రాణిమందా పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీసీ అండ్ టీఎమ్ సిబ్బంది పాల్గొన్నారు.

రాధాకృష్ణుల విగ్రహాల ప్రతిష్ఠ



రాధాకృష్ణులకు పూజలు చేస్తున్న అర్చకులు

ఆనందపురం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంభీరం పంచాయతీ ఐఐఎం రోడ్డులో ఉన్న హరేకృష్ణ వైకుంఠం ఆధ్వర్యంలో రాధాకృష్ణుల విగ్రహాల శనివారం పూజాదికార్యక్రమాల నడుమ ప్రతిష్ఠించారు. గోపూజతో పూజలకు శ్రీకారం చుట్టారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో హరేకృష్ణ మూవ్ మెంట్ ప్రతినిధులు గౌరచంద్రదాస, వాసుదేవ కేశవ ప్రభు, నిష్కించిన భక్తదాస, తదితరులు పాల్గొన్నారు.

బర్డ్ ఫ్లూ టెన్షన్

... 5వ పేజీ తరువాయి

తినొచ్చని వైద్యులు చెబుతున్నారు. గుడ్లు కూడా బాగా ఉడకబెట్టి తినడం మంచిది. కొద్దిరోజులపాటు ఆమ్లెట్స్, సగం ఉడికిన గుడ్లు తినకుండా ఉండడం మంచిదంటున్నారు. అలాగే, గ్రిల్డ్ చికెన్, ఉడికీ, ఉడకని చికెన్‌కు దూరంగా ఉంటే మంచిదని సూచిస్తున్నారు. బర్డ్ ఫ్లూ నమోదైన ప్రాంతానికి విశాఖ దూరంగా ఉండడం వల్ల ప్రస్తుతం ఇబ్బందేమీ ఉండదని, కానీ తగిన జాగ్రత్తలను పాటించాలని పేర్కొంటున్నారు.

ఇలా వ్యాప్తి..

సాధారణంగా కోళ్ల నుంచి మనుషులకు ఈ వ్యాధి అంత వేగంగా రాదు. ఆయా కోళ్ల ఫారాల్లో పనిచేసే వారికి వచ్చేందుకు ఎక్కువఅవకాశం ఉంటుంది. కోడిమలం, మూత్రం అంటిన వారికి ఈ వైరస్ సోకుతుందని, అది అతి తక్కువ సందర్భాల్లో మాత్రమే జరుగు తుందని వైద్యులు పేర్కొంటున్నారు. కోళ్ల నుంచి మనుషులకు సోకితే మాత్రం స్వైన్ ఫ్లూకు ఇచ్చే మందులు అందించి కోలుకునేలా చేస్తారు. బర్డ్ ఫ్లూ మనుషులకు సోకితేశ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, డయేరియా, పొత్తి కడుపులో నొప్పి, వాంతులు వంటిలక్షణాలు కనిపిస్తాయని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. కేసులు నమోదైన పరిసర ప్రాంతాల్లో ప్రజలకు ముప్పు కొంచెం అధికంగా ఉంటుందని, కాబట్టి అటువంటి వారంతా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నగరంలో ప్రజలకు ఇబ్బంది లేదని, అయితే ప్రస్తుత పరిస్థితుల్లో జాగ్రత్తలు తీసుకోవడం మేలన్నారు.

బడ్డీల తొలగింపును అడ్డుకున్న దుకాణదారులు

- జీవనాధారం లేకుండా చేయవద్దంటూ అభ్యంతరం
- బీచ్‌రోడ్డులో ఉద్రిక్తత
- ఒకరోజు అవకాశం ఇవ్వాలంటూ టీడీపీ నేతలు కోరడంతో తాత్కాలిక వాయిదా



దుకాణాల తొలగింపునకు యత్నిస్తున్న జీవీఎంసీ సిబ్బంది



అధికారులు, పోలీసులతో మాట్లాడుతున్న టీడీపీ నేత గంటా నూకరాజు తదితరులు

భీమునిపట్నం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : భీమిలి బీచ్‌రోడ్డులో బడ్డీల తొలగించేందుకు సిబ్బందితో జీవీఎంసీ అధికారులు రాగా దుకాణదారులు అడ్డుకున్నారు. పర్యాటలకు, సందర్శకుల పార్కింగ్‌కు అవకాశం లేకుండా దుకాణాలు వెలయడంతో వీటి తొలగింపునకు శనివారం మధ్యాహ్నం భీమిలి ఇన్‌చార్జి వార్డు సచివాలయం ప్లానింగ్ సెక్రటరీ ఆర్.శిరీష ఆధ్వర్యంలో మరో పది మంది ప్లానింగ్ సెక్రటరీలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బీచ్‌రోడ్డుకు చేరుకున్నారు. బడ్డీల తొలగింపునకు సిద్ధమయ్యారు. క్రేన్‌తో పబ్లిక్ టాయిలెట్స్‌కు వేళ్లే మార్గంలో అడ్డంగా నిలిపిన రడీమేడ్ దుకాణాన్ని తొలగించడానికి ప్రయత్నించారు. అయితే, వెంటనే దుకాణదారులందరూ బడ్డీ తొలగింపును అడ్డుకోవడంతో ఉద్రిక్తత ఏర్పడింది. అయితే అధికారుల చర్యపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ మూకుమ్మడిగా దుకాణదారులు అడ్డుకున్నారు. దుకాణాలు తొలగిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. తమకు జీవనాధారం లేకుండా చేస్తే తాము ఎలా బతికేదంటూ నిలదీశారు. దీంతో పోలీసులకు సమాచారం అందించడంతో ట్రాఫిక్ ఎస్‌ఐ చిరంజీవి, కానిస్టేబుల్స్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

ఈ విషయం తెలియడంతో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అక్కడకు చేరుకొని దుకాణాలు తొలగించవద్దంటూ అధికారులను కోరారు. దీంతో ట్రాఫిక్ ఎస్‌ఐ చిరంజీవిరావు మాట్లాడుతూ పర్యాటకులకు సదుపాయాలు లేకుంటే ఈ బీచ్‌కు ఎవరు వస్తారని, పర్యాటకులు, సందర్శకులు వస్తేనే కదా వీరికి వ్యాపారాలు సాగేదన్నారు. వారు పార్కింగ్ చేసుకోవడానికి స్థలాలు, టాయ్‌లెట్లుకు వెళ్లడానికి సమస్యలు ఎదురైతే ఎలా అని ప్రశ్నించారు. కనీసం ద్విచక్రవాహనాల నిలిపే స్థలం లేకుండా దుకాణాలు పెట్టేస్తే ఏం చేయాలో మీరే చెప్పాలన్నారు. దీనిపై నూకరాజు మాట్లాడుతూ ఈ సమస్యను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లామని, ఒక రోజు అవకాశం ఇస్తే, దుకాణదారులందరితో సమావేశం ఏర్పాటు చేసి తగిన చర్యలు తీసుకోవచ్చని సూచించారు. దీంతో బడ్డీల తొలగింపును అధికారులు తాత్కాలికంగా వాయిదా వేశారు.

దివ్యాంగ పింఛనుదారుల పరిశీలన



దివ్యాంగ పింఛనుదారులను పరిశీలిస్తున్న అధికారులు

భీమునిపట్నం (రూరల్) ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో దివ్యాంగ పింఛనుదారుల పరిశీలనను శనివారం స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యుల సహకారంతో అధికారులు చేపట్టారు. ఎవరైనా అనర్హులు ఉంటే వారిని పింఛనుదారుల జాబితా నుంచి తొలగించనున్నట్టు అధికారులు తెలిపారు. శనివారం తాళ్లవలస, తాటితూరు పరిధిలో 79 మందికి నోటీసులు జారీ చేయగా వారిలో 76 మంది హాజరయ్యారని అధికారులు తెలిపారు. కాగా ఈ నెల 16న మజ్జిపేట, మూలకుద్దు, చిప్పాడ సచివాలయాల పరిధిలో పరిశీలన ఉంటుందని తెలిపారు. 19న పెద నాగమయ్యపాలెం, సింగనబంద, నగరపాలెం పంచాయతీలు, 20న అమనాం, అన్నవరం, దాకమర్రి, లక్ష్మీపురం పంచాయతీలలో చేపట్టామని అన్నారు. ప్రతిరోజూ రోజుకు వంద మందికి తక్కువ కాకుండా ఈ పరిశీలిస్తున్నట్టు తెలిపారు. మొత్తం పరిశీలన పూర్తయ్యాక ఎంతమంది అనర్హులున్నారో గుర్తిస్తామని ఎంపీడీవో హన్మంతరావు తెలిపారు.

రైతు కార్డు కోసం పేర్లు నమోదు తప్పనిసరి : ఏవో

పద్మనాభం రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : సొంత వ్యవసాయభూమి ఉన్న రైతులు రైతు కార్డు పొందేందుకు దగ్గరలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించి పేర్లు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎంవీ చలం అన్నారు. శనివారం మండలంలోని మద్ది గ్రామంలో రైతు సేవా కేంద్రాన్ని ఏవో సందర్శించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రభుత్వం అందించే వివిధ పథకాలను పొందేందుకు సొంతభూమి కలిగిన రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ లింక్ అయిన ఫోన్ నెంబరుతో స్థానికంగా ఉన్న రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు. అక్కడ రైతుల వివరాలను వ్యవసాయ సిబ్బంది ఆన్‌లైన్ ద్వారా నమెదు చేసి 12 అంకెల నెంబరును జారీ చేస్తారన్నారు. ఈ నెంబరు ఆధారంగా పంట కొనుగోలు, బ్యాంకు రుణాలు, రాయితీలు, ఇతర పథకాలకు అర్హులవుతారని చెప్పారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయ సిబ్బంది కూడా గ్రామాల్లో రైతులకు రైతు కార్డు పొందే విధానంపై అవగాహన పెంచి పేర్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మద్ది ఏఏవో అహమ్మద్ గౌస్, పలువురు రైతులు రైతు సేవా కేంద్రాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మక బోధనపై ఉపాధ్యాయులకు శిక్షణ

తగరపువలస, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : 'నూతన విద్యావిధానంలో సృజనాత్మక బోధన' అంశంపై చిట్టివలస పాఠశాల సముదాయంలో 1 నుంచి 10వ తరగతి బోధించే ఉపాధ్యాయులకు శనివారం శిక్షణ నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం మురళీమోహన్ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లుగా నియమితులైన ఉపాధ్యాయులతో ఇంటరాక్టివ్ ప్లాన్ ప్లాట్ ద్వారా శిక్షణ అందించారు. విద్యార్థుల్లో విద్యాప్రమాణాలు తెలుసుకోవడం, సామర్థ్యాలను పెంపునకు తీసుకోవాల్సిన చర్యలు, పాఠశాలల్ని బలోపేతం చేయడం వంటి విషయాలను తెలియజేశారు. ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు రోజామణి, జగన్నాథస్వామి, శ్రీనివాస్, సీఆర్పీలు త్రినాథ్, కుమారి తదితరులు పాల్గొన్నారు.

కాగా, శనివారం ఇదే సమయంలో మండలంలోని మంగమారిపేట, భీమిలి, చిప్పాడ, తాళ్లవలస, లక్ష్మీపురం ఉన్నత పాఠశాలల పాఠశాలల సముదాయాల్లో ఇలాంటి కార్యక్రమం నిర్వహించినట్టు ఎంఈవో శివరాణి తెలిపారు.



సింహాచలం రాజగోపురం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, తదితరులు



ఆనందపురం మండలాభివృద్ధి అధికారి కార్యాలయ ఆవరణలో...

పలు ప్రాంతాల్లో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర నిర్వహణ

భీమునిపట్నం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పిలుపు మేరకు శనివారం పలు ప్రాంతాల్లో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా ఇక్కడి ప్రభుత్వ ఎస్‌వీఎల్‌ఎన్‌ఎస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు తడి, పొడి, ప్రమాదకరమైన చెత్తలపై వివరించారు. ఈ చెత్తలను వేరే చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ కలిసి నిర్వహించాక కాలేజీ ఆవరణలో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ఆవరణను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, స్వచ్ఛాంధ్ర నోడల్ ఆఫీసర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఫణికుమార్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. అనంతరం స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు.

ఆనందపురం: మనకు నిత్యం కనిపించే వ్యర్థాలను వేరు చేయడం, వాటిని సద్వినియోగం చేసుకోవడమే స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని జిల్లా పంచాయితీ అధికారి శ్రీనివాస్ అన్నారు. ఇక్కడి మండలాభివృద్ధి కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ తమ ఇళ్లల్లో తడి, పొడి, ప్రమాదకర చెత్తలను వేరు చేయడానికి ప్రత్యేకంగా డస్ట్ బిన్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే అందరూ ఆరోగ్యంగా ఉంటారన్న విషయాన్ని గుర్తించుకోవాలని కోరారు. పారిశుధ్య కార్మికులకు మూడు రకాల వ్యర్థాలను వేరుగా సేకరించడం, తరలించడంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఎల్‌వీపాలెం పాఠశాలలో విద్యార్థులతో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర అంశంపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డీపీవో వేములవలసలోని చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జానకి, పంచాయతీ విస్తరణాధికారి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం: పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా స్వచ్ఛాంధ్ర సాధనకు కృషి చేస్తామని సింహాచల దేవస్థానం ఉప కార్యనిర్వహణాధికారి సింగం రాధ ఆధ్వర్యంలో ఆలయ రాజగోపురం వద్ద అధికారులు, సిబ్బంది, భక్తులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా రాధ మాట్లాడుతూ ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రను నిర్వహిస్తామన్నారు. అనంతరం దేవస్థాన పారిశుధ్య కార్మికులతో కలిసి మాడవీధులను శుభ్రం చేశారు. ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పర్యవేక్షణాధికారి రాజ్యలక్ష్మి, డీఈఈ డీవీఎస్ రామరాజు (హరి), తదితరులు పాల్గొన్నారు. అలాగే పౌరులంతా చేయి చేయి కలుపుదాం-స్వచ్ఛ భారత్ సాధనకు కృషి చేద్దామంటూ 98వ వార్డు పరిధి సింహాచల నగర్‌లో విద్యార్థులు ర్యాలీ చేశారు. ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం జి.సన్యాసి రావు, కేజీహెచ్ నర్సింగ్ కాలేజీ విద్యార్థులు, లెక్చరర్లు, తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌నగర్: సాగర్‌నగర్ సమీపంలోని అంధ బాలికల ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో ఇన్ఫోసిస్ సీఎస్సార్ విభాగం వలంటీర్లు, పాఠశాల సిబ్బంది స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో 110 మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఇన్ఫోసిస్ సీఎస్సార్ విభాగం అధికారం కిశోర్, వైజాగ్ వలంటీర్ల ప్రతినిధి సతీశ్, పాఠశాల హెచ్‌ఎం కె.నూర్జహాన్, తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాది: స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కమాండెంట్ కేవీ మురళీకృష్ణ అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా బక్కన్నపాలెం 16వ పోలీస్ బెటాలియన్‌లో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే చంద్రంపాలెం జడ్పీ ఉన్నతపాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం గొట్టేటి రవి, తదితరులు పాల్గొని విద్యార్థులతో కలిసి పరిసరాలను పరిశుభ్రం చేశారు.

పద్మనాభం-రూరల్: మండలంలోని 22 పంచాయతీల్లో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టారు. పద్మనాభంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఎంపీడీవో ఎం.విజయ్‌కుమార్, ఈవోపీఆర్డీ మీనాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ: ఇక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి ఆధ్వర్యంలో పరిసరాలను సిబ్బంది శుభ్రం చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే అనారోగ్యాలు దరిచేరవని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది వీరబ్రహ్మం, సౌభాగ్యమణి, సత్యవతి, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

దొంగను పట్టుకోబోయి.. రైలు ఢీకొని.. ఢిల్లీలో 'అనంత' జవాన్ మృతి



జవాన్ లక్ష్మన్న

బ్రహ్మసముద్రం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): భార్య మెడలోని తాళిబొట్టు గొలుసును తెంచుకువెళుతున్న దొంగను పట్టుకునే క్రమంలో రైలు కిందపడి జవాన్ లక్ష్మన్న(32) మృతి చెందారు. ఈ ఘటన ఢిల్లీలో శుక్రవారం రాత్రి జరిగింది. అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం మండల కేంద్రానికి చెందిన లక్ష్మన్న, 2014లో బీఎస్ఎఫ్ జవానుగా ఉద్యోగంలో చేరారు. డిసెంబరులో ఆయన జమ్మూ కశ్మీర్‌కు బదిలీ అయ్యారు. లక్ష్మన్నకు ఐదేళ్ల క్రితం కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లాకు చెందిన లక్ష్మీతో వివాహమైంది. నెల క్రితం లక్ష్మన్న సెలవుపై సకుటుంబ సమేతంగా సొంతూరికి వచ్చా రు. 16న విధుల్లో చేరాల్సి ఉండడంతో బుధవారం తిరుగు ప్రయాణమయ్యారు. శుక్రవారం రాత్రి హజరత్ నిజాముద్దీన్ ఈస్ట్ రైల్వేస్టేషన్‌కు 50 కి.మీ. దూరంలో రైలు నెమ్మదిగా వెళ్తున్న సమయంలో లక్ష్మి మెడలోని మంగళ సూత్రాన్ని ఒక దొంగ లాక్కొని పరుగులు తీశాడు. దొంగను పట్టుకునేందుకు రైలు నుంచి లక్ష్మన్న కిందకు దూకగానే పక్క ట్రాక్‌పై వచ్చిన రైలు ఢీకొట్టింది. దీంతో లక్ష్మన్న అక్కడికక్కడే మృతి చెందారు. కళ్లెదుటే భర్త మృతి చెందడంతో లక్ష్మి స్పృహ తప్పి పడిపోయారు. అక్కడే ఉన్న మరో జవాను లక్ష్మన్న కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. విధుల్లో చేరటానికి వెళ్లిన కుమారుడి మృతి వార్త విని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

బర్డ్ ఫ్లూతో 'జూ'లో అలర్ట్

విశాఖపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : గోదావరి జిల్లాల్లో బర్డ్ ఫ్లూ వైరస్ ప్రబలడంతో నగరంలోని ఇందిరా ప్రియదర్శిని జంతుప్రదర్శనశాల (జూ) అధికారులు అప్రమత్తమయ్యారు. వాస్తవానికి మూడు వారాల క్రితం పాట్నా జూలో కొన్ని పక్షులకు వైరస్ సోకినప్పుడే సెంట్రల్ జూ అథారిటీ దేశంలోని అన్ని జంతుప్రదర్శన శాలలను అలర్ట్ చేసింది. దీంతో జంతువులకు ఆహారంగా చికెన్, గుడ్లు ఇవ్వడాన్ని నిలుపుదల చేశారు. చికెన్‌కు బదులుగా మటన్ సరఫరా చేస్తున్నారు. ఇంకా పక్షులు ఉండే ఎన్‌క్లోజర్ల నిర్వహణ విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వాటి వద్ద విధులు నిర్వహించే సిబ్బంది ఇంటి నుంచి వచ్చిన తరువాత విధిగా డ్రెస్ మార్చుకోవాలి. అది కూడా ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అధికారులు ఆదేశించారు. పక్షులున్న ఎన్‌క్లోజర్ల వద్దకు ఇతర జంతువులు వెళ్లకుండా చూడాలని సూచించారు. ఇంకా సిబ్బందికి శానిటైజ్ బాటిల్స్ సరఫరా చేస్తున్నారు. జంతువులకు ఆహార పదార్థాలు తీసుకువచ్చే వాహనాలను కూడా శానిటైజ్ చేయాలని నిర్ణయించారు. రెండు, మూడు రోజుల్లో జూ రెండు ప్రధాన గేట్ల వద్ద సందర్శకులు కూడా విధిగా చేతులు శుభ్రం చేసుకునేలా శానిటైజ్ బాటిల్స్ సిద్ధం చేయనున్నారు. బర్డ్‌ఫ్లూ వైరస్ ప్రబలుతున్న నేపథ్యంలో జూలో అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని క్యూరేటర్ మంగమ్మ తెలిపారు. జంతువులు, పక్షుల రక్షణకు చర్యలు తీసుకున్నామన్నారు. జూ సందర్శనకు వచ్చే సందర్శకులు ఎన్‌క్లోజర్‌లకు దగ్గరగా వెళ్లి జంతువులు, పక్షులను తాకరాదని, ఆహారం వంటివి వేయవద్దని విజ్ఞప్తి చేశారు. ఎన్‌క్లోజర్లకు దూరంగా ఉండాలని సూచించారు. పక్షులు, జంతువుల రక్షణ ప్రతి ఒక్కరూ జూ అధికారులకు సహకరించాలని కోరారు.

తొలి పది నెలల్లో కస్టమ్స్ ఆదాయం రూ.11,198.36 కోట్లు

... 5వ పేజీ తరువాయి

పోర్టు చైర్మన్ ఎం.అంగముత్తు మాట్లాడుతూ, ఎగుమతి, దిగుమతిదారులకు అనుకూలమైన విధానాలు అమలు చేస్తున్నామన్నారు. వీఎస్ఈజెడ్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. పలువురు వ్యాపారులు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రతినిధులకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కమిషనర్ శ్రీధర్ పాల్గొన్నారు.

భారీ డిస్కౌంట్ల పేరుతో బురిడీ

... 5వ పేజీ తరువాయి

పెద్ద మొత్తంలో కిలోల లెక్కన కొనుగోలు చేసి లారీల్లో నగరానికి తెస్తున్నారు. రోడ్ల పక్కన అమ్మితే మంచి రేటు రాదని...హోటళ్లను ఎంపిక చేసుకుంటున్నారు. వీటిలో చాలా వాటికి ప్యాకింగ్ ఉండదు. అన్ని కుప్పలుగా పోసేస్తుంటారు. సరైన మడతలు (ఫోల్డింగ్స్) కూడా ఉండవు. సైజులు కూడా రెగ్యులర్‌వి ఉండవు. స్టిక్కర్‌పై ఒక నంబరు, దాని ఒరిజినల్ సైజ్ వేరుగా ఉంటుంది. ధరలు కూడా ఎక్కువ వేసేసి, 70 శాతం డిస్కౌంట్ అంటూ వాటిని కూడా రూ.600 నుంచి రూ.1,000కు విక్రయిస్తున్నారు. వాస్తవానికి ఇప్పుడు ఆన్‌లైన్ షాపింగ్ అందుబాటులోకి వచ్చిన తరువాత...సంప్రదాయ షాపింగ్ మాల్స్ కూడా పోటీని తట్టుకోవడానికి ఆ ధరలకే అన్నిరకాల దుస్తులు అందుబాటులో ఉంచుతున్నాయి.

తేడా వస్తే పరిస్థితి ఏమిటి?

నగరంలో ఏ షాపింగ్ మాల్‌లో ఏమి కొన్నా తేడా వస్తే వెళ్లి ఎక్స్ఛేంజ్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లోనూ ఆ సదుపాయం ఉంది. కానీ మూడు రోజుల సేల్ అంటూ వచ్చి, భారీ డిస్కౌంట్లు అంటూ బురిడీ కొట్టించే వారి దగ్గర ఏమైనా కొంటే...ఆ తరువాత తేడా వస్తే అడగడానికి ఇక్కడ ఎవరూ ఉండరు. ఎక్స్ఛేంజ్ సదుపాయం ఉండదు. పోనీ మళ్లీ వచ్చినప్పుడు అడుగుదామంటే ఒకసారి ఒక పేరుతో వచ్చిన వారు రెండో సారి ఆ పేరుతో రావడం లేదు. వేరే పేర్లు పెట్టుకుంటున్నారు. కొనుగోలుదారులు ఈ డిస్కౌంట్ సేల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి.

డీజిల్ పంచాయితీపై కలెక్టర్ సీరియస్

... 5వ పేజీ తరువాయి

తెలుసుకున్నారు. బకాయిలు చెల్లించేంత వరకూ డీజిల్, పెట్రోల్ సరఫరా చేయడానికి ఆథరైజ్డ్ బంకు యజమాని నిరాకరిస్తున్నారని, అందుకే ఫాగింగ్‌తోపాటు జోన్-2 పరిధిలోని చెత్త తరలింపు వాహనాలను నిలిపేయాల్సి వచ్చిందని ఆయన వివరణ ఇచ్చారు. బంకుకు బిల్లు బకాయిలు ఎందుకు చెల్లించలేదని చీఫ్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్‌ను జిల్లాకలెక్టర్ ప్రశ్నించారు. తనకు పూర్తి వివరాలతో బిల్లు పంపించలేదని, కొన్ని అభ్యంతరాలు ఉండడంతో వాటిని పరిష్కరించాలని మెకానికల్ విభాగం అధికారులకు సూచించినా, ఇంతవరకూ స్పందించలేదని ఆయన చెప్పారు. అనంతరం మెకానికల్ ఎస్ఈ గణేష్‌కుమార్‌ను వివరణ కోరితే తమ వైపు నుంచి అన్ని వివరాలు ఇచ్చామని, ఫాగింగ్‌కు అవసరమైనదానికంటే ఎక్కువ పెట్రోల్, డీజిల్ వినియోగిస్తున్నట్టు ప్రజారోగ్య విభాగం నుంచి బిల్లు పెట్టడంతో తాము అభ్యంతరం వ్యక్తంచేశామని వివరించారు. అధికారులంతా ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడంతో కలెక్టర్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించి, తిరిగి డీజిల్, పెట్రోల్ సరఫరాను పునరుద్ధరించడంతోపాటు ఫాగింగ్ ప్రారంభం కావాలని ఆదేశించారు. అధికారుల మధ్య సమన్వయం లోపం వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే ఉపేక్షించేది లేదని స్పష్టంచేసినట్టు సమాచారం. పత్రికల్లో కథనాలు వచ్చేంత వరకూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురాపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తంచేసినట్టు తెలిసింది. దీంతో రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చినట్టు తెలిసింది.

అమ్మాయిలు మిస్సింగ్!

... 5వ పేజీ తరువాయి

సోషల్ మీడియాలో పెడతామని, కుటుంబ సభ్యులకు పంపిస్తామని బెదిరింపులకు దిగుతుంటారు. ఈ పరిస్థితిని యువతుల నుంచి పెళ్లై పిల్లలు ఉన్న మహిళల వరకూ ఎదుర్కొంటున్నారు. కొంతమంది బయటకు వెళ్లిపోయి పెళ్లి చేసుకుని కొద్దిరోజులకే మోసపోతున్నారు.మరికొందరు మోసగాళ్ల బెదిరింపులు, బ్లాక్‌మెయిల్‌కు భయపడి వారు చెప్పి నట్టు చేస్తున్నారు. ఇంకొందరు మాత్రం తమ వీడియోలు ఫొటోలు ఎక్కడ బయపెట్టేస్తే కుటుంబసభ్యులు, బంధువులు ఎదుట తలెత్తుకుని బతకలేమనే మనస్తాపంతో ఇళ్లు విడిచిపోతున్నారు. ఈ తరహా కేసులు గత కొంతకాలంగా పెరుగుతుండడం ఆందోళనకు గురిచేస్తోంది. గత ఏడాది జనవరి ఒకటి నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 12వ తేదీ వరకూ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో 539 మంది మహిళలు అదృశ్యమైతే వారిలో 388 మందిని పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాలికల విషయానికి వస్తే గత ఏడాది జనవరి 1 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 12 వరకు 163 మంది అదృశ్యమైతే వారిలో 149 మందిని పోలీసులు కనిపెట్టి నగరానికి తీసుకువచ్చారు.

పిల్లలను ఓ కంట కనిపెట్టండి

... 5వ పేజీ తరువాయి

కనిపిస్తుంటాయనిచెబుతున్నారు. ఆ తరువాత దశలో పిల్లలు వ్యవహారశైలి మరింత ఇబ్బందికరంగా మారేఅవకాశం ఉందంటున్నారు.

తీవ్రంగా స్పందించే తీరు..

12 నుంచి 14 ఏళ్ల వయసుకు వచ్చేసరికి కొంతమంది పిల్లల వ్యవహారశైలి పూర్తి భిన్నంగా ఉంటోంది. కోర్కెలు పెరుగుతున్నాయి. వాటిని తీర్చుకునే మార్గాల కోసం అన్వేషిస్తుంటారు. ఆ సమయంలో పిల్లలను తల్లిదండ్రులు మరింత జాగ్రత్తగా కనిపెట్టుకుని ఉండాలి. పిల్లల స్నేహితులు, వారి అలవాట్లు, తిరిగే ప్రదేశాలు గురించి స్పష్టమైన అవగాహన ఉండాలి. లేకపోతే తప్పుడు మార్గాల వైపు వెళ్లే ప్రమాదం ఉంది. పిల్లల వ్యవహారశైలి భిన్నంగా ఉంటే మాత్రం కాస్త అప్రమత్తంగా ఉండి తల్లిదండ్రులు వారితో ఎక్కువ సమయం గడపడం ద్వారా విపరీతమైన సమస్యలకు దారి తీయకుండా కాపాడుకోవచ్చు. ఈ వయసులో పిల్లలు అనేకం కోరుతుంటారు. వాటిని తీర్చే విషయంలో తల్లిదండ్రులు కొంత జాగ్రత్తగా వ్యవహరించాలి.ఆర్థిక పరిస్థితులు, కుటుంబ ఇబ్బందులు వంటివి అర్థమయ్యేలా చెప్పి కాదనాలి. అవసరమైనవి అయితే కొంత ఇబ్బంది అయినా కొనవచ్చు. అవసరం లేనివి అడిగితే మాత్రం...ఆ విషయాన్ని అర్థమయ్యేలా చెప్పాలి. కొట్టో, తిట్టో వద్దని చెప్పడం వల్ల పిల్లలు మరింత అగ్రెసివ్‌గా తయారై, తల్లి దండ్రుల పట్ల కసిని పెంచుకునే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఈ వాతావ రణం విపరీతమైన పరిణామాలకు దారి తీయవచ్చు.

గుడ్ పేరెంటింగ్‌తో పరిష్కారం

గుడ్ పేరెంటింగ్ అన్నది చాలా కీలకం. పిల్లలను పెంచే విధానమే భవిష్యత్తులో వారి జీవితాలకు భరోసాను కల్పిస్తుంది. ప్రతిరోజూ కొంత సమయం పిల్లలతో గడపాలి. చిన్న వయసు నుంచి ఇలా సమయం వెచ్చించడం చాలా మంచిది. పదేళ్లు దాటిన తరువాత మాత్రం తప్పనిసరి. అప్పుడే పిల్లల్లో వచ్చే విపరీతమైన మార్పులను గుర్తించి వాటిని సరిచేసేందుకు అవకాశం ఉంటుంది. ప్రతిరోజూ మంచి,చెడులు,సమాజంలో వస్తున్న మార్పులు, ఇంట్లో ఉన్న పరిస్థితులను, వారి బాధ్యతలను తెలియజేస్తూ ఉండాలి. గుడ్ పేరెంటింగ్ మాత్రమే పిల్లలను మంచి మార్గంలో తీసుకువెళ్లేందుకు దోహదం చేస్తుందని నిపుణులు చెబున్నారు.

ఇలా చేయాలి..

చిన్న వయసు నుంచి పిల్లలను నలుగురితో కలిసేలా చేయాలి. శారీరక శ్రమ కలిగించే యాక్టివిటీస్‌లో భాగం చేయడం ద్వారా ఫోన్ వంటి వాటికి దూరంగా ఉంచవచ్చు. ఇరుగు పొరుగుతో కలిసి ఆడుకునేలా ప్రోత్సహించాలి. దీనివల్ల పిల్లల్లో ఆత్మన్యూనతా భావం తగ్గుతుంది. పెద్దలు చెప్పే మాటలను వినేలా అలవాటు చేయాలి. పుస్తకాలు చదివేలా ప్రోత్సహించాలి. ఇలా చేయడం వల్ల పిల్లల్లో మొండితనం తగ్గుతుంది.

ప్రాథమిక స్థాయిలోనే గుర్తించాలి

-డాక్టర్ ముత్యాలబాలాజీ,
మానసిక నిపుణులు

కొన్నాళ్లుగా పిల్లల్లో అతి ప్రవర్తన ప్రధానమైన సమస్యగా ఉంటోంది. కౌమార దశ దాటిన తరువాత పిల్లల్లో ఈ తరహా వ్యవహారశైలి అధికంగా కనిపిస్తోంది. ఎంత చెప్పినా పిల్లలు దారిలోకి రావడం లేదని తల్లిదండ్రులు మా వద్దకు తీసుకువస్తున్నారు. అటువంటి వారికి కౌన్సెలింగ్ చేయాల్సి వస్తోంది. తల్లిదండ్రులు ప్రాథమిక దశలో పిల్లల వ్యవహారశైలిని గుర్తించి చక్కదిద్దే ప్రయత్నం చేస్తే ఈ ఇబ్బంది ఉండదు. పిల్లల్లో నియంత్రించలేని ప్రవర్తన, కడుపు నొప్పి, తలనొప్పి, దీర్ఘకాలం విచారంగా ఉండడం, కారణం లేకుండా బరువు తగ్గడం, చదువులో చురుకుదనం లేకపోవడం, మానసిక కల్లోలం, చికాకు వంటి లక్షణాలు కనిపిస్తే అప్రమత్తం కావాలి. ప్రతి చిన్నదానికి అలగడం, కోప్పడడం వంటివి కూడా పిల్లల్లో మానసిక ఇబ్బందులకు కారణంగా గుర్తించాలి.



నిందితులు, పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనం

కబేళాకు ఆవులు తరలిస్తున్న వాహనం స్వాధీనం

» ఇద్దరిపై కేసు నమోదు

ఆరిలోవ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఆవులను కబేలాకు తరలిస్తున్న ఓ వాహనాన్ని బాలాజీనగర్ వద్ద స్థానికుడు కోడిబోయిన బాబ్జీ యాదవ్ అడ్డుకొని స్థానిక పోలీసులకు అప్పగించి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సిబ్బందితో వచ్చి వాహనాన్ని, ఐదు ఆవులను స్వాధీనం చేసుకున్నారు. బాలాజీ నగర్‌కు చెందిన మహమ్మద్ రఫీతో పాటు సువ్వాడ గణేశ్‌ను అదుపులోకి తీసుకున్నట్టు సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. నిందితులు ఈ ఆవులను రాజాం సంతలో కొనుగోలు చేసి తీసుకొని వచ్చినట్టు సీఐ తెలిపారు. వీటిని ఆరిలోవలో గల అనధికార కబేలాలలో వధించేందుకు తీసుకొని వెళుతున్నారని చెప్పారు. ఆవులను గోశాల నిర్వాహకులకు అప్పగిస్తామని సీఐ తెలిపారు.

కృష్ణా కళాశాలలో స్వచ్ఛత ప్రతిజ్ఞ

మద్దిలపాలెం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఎన్‌సీసీ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది, ఎన్‌సీసీ క్యాడెట్స్ కళాశాల పరిసరాలను పరిశుభ్రం చేశారు. మరుగుదొడ్లు, వాటర్ ప్లాంట్ శుభ్రం చేశారు. పిచ్చిమొక్కలు, చెత్తకాగితాలు, వ్యర్థాలు తొలగించారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించారు. అనంతరం ఎన్‌సీసీ అధికారి బి.సన్యాసిరావు స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఆర్వినాయుడు, మురళీకృష్ణ, బాలమురళీ,అప్పారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగాలను పరిరక్షించుకోవాలి

సిరిపురం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించుకోవాలని, లేనిపక్షంలో అనేక పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని సంఘమిత్ర సూరిబాబు తెలిపారు. శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంఘమిత్ర సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలోప్రజా గాయకుడు 'మజ్జి దేవిశ్రీ పాట- సంఘమిత్ర సూరిబాబు మాట' పేరిట కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్రహ్మకుమారి రమ, ఏయూ విశ్రాంతాచార్యులు సూరప్పడు సంఘమిత్ర సభ్యులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **లైలా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక), మౌర్య (గోపాలపట్నం),
- **తండేల్:** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ(గోపాలపట్నం), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)
- **మదగజరాజ:** జగదాంబ, సౌజన్య (గోపాలపట్నం),
- **సంక్రాంతికి వస్తున్నాం:** శారద, మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్:** శరత్, శ్రీకన్య, కిన్నెర, సుకన్య, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 10, వంకాయలు (తెలుపు)14, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 40, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 40, బీరకాయలు 50, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 12, క్యారెట్ 28 దొండకాయలు 22, బంగాళ దుంపలు 13, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది)45, బరబాటి 26, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 70, బద్దచిక్కుడు 26, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 34, కీరదోస 30, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమ దుంపలు 32 చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 26, గోరు చిక్కుడు 28, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్ కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	96
లైవ్ ధర	116
విత్ స్కిన్	202
స్కిన్‌లెస్	212

వ్యర్థ రహిత విశాఖగా తీర్చిదిద్దుదాం

» నగర వాసులకు కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ హరేంధిరప్రసాద్ పిలుపు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : వ్యర్థ రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దుదామని విశాఖ జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ పేర్కొన్నారు. ప్రతి నెలా 3వ శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా 2వ జోన్ పరిధి ఎండాడలోని ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ ప్రాంగణంలో వ్యర్థాల విభజన,సేంద్రీయ ఎరువు తయారీ వాటి వినియోగంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్లల్లో వ్యర్థాలను కాలువలు, బహిరంగ ప్రదేశాల్లో పడవేయకుండా తడి, పొడి చెత్తగా విభజించి జీవీఎంసీ పారిశుధ్య సిబ్బందికి అందజేయాలన్నారు. తడి వ్యర్థాల నుంచి ఇంటి వద్దే సేంద్రియ ఎరువులను తయారు చేసుకుని మిద్దె తోటలు, కమ్యూనిటీ గార్డెన్లలో కూరగాయలు, పండ్లు, పూల మొక్కలకు వినియోగించుకోవాలని సూచించారు. తద్వారా ఆర్థిక లాభం చేకూర్చుకోవడమే కాకుండా, ఆహ్లాదకర పర్యావరణం చేకూరి ఆరోగ్య జీవనానికి దోహదపడుతుందన్నారు. అలాగే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులకు స్వస్తి పలికి ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలన్నారు. వ్యర్థాల పునర్వినియోగ ప్రక్రియకు నివాసిత సంక్షేమ సంఘాలు, ఎస్‌హెచ్‌జీ మహిళా సభ్యులు, ఆర్పీలు సహకరించినట్లయితే వ్యర్థ రహిత నగరంగా విశాఖ ప్రజల సహకారంతో తీర్చిదిద్దవచ్చన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్, తడి, పొడి, ప్రమాదకర వ్యర్థాల విభజన ప్రక్రియ నుంచి ఎరువు తయారు చేసే ప్రక్రియ ప్రదర్శనను పరిశీలించారు. అనంతరం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. అవగాహన ర్యాలీలో కలెక్టర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



చెత్త విభజన ప్రక్రియను పరిశీలిస్తున్న హరేంధిరప్రసాద్, ఏడీసీ సోమన్నారాయణ తదితరులు



రైతు బజార్‌లో పరిసరాలను శుభ్రం చేస్తున్న రైతులు

రైతుబజార్‌లో పరిసరాల శుభ్రత

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 15 : స్థానిక రైతుబజార్‌లో రైతులు, డ్వాక్రా కౌంటర్లు, ఇతర వాణిజ్య దుకాణాల సిబ్బంది శనివారం శ్రమదానం చేశారు. స్వర్ణాఆంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా పరిసరాలను శుభ్రం చేశారు. ఎస్టేట్ అధికారి వరహాలు, సహాయకుడు కనకరాజు ఆధ్వర్యంలో అందరూ కలసి పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు.

ఉషోదయ కూడలిలోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివాస్ నిర్వహించారు. ప్రాజెక్టు హెడ్ సత్తిబాబు ఆధ్వర్యంలో సిబ్బంది కార్యాలయం పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఈఈ శ్రీనివాసరావు, మేనేజర్ మేరీ గ్రేస్, జిల్లా హౌసింగ్ కార్యాలయం సిబ్బంది, డీఈలు, ఏఈలు, ఇతర ఉద్యోగులు శ్రమదానంలో పాలుపంచుకున్నారు.



ఎంపీ శ్రీభరత్‌ను సత్కరించి స్వాగతం పలుకుతున్న నాయకులు

ఎంపీ శ్రీభరత్‌కు సాదర స్వాగతం

గోపాలపట్నం,ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): డివిజన్‌తో కూడిన రైల్వే జోన్‌ను కేంద్రం ప్రకటించాక ఢిల్లీ నుంచి విశాఖ వచ్చిన విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్‌కు రైల్వే యూనియన్ నాయకులు విమానాశ్రయంలో ఘనంగా స్వాగతం పలికారు. శనివారం సాయంత్రం ఢిల్లీ నుంచి విశాఖ చేరుకున్న ఎంపీకి రైల్వే యూనియన్ నేత చలసాని గాంధీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, పలువురు రైల్వే యూనియన్ నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ విశాఖలో రైల్వే అభివృద్ధికి కృషి చేస్తానని, సౌత్ కోస్ట్ రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభించాలని కేంద్రాన్ని కోరుతామన్నారు. అనంతరం నాయకులు, ఉద్యోగులు శ్రీభరత్‌ను సత్కరించారు.

వీఎంఆర్డీఏలో స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర



ప్రతిజ్ఞ చేస్తున్న వీఎంఆర్డీఏ అధికారులు, ఉద్యోగులు

సిరిపురం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్డీఏ భవన్‌లోని శనివారం స్వచ్ఛంధ్రప్రదేశ్-స్వచ్ఛ దివాస్‌ను నిర్వహించారు. ఉద్యోగ్ భవన్ పరిసరాల్లోని ఉన్న చెత్తాచెదారాన్ని ఉద్యోగులందరూ తొలగించి శుభ్రపరిచారు. అనంతరం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని, నగరాన్ని పచ్చగా మార్చేందుకు కృషి చేస్తామని కార్యదర్శి మురళీకృష్ణ ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాధన్ ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. విశాఖ నగరాన్ని, మనమున్న పరిసరాలను మరింత పరిశుభ్రంగా పచ్చగా మార్చేందుకు కృషి చేస్తామని ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ కె.రమేష్, కార్యదర్శి టి.మురళీకృష్ణ, చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్ప, హరిప్రసాద్, ఇంజనీరింగ్, ప్రణాళికాధికారులు, పరిపాలనాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న విమ్స్ వైద్యులు, సిబ్బంది

విమ్స్‌లో మొక్కలు నాటిన వైద్యులు

ఆరిలోవ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : విశాఖ వైద్య విజ్ఞానసంస్థ (విమ్స్)లో ఆస్పత్రి సిబ్బంది పరిసరాలను శుభ్రం చేశారు. స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివాస్‌లో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సంస్థ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు ప్రారంభించారు. విమ్స్ ఆవరణలో మొక్కలునాటారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ పరిసరాల శుభ్రత వల్ల ఆరోగ్య పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో విమ్స్ డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అలాగే విశాఖ కేంద్ర కారాగారంలో అధికారులు, సిబ్బంది ప్రధాన ద్వారా వద్ద పరిసరాలు శుభ్రం చేశారు. జైలు సూపరింటెండెంట్ మహేశ్‌బాబు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం ఉండే పరిసరాలు ఎప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవడం ద్వారా ఆరోగ్య పరిరక్షణ, వాతావరణం ఆహ్లాదంగా ఉంటుందన్నారు.



కేంద్ర కారాగారం వద్ద చెత్తను తొలగిస్తున్న అధికారులు, సిబ్బంది

మౌలిక వసతుల కల్పనకు సమష్టి కృషిచేయాలి

» ప్రజారోగ్యం, పన్నుల వసూళ్లు పకడ్బందీగా చేపట్టాలి
» ప్రభుత్వ భూఆక్రమణలు జరిగితే ప్లానింగ్ కార్యదర్శులపై చర్యలు
» జీవీఎంసీ ఉన్నతాధికారులతో విశాఖ జిల్లా కలెక్టర్ సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : నగర ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో జీవీ ఎంసీ అధికారులు సమష్టిగా పని చేయాలని విశాఖ జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ డాక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్లో గ్రేటర్ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలో చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఇందుకోసం సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా ప్రబలకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన ప్రాంతాలలో ఫాగింగ్, స్ప్రెయింగ్ వంటివి చేపట్టాలని ప్రజారోగ్య విభాగం అధికారులకు స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా ప్లానింగ్ కార్యదర్శులు, వీఆర్వోలు, జోన్ల కమిషనర్లు సంయుక్తంగా ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నిత్యం పరిశీలించాలన్నారు. ప్రభుత్వ భూములలు ఆక్రమణకు గురైతే సంబంధిత ప్లానింగ్ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బీచ్‌రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాలు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని నగరంలో గల డెబ్రిస్‌తో కప్పి వేసి విస్తరణ చేసేందుకు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రణాళికఅధికారులను ఆదేశించారు. ఎక్కడా తాగునీరు కలుషితం కాకుం డా చూడాలన్నారు. వీధి దీపాలు, తాగునీరు, పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలన్నారు. మార్చి 31 నాటికి రావాల్సిన రూ.100 కోట్ల పన్నులను వసూలు చేయాలని డీసీఆర్ శ్రీనివాస్‌ను ఆదేశించారు. అన్ని వార్డుల్లో నిత్యం జోనల్ కమిషనర్లు పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

విస్తృతంగా పోలీసు తనిఖీలు

ఆరిలోవ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : హనుమంతవాక జంక్షన్‌లో పలుద్విచక్రవాహనాలను ట్రాఫిక్ పోలీసులు శనివారం తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్ లేకుండా నడపిన వారిని, త్రిబుల్ రైడింగ్ చేసిన వాహన దారులు వాహనదారులకు చలానా విధించారు.

గృహమిత్ర ధరలను పరిశీలించిన అధికారులు

పెదవాల్తేరు. ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రైతు బజార్‌లోని గృహమిత్రలో అధిక ధరలకు సరుకులు విక్రయిస్తుండడంపై మార్కెటింగ్ శాఖ అధికారులు స్పందించారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'లో 'గృహమిత్రలో అధిక ధరలపై జనం గగ్గోలు' శీర్షికన వచ్చిన కథనానికి స్పందించిన అధికారులు రైతుబజార్‌ను సందర్శించారు. ధరల పట్టికలను పరిశీలించారు. గృహమిత్ర నిర్వాహకులు ప్రసాద్, రైతుబజార్ ఎస్టేట్ అధికారి సత్యకళకు నోటీసులు జారీ చేశారు.

జోన్-3లో దోమల బెడద

యంత్రాల కొరతతో అంతంతమాత్రంగా ఫాగింగ్



ఆధునిక యంత్రాలు లేకపోవడంతో చేతి మిషన్‌తో ఫాగింగ్ వేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

మద్దిలపాలెం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ జోన్-3లో దోమలు బెడద ఎక్కువైంది. డ్రైనేజీలు, గెడ్డలు పూడికలతో నిండిపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. నీటి నిల్వలలో లార్వా పెరిగి దోమల వ్యాప్తి చెందుతున్నాయి. వీటి బాధ పగలు, రాత్రి అన్న తేడా లేకుండా ఉంది. దోమలు అధికంగా ఉండడంతో వీటి నివారణకు ప్రజలు తాత్కాలిక ఉపశమన చర్యలు చేపడుతున్నా ఫలితం ఉండడం లేదు. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో దోమల బెడద ఎక్కువగా ఉంటోందని ప్రజలు వాపోతున్నారు. దోమల దెబ్బకు జ్వరాల పాలవుతున్నామంటూ పలువురు వాపోతున్నారు. పిల్లలు సైతం వైరల్ ఫీవర్‌తో ఇబ్బందులకు గురవుతున్నారు. పారిశుధ్య నిర్వహణ సరిగా లేకపోవడం, దోమల నియంత్రణకు ఫాగింగ్ చర్యలు చేపట్టకపోవడంతో సమస్య తీవ్రంగా ఉంటోందని ప్రజలు వాపోతున్నారు.

జోన్-3లో 14 వార్డులు ఉన్నాయి. ఆయా వార్డుల్లో వందల సంఖ్యలో డ్రైనేజీ, గెడ్డలు ఉన్నాయి. వీటికి తోడు రోడ్డు మీదా ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్లు ఉన్నాయి. అంతేకాకుండా కొన్ని వీధుల్లో రోడ్డు మీదే చెత్త పారేస్తున్నారు. వెరసి వార్డులు అధ్వానంగా తయారయ్యాయి. కాల్వల్లో మురికి నీరు, రోడ్డు మీద పారవేసిన తడిచెత్తతో దోమలు విపరీతం పెరిగిపోతున్నాయి.

ఎప్పటికప్పుడు డ్రైనేజీలు, చెత్త కుప్పలు తొలగించకపోవడం ఈ సమస్య మరింతా జటిలమైంది.

ఫాగింగ్ యంత్రాల కొరత

జోన్-3 పరిధిలో దోమల నివారణకు పొగ వేసేందుకు అవసరమైన ఫాగింగ్ యంత్రాలు కొరత వెంటాడుతోంది. జోన్ మొత్తానికి 9 చేతి ఫాగింగ్ యంత్రాలు ఉన్నాయి. మెగా ఫాగింగ్ యంత్రం ఒకటి కూడా లేదు. అంతేకాకుండా చేతి యంత్రంతో ఫాగింగ్ వేయాలంటే ఆయిల్ ఖర్చు కూడా ఎక్కువే. చేతి ఫాగింగ్ మిషన్‌తో పొగ వేయాలంటే గంటకు సుమారు 35, 40లీటర్ల డీజల్ ఖర్చు అవుతుంది. ఇంత మొత్తం ఖర్చు చేసే నిధులు లేక కేవలం ఫిర్యాదు వచ్చిన ప్రాంతంలో మాత్రమే జీవీఎంసీ అధికారులు ఫాగింగ్ చేస్తున్నారు. రోజుకు నాలుగైదు ప్రాంతాల్లో చేతి మిషన్‌తో ఫాగింగ్ వేసి చేతులు దులుపుకుంటున్నారు. మెగా ఫాగింగ్ యంత్రంతో అయితే ఎక్కువ ఫలితాలు ఉంటాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. మెగా ఫాగింగ్ యంత్రం ఆటోలో తిప్పితేనే దోమలు తగ్గుదల ఉంటుంది. వీధుల్లో ఆటోలో ఫాగింగ్ వేసి దాదాపు ఏడాదిపైనే కావస్తోంది. అప్పటి నుంచి చేతి మిషన్‌లతోనే అంతంత మాత్రంగా ఫాగింగ్ చేయడం దోమలపై ప్రభావం చూపడం లేదనే విమర్శలున్నాయి. ప్రజారోగ్యం దృష్టిలో పెట్టుకుని ఫాగింగ్ ప్రక్రియ విస్తృతం చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

నేడు పింక్ శారీ సఖీ శారీ వాక్


క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం : సీపీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి, పాల్గొన్న సినీ నటి గౌతమి తదితరులు

రామ్‌నగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మహిళల్లో క్యాన్సర్‌పై అవగాహన కలిగిస్తూ బీచ్ రోడ్డులో పింక్ సఖీ శారీ వాక్ నిర్వహిస్తుండడం అభినందనీయమని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. శనివారం ఓ హోటల్ ఆయన మాట్లాడుతూ ఈ నెల 16న ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అంతర్జాతీయ క్యాన్సర్ మాసోత్సవాల సందర్భంగా రౌండ్ టేబుల్ లేడీస్ సర్కిల్ ఆఫ్ ఇండియా, రోహిత్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం బీచ్‌రోడ్డులోని విష్ణుప్రియ ఫంక్షన్ హాలు నుంచి వుడా పార్కు వరకు శారీ వాక్‌ను నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు వాక్ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ, ప్రముఖ అంకాలజిస్టులు, సామాజిక కార్పొరేట్ సంస్థలు మద్దతు అందిస్తున్నాయని తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నటి గౌతమి, శ్రావణి షిప్పింగ్ ఎండీ జి. సాంబశివరావు, డాక్టర్ డీఎస్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో క్రీడా పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎంవీ రాజు

విశాఖపట్నం, స్పోర్ట్సు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని వివిధ విభాగాలవిద్యార్థులకు ఏయూ స్పోర్ట్సు బోర్డు ఆధ్వర్యంలో వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, బ్యాడ్మింటన్, త్రోబాల్‌క్రీడా పోటీలు నిర్వహిస్తోంది. ఏయూ గ్రౌండ్‌లో శనివారం నుంచి జరుగుతున్న ఈ క్రీడా పోటీలకు ఏయూ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎంవి.రాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20న జరిగే జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ క్రీడా పోటీలు నిర్వహించడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. ఏయూ స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి ప్రొఫెసర్ ఎన్.విజయ్‌మోహన్ మాట్లాడుతూ శనివారం నుంచి 20వ తేదీ వరకు పురుషుల, మహిళల విభాగాలల పోటీలుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాలలో వీఎంఆర్డీఏ పార్కు


హైదరాబాద్ ట్యాంక్ బండ్ తరహాలో అభివృద్ధి చేయాలని నిర్ణయం

(విశాఖపట్నం - ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి జిల్లా కేంద్రంలో విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస (వీఎంఆర్‌డీఏ) అభివృద్ధి పనులు చేయాలని నిర్ణయించింది. దాదాపుగా రెండు దశాబ్దాల క్రితం రావు గోపాలరావు పేరుతో ఆడిటోరియం నిర్మించింది. ఆ తరువాత భారీ వ్యయంతో ఎటువంటి ప్రాజెక్టులు చేపట్టలేదు. వీఎంఆర్‌డీఏలో అనకాపల్లి జిల్లా కూడా కీలకమైనందున స్థానిక ప్రజలకు ఉపయోగపడేలా పనులు చేపట్టాలని వీఎంఆర్‌డీఏ చైర్మన్, కమిషనర్‌లను కూటమి నేతలు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ల్యాండ్ మార్కులా నిలిచిపోయేలా పార్కు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం తుమ్మపాలలో చెరువును పరిశీలించారు.

దీనిని హైదరాబాద్ ట్యాంక్ బండ్ తరహాలో అభివృద్ధి చేయాలని భావిస్తున్నామని, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత దీనిపై చర్యలు చేపడతామని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ తెలిపారు.

దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతంలో సీఏల పాత్ర కీలకం



మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

మద్దిలపాలెం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతంలో చార్టెడ్ అకౌంటెంట్(సీఏ)ల పాత్ర కీలకమని చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. పీఠాపురం కాలనీలోని ఐసీఏఐ భవనంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 4.30 లక్షలు సీఏలు ఉన్నారని, 8 లక్షల మంది విద్యార్థులు సీఏ కోర్సు చదువుతున్నారన్నారు. చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా కార్యవర్గంలో 40 మంది ఎన్నికవ్వగా, అందులో 8 మందిని కేంద్ర ప్రభుత్వం నియమించిన కౌన్సిల్ సభ్యులుగా ఉన్నారన్నారు. కేంద్రం ఇటీవల తీసుకుని వచ్చిన ఇన్‌కంట్యాక్స్ బిల్లు దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంతో ఉపయోగపడనుందన్నారు. ఈ బిల్లుకు సంబంధించిన సలహాలు, సూచనలు ఇచ్చేందుకు సీఏలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో ఐసీఏఐ చైర్మన్ అనిర్బాన్ పాల్, సీఏలు పాల్గొన్నారు.

వాడవాడలా స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర


కేజీహెచ్ ఆవరణ శుభ్రం చేస్తున్న సూపరింటెండెంట్, వైద్యులు


సీతమ్మధార రైతు బజార్‌ను శుభ్రం చేస్తున్న ఎస్టేట్ అధికారి


ఈపీడీసీఎల్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న సీఎండీ పృథ్వీతేజ్

మహారాణిపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ ఆధ్వర్యంలో సోర్సు రీసోర్సు టీమ్‌తో నిర్వహించిన కార్యక్రమంలో ఆస్పత్రి ప్రాంగణం శుభ్రపరిచి, ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఆస్పత్రి సిబ్బంది వార్డులు, విభాగాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అరికట్టడంలో సహకరించాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాసవీలత, అడ్మినిస్ట్రేటర్ బీవీ రమణ, ఆర్ఎంవోలు డాక్టర్ మెహర్‌కుమార్, డాక్టర్ ధవళ భాస్కరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ద్వారకా బస్‌స్టేషన్‌లో...

ద్వారకాబస్‌స్టేషన్: స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం ఆర్టీసీ అధికారులు ద్వారకా కాంప్లెక్సులోని అన్ని విభాగాల కార్యాలయాలు, కాంప్లెక్సు ప్లాట్‌ఫారాలు, ప్రయాణికులు వేచి ఉండే కారిడార్, పరిసరాలు శుభ్రపరిచారు. కార్యాలయాల్లో వృథా మెటీరియల్స్, పాడైన పరికరాలు, ఇతర వ్యర్థాలు తొలగించారు. ఈ సందర్భంగా విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు మాట్లాడుతూ కాంప్లెక్సును పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రతి రోజు పరిశీలిస్తామన్నారు. నగరాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం సిబ్బందితో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.

రవాణాశాఖ కార్యాలయంలో...

మురళీనగర్: రవాణాశాఖ కార్యాలయంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనరు ఆర్.సి.హెచ్.శ్రీనివాసరావు ఉద్యోగులతో 'నేను... నా పరిసరాల పరిశుభ్రతకు తగినంత సమయం కేటాయిస్తాను' అంటూ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్రాంగణం శుభ్రపరిచారు. వైశాఖీ స్పోర్సు పార్క్‌లో గ్రీన్ క్లైమెట్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు సరితా మంగవేణి, సంస్థ వలంటీర్లు తదితరులు స్వచ్ఛ పరిసరాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.

ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో

సీతంపేట: రామాటాకీస్ రోడ్డులో గల ప్రభుత్వ ప్రాంతీయ నేత్రవైద్యశాలలో స్వచ్ఛ ఆంధ్ర చేపట్టారు. పరిసర ప్రాంతాల్లో వైద్యులు, జూనియర్ వైద్యులు, సిబ్బంది మొక్కలు నాటారు. ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి, ప్రొఫెసర్లు, డాక్టర్లు రమణ, ప్రేమలత, ఆర్ఎంఓ నవీన్‌కుమార్, డాక్టర్ శ్రీలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

సీతమ్మధార రైతుబజార్‌లో

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్ పరిసరాలను ఎస్టేట్ అధికారి కృష్ణమూర్తి పర్యవేక్షణలో రైతులు, డ్వాక్రా గ్రూపుల సభ్యులు, బజార్ అటెండర్ సతీశ్, సిబ్బంది శుభ్రం చేశారు.

ఈపీడీసీఎల్ కార్యాలయంలో..

సీతమ్మధార: స్వచ్ఛాంధ్ర లక్ష సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి పిలుపునిచ్చారు. సంస్థ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ నిర్వహించారు. స్వచ్ఛ ఉద్యోగులతో సీఎండీ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు వి.విజయలలిత, వి.రామచంద్రప్రసాద్, సీజీఎంలు డి.సుమన్ కళ్యాణి, జె.శ్రీనివాసరావు, అచ్చి రవికుమార్ పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో...

అక్కయ్యపాలెం: స్వచ్ఛ విశాఖ రూపకల్పనకు కృషి చేయాలని సీతమ్మధార ఎంఈవో ఎం.రామారావు పిలుపునిచ్చారు. గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర నిర్వహించారు. పాఠశాల ఆవరణలో చెత్తను విద్యార్థులతో కలిసి శుభ్రం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం బి.లక్ష్మీనరస, సీఆర్పీ భాగ్యలక్ష్మి, పీడీ ఎ.సునంద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఆర్టీసీ ద్వారకా కాంప్లెక్సులో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్ఎం


ఎన్జీజీవోఎస్ కాలనీ పాఠశాలలో చెత్త తొలగిస్తున్న ఎంఈవో


మాధవధార ఆర్టీఏ కార్యాలయం ఆవరణ శుభ్రం చేస్తున్న ఉద్యోగులు

అమ్మాయిలు మిస్సింగ్!

... 5వ పేజీ తరువాయి

సోషల్ మీడియాలో పెడతామని, కుటుంబ సభ్యులకు పంపిస్తామని బెదిరింపులకు దిగుతుంటారు. ఈ పరిస్థితిని యువతుల నుంచి పెళ్లై పిల్లలు ఉన్న మహిళల వరకూ ఎదుర్కొంటున్నారు. కొంతమంది బయటకు వెళ్లిపోయి పెళ్లి చేసుకుని కొద్దిరోజులకే మోసపోతున్నారు. మరికొందరు మోసగాళ్ల బెదిరింపులు, బ్లాక్‌మెయిల్‌కు భయపడి వారు చెప్పినట్టు చేస్తున్నారు. ఇంకొందరు మాత్రం తమ వీడియోలు ఫొటోలు ఎక్కడ బయపెట్టేస్తే కుటుంబసభ్యులు, బంధువులు ఎదుట తలెత్తుకుని బతకలేమనే మనస్తాపంతో ఇళ్లు విడిచిపోతున్నారు. ఈ తరహా కేసులు గత కొంతకాలంగా పెరుగుతుండడం ఆందోళనకు గురిచేస్తోంది. గత ఏడాది జనవరి ఒకటి నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 12వ తేదీ వరకూ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో 539 మంది మహిళలు అదృశ్యమైతే వారిలో 388 మందిని పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాలికల విషయానికి వస్తే గత ఏడాది జనవరి ఒకటి నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 12 వరకు 163 మంది అదృశ్యమైతే వారిలో 149 మందిని పోలీసులు కనిపెట్టి నగరానికి తీసుకువచ్చారు.

పిల్లలను ఓ కంట కనిపెట్టండి

... 5వ పేజీ తరువాయి

కనిపిస్తుంటాయని చెబుతున్నారు. ఆ తరువాత దశలో పిల్లలు వ్యవహారశైలి మరింత ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందంటున్నారు.

తీవ్రంగా స్పందించే తీరు..

12 నుంచి 14 ఏళ్ల వయసుకు వచ్చేసరికి కొంతమంది పిల్లల వ్యవహారశైలి పూర్తి భిన్నంగా ఉంటోంది. కోర్కెలు పెరుగుతున్నాయి. వాటిని తీర్చుకునే మార్గాల కోసం అన్వేషిస్తుంటారు. ఆ సమయంలో పిల్లలను తల్లిదండ్రులు మరింత జాగ్రత్తగా కనిపెట్టుకుని ఉండాలి. పిల్లల స్నేహితులు, వారి అలవాట్లు, తిరిగే ప్రదేశాలు గురించి స్పష్టమైన అవగాహన ఉండాలి. లేకపోతే తప్పుడు మార్గాల వైపు వెళ్లే ప్రమాదం ఉంది. పిల్లల వ్యవహారశైలి భిన్నంగా ఉంటే మాత్రం కాస్త అప్రమత్తంగా ఉండి తల్లిదండ్రులు వారితో ఎక్కువ సమయం గడపడం ద్వారా విపరీతమైన సమస్యలకు దారితీయకుండా కాపాడుకోవచ్చు. ఈ వయసులో పిల్లలు అనేకం కోరుతుంటారు. వాటిని తీర్చే విషయంలో తల్లిదండ్రులు కొంత జాగ్రత్తగా వ్యవహరించాలి. ఆర్థిక పరిస్థితులు, కుటుంబ ఇబ్బందులు వంటివి అర్థమయ్యేలా చెప్పి కాదనాలి. అవసరమైనవి అయితే కొంత ఇబ్బంది అయినా కొనవచ్చు. అవసరం లేనివి అడిగితే మాత్రం...ఆ విషయాన్ని అర్థమయ్యేలా చెప్పాలి. కొట్టో, తిట్టో వద్దని చెప్పడం వల్ల పిల్లలు మరింత అగ్రెసివ్‌గా తయారై, తల్లిదండ్రుల పట్ల కసిని పెంచుకునే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఈ వాతావరణం విపరీతమైన పరిణామాలకు దారితీయవచ్చు.

గుడ్ పేరెంటింగ్‌తో పరిష్కారం

గుడ్ పేరెంటింగ్ అన్నది చాలా కీలకం. పిల్లలను పెంచే విధానమే భవిష్యత్తులో వారి జీవితాలకు భరోసాను కల్పిస్తుంది. ప్రతిరోజూ కొంత సమయం పిల్లలతో గడపాలి. చిన్న వయసు నుంచి ఇలా సమయం వెచ్చించడం చాలా మంచిది. పదేళ్లు దాటిన తరువాత మాత్రం తప్పనిసరి. అప్పుడే పిల్లల్లో వచ్చే విపరీతమైన మార్పులను గుర్తించి వాటిని సరి చేసేందుకు అవకాశం ఉంటుంది. ప్రతిరోజూ మంచి,చెడులు, సమాజంలో వస్తున్న మార్పులు, ఇంట్లో ఉన్న పరిస్థితులను, వారి బాధ్యతలను తెలియజేస్తూ ఉండాలి. గుడ్ పేరెంటింగ్ మాత్రమే పిల్లలను మంచి మార్గంలో తీసుకువెళ్లేందుకు దోహదం చేస్తుందని నిపుణులు చెబున్నారు.

ఇలా చేయాలి..

చిన్న వయసు నుంచి పిల్లలను నలుగురితో కలిసేలా చేయాలి. శారీరక శ్రమ కలిగించే యాక్టివిటీస్‌లో భాగం చేయడం ద్వారా ఫోన్ వంటి వాటికి దూరంగా ఉంచవచ్చు. ఇరుగుపొరుగుతో కలిసి ఆడుకునేలా ప్రోత్సహించాలి. దీనివల్ల పిల్లల్లో ఆత్మన్యూనతా భావం తగ్గుతుంది. పెద్దలు చెప్పే మాటలను వినేలా అలవాటు చేయాలి. పుస్తకాలు చదివేలా ప్రోత్సహించాలి. ఇలా చేయడం వల్ల పిల్లల్లో మొండితనం తగ్గుతుంది.

ప్రాథమిక స్థాయిలోనే గుర్తించాలి

కొన్నాళ్లుగా పిల్లల్లో అతి ప్రవర్తన ప్రధానమైన సమస్యగా ఉంటోంది. కౌమార దశ దాటిన తరువాత పిల్లల్లో ఈ తరహా వ్యవహారశైలి అధికంగా కనిపిస్తోంది. ఎంత చెప్పినా పిల్లలు దారిలోకి రావడం లేదని తల్లిదండ్రులు మా వద్దకు తీసుకువస్తున్నారు. అటువంటి వారికి కౌన్సెలింగ్ చేయాల్సి వస్తోంది. తల్లిదండ్రులు ప్రాథమిక దశలో పిల్లల వ్యవహారశైలిని గుర్తించి చక్కదిద్దే ప్రయత్నం చేస్తే ఈ ఇబ్బంది ఉండదు. పిల్లల్లో నియంత్రించలేని ప్రవర్తన, కడుపు నొప్పి, తలనొప్పి, దీర్ఘకాలం విచారంగా ఉండడం, కారణం లేకుండా బరువు తగ్గడం, చదువులో చురుకుదనం లేకపోవడం, మానసిక కల్లోలం, చికాకు వంటి లక్షణాలు కనిపిస్తే అప్రమత్తం కావాలి. ప్రతి చిన్నదానికి అలగడం, కోప్పడడం వంటివి కూడా పిల్లల్లో మానసిక ఇబ్బందులకు కారణంగా గుర్తించాలి.

- డాక్టర్ ముత్యాల బాలాజీ, మానసిక వైద్య నిపుణులు

బర్డ్ ఫ్లూ టెన్షన్

... 5వ పేజీ తరువాయి

తినొచ్చని వైద్యులు చెబుతున్నారు. గుడ్లు కూడా బాగా ఉడకబెట్టి తినడం మంచిది. కొద్దిరోజులపాటు ఆమ్లెట్స్, సగం ఉడికిన గుడ్లు తినకుండా ఉండడం మంచిదంటున్నారు. అలాగే, గ్రిల్డ్ చికెన్, ఉడికీ, ఉడకని చికెన్‌కు దూరంగా ఉంటే మంచిదని సూచిస్తున్నారు. బర్డ్ ఫ్లూ నమోదైన ప్రాంతానికి విశాఖ దూరంగా ఉండడం వల్ల ప్రస్తుతం ఇబ్బందేమీ ఉండదని, కానీ తగిన జాగ్రత్తలను పాటించాలని పేర్కొంటున్నారు.

ఇలా వ్యాప్తి..

సాధారణంగా కోళ్ల నుంచి మనుషులకు ఈ వ్యాధి అంత వేగంగా రాదు. ఆయా కోళ్ల ఫారాల్లో పనిచేసే వారికి వచ్చేందుకు ఎక్కువ అవకాశం ఉంటుంది. కోడి మలం, మూత్రం అంటిన వారికి ఈ వైరస్ సోకుతుందని, అది అతి తక్కువ సందర్భాల్లో మాత్రమే జరుగు తుందని వైద్యులు పేర్కొంటున్నారు. కోళ్ల నుంచి మనుషులకు సోకితే మాత్రం స్వైన్ ఫ్లూకు ఇచ్చే మందులు అందించి కోలుకునేలా చేస్తారు. బర్డ్ ఫ్లూ మనుషులకు సోకితే శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, డయేరియా, పొత్తి కడుపులో నొప్పి, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. కేసులు నమోదైన పరిసర ప్రాంతాల్లో ప్రజలకు ముప్పు కొంచెం అధికంగా ఉంటుందని, కాబట్టి అటువంటి వారంతా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నగరంలో ప్రజలకు ఇబ్బంది లేదని, అయితే ప్రస్తుత పరిస్థితుల్లో జాగ్రత్తలు తీసుకోవడం మేలన్నారు.

బర్డ్ ఫ్లూతో 'జూ'లో అలర్ట్

» మూడు వారాల నుంచి జంతువులకు చికెన్, గుడ్లు సరఫరా నిలిపివేత

విశాఖపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గోదావరి జిల్లాల్లో బర్డ్ ఫ్లూ వైరస్ ప్రబలడంతో నగరంలోని ఇందిరా ప్రియదర్శిని జంతుప్రదర్శనశాల (జూ) అధికారులు అప్రమత్తమయ్యారు. వాస్తవానికి మూడు వారాల క్రితం పాట్నా జూలో కొన్ని పక్షులకు వైరస్ సోకినప్పుడే సెంట్రల్ జూ అథారిటీ దేశంలోని అన్ని జంతుప్రదర్శన శాలలను అలర్ట్ చేసింది. దీంతో జంతువులకు ఆహారంగా చికెన్, గుడ్లు ఇవ్వడాన్ని నిలుపుదల చేశారు. చికెన్‌కు బదులుగా మటన్ సరఫరా చేస్తున్నారు. ఇంకా పక్షులు ఉండే ఎన్‌క్లోజర్ల నిర్వహణ విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వాటి వద్ద విధులు నిర్వహించే సిబ్బంది ఇంటి నుంచి వచ్చిన తరువాత విధిగా డ్రెస్ మార్చుకోవాలి. అది కూడా ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అధికారులు ఆదేశించారు. పక్షులున్న ఎన్‌క్లోజర్ల వద్దకు ఇతర జంతువులు వెళ్లకుండా చూడాలని సూచించారు. ఇంకా సిబ్బందికి శానిటైజ్ బాటిల్స్ సరఫరా చేస్తున్నారు. జంతువులకు ఆహార పదార్థాలు తీసుకువచ్చే వాహనాలను కూడా శానిటైజ్ చేయాలని నిర్ణయించారు. రెండు, మూడు రోజుల్లో జూ రెండు ప్రధాన గేట్ల వద్ద సందర్శకులు కూడా విధిగా చేతులు శుభ్రం చేసుకునేలా శానిటైజ్ బాటిల్స్ సిద్ధం చేయనున్నారు. బర్డ్‌ఫ్లూ వైరస్ ప్రబలుతున్న నేపథ్యంలో జూలో అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని క్యూరేటర్ మంగమ్మ తెలిపారు. జంతువులు, పక్షుల రక్షణకు చర్యలు తీసుకున్నామన్నారు. జూ సందర్శనకు వచ్చే సందర్శకులు ఎన్‌క్లోజర్‌లకు దగ్గరగా వెళ్లి జంతువులు, పక్షులను తాకరాదని, ఆహారం వంటివి వేయవద్దని విజ్ఞప్తి చేశారు. ఎన్‌క్లోజర్లకు దూరంగా ఉండాలని సూచించారు. పక్షులు, జంతువుల రక్షణ ప్రతి ఒక్కరూ జూ అధికారులకు సహకరించాలని కోరారు.

కనకమ్మకు తులసి దళార్చన

జగదాంబకూడలి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బురుజుపేట కనకమహాలక్ష్మి ఆలయంలో శనివారం తులసిదళార్చన చేశారు. జేఈవో తిరుమలేశ్వరరావు సమక్షంలో పండితులు ఉభయదాతలతో పూజలు చేయించారు. అనంతరం ఆయుష్హు హోమం నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

27న శ్రీకృష్ణ మందిర వార్షికోత్సవం

కంచరపాలెం, ఫిబ్రవరి 15, (ఆంధ్రజ్యోతి): స్థానిక గొల్ల కంచరపాలెంలోని శ్రీ కృష్ణ మందిరం వార్షికోత్సవాన్ని ఈనెల 27వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శి పల్లా ఎర్నికుమార్ కొయ్య జగదీష్ తెలిపారు. ఈమేరకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆం.నేయ శర్మ నేతృత్వంలో ఆరోజు స్వామివారికి విశేష పూజలు, ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తామన్నారు. సాయంత్రం భజన, సంకీర్తనలు జరుగుతాయన్నారు.

'మహాసభలు జయప్రదం చేయాలి'

అల్లిపురం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న విజయవాడలో జరగనున్న విద్యుత్ మీటర్ రీడర్స్ సంఘం రాష్ట్ర మొదటి మహాసభలు జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్ఎల్ అచ్యుతరావు అన్నారు. ఈమేరకు అల్లిపురంలోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో శనివారం పోస్టరును ఆవిష్కరించారు. ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు ప్రవేశపెడుతున్నందున నాలుగు వేల మంది ఉద్యోగాలు కోల్పోతారన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మన్మధరావు, ఎల్.రామకృష్ణ, కె.శివారెడ్డి, డి.క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తొలి పది నెలల్లో కస్టమ్స్ ఆదాయం రూ.11,198.36 కోట్లు

... 5వ పేజీ తరువాయి

పోర్టు చైర్మన్ ఎం.అంగముత్తు మాట్లాడుతూ, ఎగుమతి, దిగుమతిదారులకు అనుకూలమైన విధానాలు అమలు చేస్తున్నామన్నారు. వీఎస్ఈజెడ్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. పలువురు వ్యాపారులు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రతినిధులకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కమిషనర్ శ్రీధర్ పాల్గొన్నారు.

భారీ డిస్కౌంట్ల పేరుతో బురిడీ

... 5వ పేజీ తరువాయి

పెద్ద మొత్తంలో కిలోల లెక్కన కొనుగోలు చేసి లారీల్లో నగరానికి తెస్తున్నారు. రోడ్ల పక్కన అమ్మితే మంచి రేటు రాదని...హోటళ్లను ఎంపిక చేసుకుంటున్నారు. వీటిలో చాలా వాటికి ప్యాకింగ్ ఉండదు. సరైన మడతలు ఉండవు. సైజులు రెగ్యులర్‌వి ఉండవు. స్టిక్కర్‌పై ఒక నంబరు, ఒరిజినల్ సైజ్ వేరుగా ఉంటుంది. ధరలు ఎక్కువ వేసేసి, 70 శాతం డిస్కౌంట్ అంటూ రూ.600 నుంచి రూ.1,000కు విక్రయిస్తున్నారు. వాస్తవానికి ఇప్పుడు ఆన్‌లైన్ షాపింగ్ వచ్చిన తరువాత...సంప్రదాయ షాపింగ్ మాల్స్ కూడా పోటీని తట్టుకోవడానికి ఆ ధరలకే అన్నిరకాల దుస్తులు అందుబాటులో ఉంచుతున్నాయి.

తేడా వస్తే పరిస్థితి ఏమిటి?

నగరంలో ఏ షాపింగ్ మాల్‌లో ఏమి కొన్నా తేడా వస్తే ఎక్స్ఛేంజ్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లోనూ ఆ సదుపాయం ఉంది. కానీ మూడు రోజుల సేల్ అంటూ వచ్చి, భారీ డిస్కౌంట్లు అంటూ బురిడీ కొట్టించే వారి దగ్గర కొంటే...ఆ తరువాత తేడా వస్తే అడగడానికి ఇక్కడ ఎవరూ ఉండరు. ఎక్స్ఛేంజ్ సదుపాయం ఉండదు. పోనీ మళ్లీ వచ్చినప్పుడు అడుగుదామంటే ఒకసారివచ్చిన వారు రెండోసారి రావడం లేదు. కొనుగోలుదారులు ఈ డిస్కౌంట్ సేల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి.

పందుంపుల్లల సందుకు సరికొత్త కళ

» ఆక్రమణల తొలగింపుతో విశాలంగా మారిన రహదారి

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ పందుంపుల్లల సందు కొత్త కళను సంతరించుకుంది. ఇక్కడ రెండురోజుల క్రితం పోలీసు లు ఆక్రమణలను తొలగించడంతో సువిశాలంగా కనిపిస్తోంది. ఈ మార్గం లో 60 ఏళ్లకు పైగా దుస్తుల వ్యాపారం సాగుతోంది. దీంతో మునిసిపల్ స్టేడియం వైపు వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొనేవారు. రోడ్లు ఆక్రమణకు గురవడం, రాజకీయ ఒత్తిళ్లతో తొలగింపునకు జీవీఎంసీ, పోలీసులు వెనకడుగు వేయడంతో సమస్యకు పరిష్కారం లభించలేదు. అయితే పూర్ణామార్కెట్ ప్రక్షాళనలో భాగంగా వన్‌టౌన్ సీఐ జేడీ బాబు ఆధ్వర్యంలో ఆక్రమణలు తొలగించారు. రోడ్డు ఆక్రమించి వ్యాపారాలు చేస్తే కేసులు పెడ తామని హెచ్చరించారు. వర్తక సంఘం ప్రతినిధి పెంటకోట సత్యనారాయణతో మాట్లాడారు. దీంతో ఆక్రమణలను వ్యాపారులు స్వచ్ఛందంగా తొలగించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


విశాలంగా మారిన మార్కెట్

'నోటీసులను వెనక్కి తీసుకోకపోతే ఉద్యమం'


సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల ప్రతినిధులు

సీతంపేట, ఫిబ్రవరి 15, (ఆంధ్రజ్యోతి): వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చే మీడియాను బెదిరించేలా ఆర్డీవో ఇచ్చిన నోటీసులను వెనక్కి తీసుకోవాలని, లేదంటే ఉద్యమం చేస్తామని దళిత మహిళ ప్రజా సంఘాలు, జర్నలిస్టులు గళమెత్తారు. ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ ఆధ్వర్యంలో పౌర గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో పీఓడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, చైతన్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు కె.లలిత తదితరులు మాట్లాడుతూ లీడర్ పత్రిక సంపాదకుడు వీవీ రమణమూర్తికి విశాఖ ఆర్డీఓ శ్రీలేఖ చట్ట విరుద్ధంగా నోటీసులు ఇచ్చారన్నారు. భావ ప్రకటన, వాక్ స్వాతంత్ర్యాన్ని, పత్రికా స్వేచ్ఛను హరిస్తూ బెదిరించేలా నోటీసు సారాంశం ఉందన్నారు. విశాఖలో భూ కుంభకోణాలు జరుగుతున్నాయని, ప్రతికలు, చానల్స్ వాటిని వెలుగులోకి తెస్తున్నాయన్నారు. మీడియాను నిరోధించేలా ఆర్డీవో నోటీసు ఉందని, వెంటనే వెనక్కి తీసుకోకపోతే రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, జర్నలిస్టు సంఘాలతో కలిసి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ మేరకు భవిష్యత్తు కార్యచరణ రూపొందిస్తున్నామన్నారు. సమావేశంలో రాజకీయ ఖైదీల విడుదల కమిటీ కన్వీనర్, న్యాయవాది కె.పద్మ, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు డెంకాడ ఆనంద్, ఈఎన్ఎస్ బాలు, డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్, వీవీ గిరి, కిశోర్, ఎస్.సుధాకర్, లలిత, జె.శ్యామల, విజ్ఞానంద్, వెంకటలక్ష్మి, బాల నాగమ్మ, వాల్మీకి నాగరాజు, బూసి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంతోనే ప్రజలకు సంపూర్ణ రక్షణ

» విశ్రాంత ఎస్పీ డాక్టర్ కె.రాజశిఖామణి


అంబేడ్కర్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఐడీజేఎస్ ప్రతినిధులు

సీతమ్మధార, ఫిబ్రవరి 15, (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజల హక్కులను రాజ్యాంగం పరిరక్షిస్తోందని విశ్రాంత ఎస్పీ డాక్టర్ కె.రాజశిఖామణి స్పష్టం చేశారు. అంబేడ్కర్ భవన్‌లో ఇంటర్నేషనల్ దళిత జర్నలిస్టుల నెట్‌వర్క్ (ఐడీజేఎస్) ఆధ్వర్యంలో 'రాజ్యాంగం అవశ్యకత..పరిరక్షణ' అంశంపై శనివారం నిర్వహించిన సదస్సులో ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం పాత్రిపాదికపై గొప్ప రాజ్యాంగాన్ని అదించిన ఘనత అంబేడ్కర్‌కు దక్కిందన్నారు. రాజ్యాంగ విలువల పరిరక్షణలో మీడియా ప్రధాన పాత్ర పోషించాలన్నారు. అంబేడ్కర్ లా కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కోట పల్లవి మాట్లాడుతూ రాజ్యాంగాన్ని ప్రశ్నిస్తే ఉల్లంఘన కాదన్నారు. ప్రాథమిక హక్కులు ఆదేశిక సూత్రాలు మేలు చేసేవన్నారు. సదస్సులో ఈపీఎస్ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, ఐడీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తంగేటి నానాజీ, డాక్టర్ బి.రమేశ్‌బాబు, బొడ్డు కళ్యాణరావు, సీఐ బి.లూథర్ బాబు, పి.సత్యనారాయణ, కె.చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యం పెంచుకోవాలి

కంచరపాలెం, ఫిబ్రవరి 15,(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాల్లో ఉపాధ్యాయులు బోధనలో నైపుణ్యం పెంపొందించుకోవాలని గోపాలపట్నం ఎంఈవో డి.దివాకర్ అన్నారు. ఆర్పీపేట క్లస్టర్ కాంప్లెక్స్ శనివారం ఉన్నత పాఠశాలలో జరిగింది. కార్యక్రమంలో ఎంఈవో దివాకర్ ఆకట్టుకునే బోధనా పద్ధతులను వివరించారు. క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ సాంకేతికతకు అనుగుణంగా బోధనా సామర్థ్యాలను మార్చుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులకు 1,2 తరగతులు ఒక విభాగం, 3 నుంచి 5తరగతులు ఒక విభాగంగాను, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు సబ్జెక్టుల వారీగా ఆర్పీలు శిక్షణ ఇచ్చారు. ఏడు పాఠశాలల టీచర్లు, హెచ్ఎం పాల్గొన్నారు.


సూచనలిస్తున్న గోపాలపట్నం ఎంఈవో దివాకర్

సీతమ్మధార: సీతమ్మధార పీ అండ్‌టీ కాలనీలోని ఎస్ఎంసీహెచ్ స్కూల్‌లో స్కూల్ క్లస్టర్ కాంప్లెక్స్ శనివారం నిర్వహించారు. ఉపాధ్యాయుల బోధన, కొత్తగా ఏర్పాటయ్యే పాఠశాలలు, మార్పులపై వివరించారు. వెనుకబడిన పిల్లల విద్యాభివృద్ధికి తీసుకుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఉపాధ్యాయులు, హెచ్ఎం రాంప్రసాద్, ఎంఈవో కేఏ బాలమణి పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: విద్యార్థులను విద్యావంతులుగా తీర్చి దిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని స్కూల్ క్లస్టర్ ప్రిన్సిపాల్ బి.లక్ష్మీనరస అన్నారు. గ్రేటర్ 26వ వార్డు జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన స్కూల్ క్లస్టర్ సమావేశంలో మాట్లాడుతూ త్వరలో జరగనున్న పరీక్షల్లో ప్రతి విద్యార్థి మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్లస్టర్ పరిధిలోని 8 ప్రాథమిక, ఉన్నత పాఠశాలల నుంచి 50 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఎంఈవో ఎం.రామారావు తదితరులు పాల్గొన్నారు.

డీజిల్ పంచాయితీపై కలెక్టర్ సీరియస్

... 5వ పేజీ తరువాయి

తెలుసుకున్నారు. బకాయిలు చెల్లించేంత వరకూ డీజిల్, పెట్రోల్ సరఫరా చేయడానికి ఆథరైజ్డ్ బంకు యజమాని నిరాకరిస్తున్నారని, అందుకే ఫాగింగ్‌తోపాటు జోన్-2 పరిధిలోని చెత్త తరలింపు వాహనాలను నిలిపేయాల్సి వచ్చిందని ఆయన వివరణ ఇచ్చారు. బంకుకు బిల్లు బకాయిలు ఎందుకు చెల్లించలేదని చీఫ్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్‌ను జిల్లాకలెక్టర్ ప్రశ్నించారు. తనకు పూర్తి వివరాలతో బిల్లు పంపించలేదని, కొన్ని అభ్యంతరాలు ఉండడంతో వాటిని పరిష్కరించాలని మెకానికల్ విభాగం అధికారులకు సూచించినా, ఇంతవరకూ స్పందించలేదని ఆయన చెప్పారు. అనంతరం మెకానికల్ ఎస్ఈ గణేష్‌కుమార్‌ను వివరణ కోరితే తమ వైపు నుంచి అన్ని వివరాలు ఇచ్చామని, ఫాగింగ్‌కు అవసరమైనదానికంటే ఎక్కువ పెట్రోల్, డీజిల్ వినియోగిస్తున్నట్టు ప్రజారోగ్య విభాగం నుంచి బిల్లు పెట్టడంతో తాము అభ్యంతరం వ్యక్తంచేశామని వివరించారు. అధికారులంతా ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడంతో కలెక్టర్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించి, తిరిగి డీజిల్, పెట్రోల్ సరఫరాను పునరుద్ధరించడంతోపాటు ఫాగింగ్ ప్రారంభం కావాలని ఆదేశించారు. అధికారుల మధ్య సమన్వయం లోపం వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే ఉపేక్షించేది లేదని స్పష్టంచేసినట్టు సమాచారం. పత్రికల్లో కథనాలు వచ్చేంత వరకూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురాపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తంచేసినట్టు తెలిసింది. దీంతో రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చినట్టు తెలిసింది.

దొంగను పట్టుకోబోయి.. రైలు ఢీకొని.. ఢిల్లీలో 'అనంత' జవాన్ మృతి


జవాన్ లక్ష్మన్న

బ్రహ్మసముద్రం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): భార్య మెడలోని తాళిబొట్టు గొలుసును తెంచుకువెళుతున్న దొంగను పట్టుకునే క్రమంలో రైలు కిందపడి జవాన్ లక్ష్మన్న (32) మృతి చెందారు. ఈ ఘటన ఢిల్లీలో శుక్రవారం రాత్రి జరిగింది. అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం మండల కేంద్రానికి చెందిన లక్ష్మన్న, 2014లో బీఎస్ఎఫ్ జవానుగా ఉద్యోగంలో చేరారు. డిసెంబరులో ఆయన జమ్మూ కశ్మీర్‌కు బదిలీ అయ్యారు. లక్ష్మన్నకు ఐదేళ్ల క్రితం కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లాకు చెందిన లక్ష్మితో వివాహమైంది. నెల క్రితం సెలవుపై కుటుంబ సమేతంగా సొంతూరికి వచ్చారు. 16న విధుల్లో చేరాల్సి ఉండడంతో బుధవారం తిరుగు ప్రయాణమయ్యారు. శుక్రవారం రాత్రి హజరత్ నిజాముద్దీన్ ఈస్ట్ రైల్వేస్టేషన్‌కు 50 కి.మీ. దూరంలో రైలు నెమ్మదిగా వెళ్తున్న సమయంలో లక్ష్మి మెడలోని మంగళసూత్రాన్ని ఒక దొంగ లాక్కొని పరుగులు తీశాడు. దొంగను పట్టుకునేందుకు రైలు నుంచి లక్ష్మన్న కిందకు దూకగానే పక్క ట్రాక్‌పై వచ్చిన రైలు ఢీకొట్టింది. దీంతో లక్ష్మన్న అక్కడికక్కడే మృతి చెందారు. కళ్లెదుటే భర్త మృతి చెందడంతో లక్ష్మి స్పృహ తప్పి పడిపోయారు. అక్కడే ఉన్న మరో జవాను లక్ష్మన్న కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. విధుల్లో చేరటానికి వెళ్లిన కుమారుడి మృతి వార్త విని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

వ్యర్థ రహిత విశాఖగా తీర్చిదిద్దుదాం

» నగర వాసులకు కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ హరేంధిరప్రసాద్ పిలుపు



చెత్త విభజన ప్రక్రియను పరిశీలిస్తున్న హరేంధిరప్రసాద్, ఏడీసీ సోమన్నారాయణ తదితరులు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : వ్యర్థ రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దుదామని విశాఖ జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ పేర్కొన్నారు. ప్రతి నెలా 3వ శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా 2వ జోన్ పరిధి ఎండాడలోని ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ ప్రాంగణంలో వ్యర్థాల విభజన,సేంద్రీయ ఎరువు తయారీ వాటి వినియోగంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్లల్లో వ్యర్థాలను కాలువలు, బహిరంగ ప్రదేశాల్లో పడవేయకుండా తడి, పొడి చెత్తగా విభజించి జీవీఎంసీ పారిశుధ్య సిబ్బందికి అందజేయాలన్నారు. తడి వ్యర్థాల నుంచి ఇంటి వద్దే సేంద్రియ ఎరువులను తయారు చేసుకుని మిద్దె తోటలు, కమ్యూనిటీ గార్డెన్లలో కూరగాయలు, పండ్లు, పూల మొక్కలకు వినియోగించుకోవాలని సూచించారు. తద్వారా ఆర్థిక లాభం చేకూర్చుకోవడమే కాకుండా, ఆహ్లాదకర పర్యావరణం చేకూరి ఆరోగ్య జీవనానికి దోహదపడుతుందన్నారు. అలాగే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులకు స్వస్తి పలికి ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలన్నారు. వ్యర్థాల పునర్వినియోగ ప్రక్రియకు నివాసిత సంక్షేమ సంఘాలు, ఎస్‌హెచ్‌జీ మహిళా సభ్యులు, ఆర్పీలు సహకరించినట్లయితే వ్యర్థ రహిత నగరంగా విశాఖ ప్రజల సహకారంతో తీర్చిదిద్దవచ్చన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్, తడి, పొడి, ప్రమాదకర వ్యర్థాల విభజన ప్రక్రియ నుంచి ఎరువు తయారు చేసే ప్రక్రియ ప్రదర్శనను పరిశీలించారు. అనంతరం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. అవగాహన ర్యాలీలో కలెక్టర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.


నిందితులు, పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనం

కబేళాకు ఆవులు తరలిస్తున్న వాహనం స్వాధీనం

» ఇద్దరిపై కేసు నమోదు

ఆరిలోవ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఆవులను కబేలాకు తరలిస్తున్న ఓ వాహనాన్ని బాలాజీనగర్ వద్ద స్థానికుడు కోడిబోయిన బాబ్జీ యాదవ్ అడ్డుకొని స్థానిక పోలీసులకు అప్పగించి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సిబ్బందితో వచ్చి వాహనాన్ని, ఐదు ఆవులను స్వాధీనం చేసుకున్నారు. బాలాజీ నగర్‌కు చెందిన మహమ్మద్ రఫీతో పాటు సువ్వాడ గణేశ్‌ను అదుపులోకి తీసుకున్నట్టు సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. నిందితులు ఈ ఆవులను రాజాం సంతలో కొనుగోలు చేసి తీసుకొని వచ్చినట్టు సీఐ తెలిపారు. వీటిని ఆరిలోవలో గల అనధికార కబేలాలలో వధించేందుకు తీసుకొని వెళుతున్నారని చెప్పారు. ఆవులను గోశాల నిర్వాహకులకు అప్పగిస్తామని సీఐ తెలిపారు.

కృష్ణా కళాశాలలో స్వచ్ఛత ప్రతిజ్ఞ

మద్దిలపాలెం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఎన్‌సీసీ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది, ఎన్‌సీసీ క్యాడెట్స్ కళాశాల పరిసరాలను పరిశుభ్రం చేశారు. మరుగుదొడ్లు, వాటర్ ప్లాంట్ శుభ్రం చేశారు. పిచ్చిమొక్కలు, చెత్తకాగితాలు, వ్యర్థాలు తొలగించారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించారు. అనంతరం ఎన్‌సీసీ అధికారి బి.సన్యాసిరావు స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు అర్జీనాయుడు, మురళీకృష్ణ, బాలమురళీ,అప్పారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగాలను పరిరక్షించుకోవాలి

సిరిపురం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించుకోవాలని, లేనిపక్షంలో అనేక పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని సంఘమిత్ర సూరిబాబు తెలిపారు. శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంఘమిత్ర సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలోప్రజా గాయకుడు 'మజ్జి దేవిశ్రీ పాట- సంఘమిత్ర సూరిబాబు మాట' పేరిట కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్రహ్మకుమారి రమ, ఏయూ విశ్రాంతాచార్యులు సూరప్పడు సంఘమిత్ర సభ్యులు పాల్గొన్నారు.


రైతు బజార్‌లో పరిసరాలను శుభ్రం చేస్తున్న రైతులు

రైతుబజార్‌లో పరిసరాల శుభ్రత

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 15 : స్థానిక రైతు బజార్‌లో రైతులు, డ్వాక్రా కౌంటర్లు, ఇతర వాణిజ్య దుకాణాల సిబ్బంది శనివారం శ్రమదానం చేశారు. స్వర్ణాఆంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా పరిసరాలను శుభ్రం చేశారు. ఎస్టేట్ అధికారి వరహాలు, సహాయకుడు కనకరాజు ఆధ్వర్యంలో అందరూ కలసి పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు.

ఉషోదయ కూడలిలోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివాస్ నిర్వహించారు. ప్రాజెక్టు హెడ్ సత్తిబాబు ఆధ్వర్యంలో సిబ్బంది కార్యాలయం పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఈఈ శ్రీనివాసరావు, మేనేజర్ మేరీ గ్రేస్, జిల్లా హౌసింగ్ కార్యాలయం సిబ్బంది, డీఈలు, ఏఈలు, ఇతర ఉద్యోగులు శ్రమదానంలో పాలుపంచుకున్నారు.


ఎంపీ శ్రీభరత్‌ను సత్కరించి స్వాగతం పలుకుతున్న నాయకులు

ఎంపీ శ్రీభరత్‌కు సాదర స్వాగతం

గోపాలపట్నం,ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): డివిజన్‌తో కూడిన రైల్వే జోన్‌ను కేంద్రం ప్రకటించాక ఢిల్లీ నుంచి విశాఖ వచ్చిన విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్‌కు రైల్వే యూనియన్ నాయకులు విమానాశ్రయంలో ఘనంగా స్వాగతం పలికారు. శనివారం సాయంత్రం ఢిల్లీ నుంచి విశాఖ చేరుకున్న ఎంపీకి రైల్వే యూనియన్ నేత చలసాని గాంధీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, పలువురు రైల్వే యూనియన్ నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ విశాఖలో రైల్వే అభివృద్ధికి కృషి చేస్తానని, సౌత్ కోస్ట్ రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభించాలని కేంద్రాన్ని కోరుతామన్నారు. అనంతరం నాయకులు, ఉద్యోగులు శ్రీభరత్‌ను సత్కరించారు.

వీఎంఆర్డీఏలో స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర



ప్రతిజ్ఞ చేస్తున్న వీఎంఆర్డీఏ అధికారులు, ఉద్యోగులు

సిరిపురం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్డీఏ భవన్‌లోని శనివారం స్వచ్ఛంధ్రప్రదేశ్-స్వచ్ఛ దివాస్‌ను నిర్వహించారు. ఉద్యోగ్ భవన్ పరిసరాల్లోని ఉన్న చెత్తాచెదారాన్ని ఉద్యోగులందరూ తొలగించి శుభ్రపరిచారు. అనంతరం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని, నగరాన్ని పచ్చగా మార్చేందుకు కృషి చేస్తామని కార్యదర్శి మురళీకృష్ణ ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాధన్ ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. విశాఖ నగరాన్ని, మనమున్న పరిసరాలను మరింత పరిశుభ్రంగా పచ్చగా మార్చేందుకు కృషి చేస్తామని ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ కె.రమేష్, కార్యదర్శి టి.మురళీకృష్ణ, చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్ప, హరిప్రసాద్, ఇంజనీరింగ్, ప్రణాళికాధికారులు, పరిపాలనాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు సమష్టి కృషిచేయాలి

» ప్రజారోగ్యం, పన్నుల వసూళ్లు పకడ్బందీగా చేపట్టాలి
» ప్రభుత్వ భూఆక్రమణలు జరిగితే ప్లానింగ్ కార్యదర్శులపై చర్యలు
» జీవీఎంసీ ఉన్నతాధికారులతో విశాఖ జిల్లా కలెక్టర్ సమీక్ష


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : నగర ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో జీవీ ఎంసీ అధికారులు సమష్టిగా పని చేయాలని విశాఖ జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ డాక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్లో గ్రేటర్ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలో చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఇందుకోసం సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా ప్రబలకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన ప్రాంతాలలో ఫాగింగ్, స్ప్రేయింగ్ వంటివి చేపట్టాలని ప్రజారోగ్య విభా గం అధికారులకు స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా ప్లానింగ్ కార్యదర్శులు, వీఆర్వోలు, జోన్ల కమిషనర్లు సంయుక్తంగా ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నిత్యం పరిశీలించాలన్నారు. ప్రభుత్వ భూములలు ఆక్రమణకు గురైతే సంబంధిత ప్లానింగ్ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బీచ్‌రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాలు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని నగరంలో గల డెబ్రిస్‌తో కప్పి వేసి విస్తరణ చేసేందుకు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రణాళికఅధికారులను ఆదేశించారు. ఎక్కడా తాగునీరు కలుషితం కాకుం డా చూడాలన్నారు. వీధి దీపాలు, తాగునీరు, పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలన్నారు. మార్చి 31 నాటికి రావాల్సిన రూ.100 కోట్ల పన్నులను వసూలు చేయాలని డీసీఆర్ శ్రీనివాస్‌ను ఆదేశించారు. అన్ని వార్డుల్లో నిత్యం జోనల్ కమిషనర్లు పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.


మొక్కలు నాటుతున్న విమ్స్ వైద్యులు, సిబ్బంది

విమ్స్‌లో మొక్కలు నాటిన వైద్యులు

ఆరిలోవ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : విశాఖ వైద్య విజ్ఞానసంస్థ (విమ్స్)లో ఆస్పత్రి సిబ్బంది పరిసరాలను శుభ్రం చేశారు. స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివాస్‌లో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సంస్థ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు ప్రారంభించారు. విమ్స్ ఆవరణలో మొక్కలునాటారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ పరిసరాల శుభ్రత వల్ల ఆరోగ్య పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో విమ్స్ డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అలాగే విశాఖ కేంద్ర కారాగారంలో అధికారులు, సిబ్బంది ప్రధాన ద్వారా వద్ద పరిసరాలు శుభ్రం చేశారు. జైలు సూపరింటెండెంట్ మహేశ్‌బాబు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం ఉండే పరిసరాలు ఎప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవడం ద్వారా ఆరోగ్య పరిరక్షణ, వాతావరణం ఆహ్లాదంగా ఉంటుందన్నారు.


కేంద్ర కారాగారం వద్ద చెత్తను తొలగిస్తున్న అధికారులు, సిబ్బంది

గృహమిత్ర ధరలను పరిశీలించిన అధికారులు

పెదవాల్తేరు. ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యో తి) : స్థానిక రైతు బజార్‌లోని గృహమిత్రలో అధిక ధరలకు సరుకులు విక్రయిస్తుండడంపై మార్కెటింగ్ శాఖ అధికారులు స్పందించారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'లో 'గృహమిత్రలో అధిక ధరలపై జనం గగ్గోలు' శీర్షికన వచ్చిన కథనానికి స్పందించిన అధికారులు రైతుబజార్‌ను సందర్శించారు. ధరల పట్టికలను పరిశీలించారు. గృహమిత్ర నిర్వాహకులు ప్రసాద్, రైతుబజార్ ఎస్టేట్ ఆధికారి సత్యకళకు నోటీసులు జారీ చేశారు.

విస్తృతంగా పోలీసు తనిఖీలు

ఆరిలోవ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : హనుమంతవాక జంక్షన్‌లో పలుద్విచక్రవాహనాలను ట్రాఫిక్ పోలీసులు శనివారం తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్ లేకుండా నడపిన వారిని, త్రిబుల్ రైడింగ్ చేసిన వాహన దారులు వాహనదారులకు చలానా విధించారు.

జోన్-3లో దోమల బెడద

యంత్రాల కొరతతో అంతంతమాత్రంగా ఫాగింగ్


ఆధునిక యంత్రాలు లేకపోవడంతో చేతి మిషన్‌తో ఫాగింగ్ వేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

మద్దిలపాలెం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ జోన్-3లో దోమలు బెడద ఎక్కువైంది. డ్రైనేజీలు, గెడ్డలు పూడికలతో నిండిపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. నీటి నిల్వలలో లార్వా పెరిగి దోమల వ్యాప్తి చెందుతున్నాయి. వీటి బాధ పగలు, రాత్రి అన్న తేడా లేకుండా ఉంది. దోమలు అధికంగా ఉండడంతో వీటి నివారణకు ప్రజలు తాత్కాలిక ఉపశమన చర్యలు చేపడుతున్నా ఫలితం ఉండడం లేదు. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో దోమల బెడద ఎక్కువగా ఉంటోందని ప్రజలు వాపోతున్నారు. దోమల దెబ్బకు జ్వరాల పాలవుతున్నామంటూ పలువురు వాపోతున్నారు. పిల్లలు సైతం వైరల్ ఫీవర్‌తో ఇబ్బందులకు గురవుతున్నారు. పారిశుధ్య నిర్వహణ సరిగా లేకపోవడం, దోమల నియంత్రణకు ఫాగింగ్ చర్యలు చేపట్టకపోవడంతో సమస్య తీవ్రంగా ఉంటోందని ప్రజలు వాపోతున్నారు.

జోన్-3లో 14 వార్డులు ఉన్నాయి. ఆయా వార్డుల్లో వందల సంఖ్యలో డ్రైనేజీ, గెడ్డలు ఉన్నాయి. వీటికి తోడు రోడ్డు మీదా ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్లు ఉన్నాయి. అంతే కాకుండా కొన్ని వీధుల్లో రోడ్డు మీదే చెత్త పారేస్తున్నారు. వెరసి వార్డులు అధ్వానంగా తయారయ్యాయి. కాల్వల్లో మురికి నీరు, రోడ్డు మీద పారవేసిన తడిచెత్తతో దోమలు విపరీతం పెరిగిపోతున్నాయి.

ఎప్పటికప్పుడు డ్రైనేజీలు, చెత్త కుప్పలు తొలగించకపోవడం ఈ సమస్య మరింతా జటిలమైంది.

ఫాగింగ్ యంత్రాల కొరత

జోన్-3 పరిధిలో దోమల నివారణకు పొగ వేసేందుకు అవసరమైన ఫాగింగ్ యంత్రాలు కొరత వెంటాడుతోంది. జోన్ మొత్తానికి 9 చేతి ఫాగింగ్ యంత్రాలు ఉన్నాయి. మెగా ఫాగింగ్ యంత్రం ఒకటి కూడా లేదు. అంతేకాకుండా చేతి యంత్రంతో ఫాగింగ్ వేయాలంటే ఆయిల్ ఖర్చు కూడా ఎక్కువే. చేతి ఫాగింగ్ మిషన్‌తో పొగ వేయాలంటే గంటకు సుమారు 35, 40లీటర్ల డీజల్ ఖర్చు అవుతుంది. ఇంత మొత్తం ఖర్చు చేసే నిధులు లేక కేవలం ఫిర్యాదు వచ్చిన ప్రాంతంలో మాత్రమే జీవీఎంసీ అధికారులు ఫాగింగ్ చేస్తున్నారు. రోజుకు నాలుగైదు ప్రాంతాల్లో చేతి మిషన్‌తో ఫాగింగ్ వేసి చేతులు దులుపుకుంటున్నారు. మెగా ఫాగింగ్ యంత్రంతో అయితే ఎక్కువ ఫలితాలు ఉంటాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. మెగా ఫాగింగ్ యంత్రం ఆటోలో తిప్పితేనే దోమలు తగ్గుదల ఉంటుంది. వీధుల్లో ఆటోలో ఫాగింగ్ వేసి దాదాపు ఏడాదిపైనే కావస్తోంది. అప్పటి నుంచి చేతి మిషన్‌లతోనే అంతంత మాత్రంగా ఫాగింగ్ చేయడం దోమలపై ప్రభావం చూపడం లేదనే విమర్శలున్నాయి. ప్రజారోగ్యం దృష్టిలో పెట్టుకుని ఫాగింగ్ ప్రక్రియ విస్తృతం చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

నేడు పింక్ శారీ సఖీ శారీ వాక్

క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం : సీపీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి, పాల్గొన్న సినీ నటి గౌతమి తదితరులు

రామ్‌నగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మహిళల్లో క్యాన్సర్‌పై అవగాహన కలిగిస్తూ బీచ్ రోడ్డులో పింక్ సఖీ శారీ వాక్ నిర్వహిస్తుండడం అభినందనీయమని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. శనివారం ఓ హోటల్ ఆయన మాట్లాడుతూ ఈ నెల 16న ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అంతర్జాతీయ క్యాన్సర్ మాసోత్సవాల సందర్భంగా రౌండ్ టేబుల్ లేడీస్ సర్కిల్ ఆఫ్ ఇండియా, రోహిత్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం బీచ్‌రోడ్డులోని విష్ణుప్రియ ఫంక్షన్ హాలు నుంచి వుడా పార్కు వరకు శారీ వాక్‌ను నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు వాక్ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ, ప్రముఖ అంకాలజిస్టులు, సామాజిక కార్పొరేట్ సంస్థలు మద్దతు అందిస్తున్నాయని తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నటి గౌతమి, శ్రావణి షిప్పింగ్ ఎండీ జి. సాంబశివరావు, డాక్టర్ డీఎస్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాలలో వీఎంఆర్డీఏ పార్కు

హైదరాబాద్ ట్యాంక్ బండ్ తరహాలో అభివృద్ధి చేయాలని నిర్ణయం

(విశాఖపట్నం - ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి జిల్లా కేంద్రంలో విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస (వీఎంఆర్‌డీఏ) అభివృద్ధి పనులు చేయాలని నిర్ణయించింది. దాదాపుగా రెండు దశాబ్దాల క్రితం రావు గోపాలరావు పేరుతో ఆడిటోరియం నిర్మించింది. ఆ తరువాత భారీ వ్యయంతో ఎటువంటి ప్రాజెక్టులు చేపట్టలేదు. వీఎంఆర్‌డీఏలో అనకాపల్లి జిల్లా కూడా కీలకమైనందున స్థానిక ప్రజలకు ఉపయోగపడేలా పనులు చేపట్టాలని వీఎంఆర్‌డీఏ చైర్మన్, కమిషనర్‌లను కూటమి నేతలు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ల్యాండ్ మార్కులా నిలిచిపోయేలా పార్కు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం తుమ్మపాలలో చెరువును పరిశీలించారు.

దీనిని హైదరాబాద్ ట్యాంక్ బండ్ తరహాలో అభివృద్ధి చేయాలని భావిస్తున్నామని, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత దీనిపై చర్యలు చేపడతామని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ తెలిపారు.

ఏయూలో క్రీడా పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న ఎంవీ రాజు

విశాఖపట్నం, స్పోర్ట్సు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని వివిధ విభాగాలవిద్యార్థులకు ఏయూ స్పోర్ట్సు బోర్డు ఆధ్వర్యంలో వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, బ్యాడ్మింటన్, త్రోబాల్‌క్రీడా పోటీలు నిర్వహిస్తోంది. ఏయూ గ్రౌండ్‌లో శనివారం నుంచి జరుగుతున్న ఈ క్రీడా పోటీలకు ఏయూ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎంవీ.రాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20న జరిగే జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ క్రీడా పోటీలు నిర్వహించడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. ఏయూ స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి ప్రొఫెసర్ ఎన్.విజయ్‌మోహన్ మాట్లాడుతూ శనివారం నుంచి 20వ తేదీ వరకు పురుషుల, మహిళల విభాగాలల పోటీలుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతంలో సీఏల పాత్ర కీలకం


మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

మద్దిలపాలెం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతంలో చార్టెడ్ అకౌంటెంట్(సీఏ)ల పాత్ర కీలకమని చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. పిఠాపురం కాలనీలోని ఐసీఏఐ భవనంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 4.30 లక్షలు సీఏలు ఉన్నారని, 8 లక్షల మంది విద్యార్థులు సీఏ కోర్సు చదువుతున్నారన్నారు. చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా కార్యవర్గంలో 40 మంది ఎన్నికవ్వగా, అందులో 8 మందిని కేంద్ర ప్రభుత్వం నియమించిన కౌన్సిల్ సభ్యులుగా ఉన్నారన్నారు. కేంద్రం ఇటీవల తీసుకుని వచ్చిన ఇన్‌కంట్యాక్స్ బిల్లు దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంతో ఉపయోగపడనుందన్నారు. ఈ బిల్లుకు సంబంధించిన సలహాలు, సూచనలు ఇచ్చేందుకు సీఏలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో ఐసీఏఐ చైర్మన్ అనిర్బాన్ పాల్, సీఏలు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **లైలా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక), మౌర్య (గోపాలపట్నం),
● **తండేల్:** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ(గోపాలపట్నం), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)
● **మదగజరాజా:** జగదాంబ, సౌజన్య (గోపాలపట్నం),
● **సంక్రాంతికి వస్తున్నాం:** శారద, మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
● **డాకు మహారాజ్:** శరత్, శ్రీకన్య, కిన్నెర, సుకన్య, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)
● **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 10, వంకాయలు (తెలుపు)14, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 40, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 40, బీరకాయలు 50, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 14, క్యాబేజీ 12, క్యారెట్ 28 దొండకాయలు 22, బంగాళ దుంపలు 13, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది)45, బరబాటి 26, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 70, బద్దచిక్కుడు 26, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 34, కీరదోస 30, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 32 చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 26, గోరు చిక్కుడు 28, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	96
లైవ్ ధర	116
విత్ స్కిన్	202
స్కిన్‌లెస్	212

వాడవాడలా స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర


కేజీహెచ్ ఆవరణ శుభ్రం చేస్తున్న సూపరింటెండెంట్, వైద్యులు


సీతమ్మధర రైతు బజార్‌ను శుభ్రం చేస్తున్న ఎస్టేట్ అధికారి


ఈపీడీసీఎల్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న సీఎండీ పృథ్వీతేజ్

మహారాణిపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ ఆధ్వర్యంలో సోర్సు రీసోర్సు టీమ్‌తో నిర్వహించిన కార్యక్రమంలో ఆస్పత్రి ప్రాంగణం శుభ్రపరిచి, ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఆస్పత్రి సిబ్బంది వార్డులు, విభాగాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అరికట్టడంలో సహకరించాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాసవీలత, అడ్మినిస్ట్రేటర్ బీవీ రమణ, ఆర్ఎంవోలు డాక్టర్ మెహర్‌కుమార్, డాక్టర్ ధవళ భాస్కరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ద్వారకా బస్‌స్టేషన్‌లో...

ద్వారకాబస్‌స్టేషన్: స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం ఆర్టీసీ అధికారులు ద్వారకా కాంప్లెక్సులోని అన్ని విభాగాల కార్యాలయాలు, కాంప్లెక్సు ప్లాట్‌ఫారాలు, ప్రయాణికులు వేచి ఉండే కారిడార్, పరిసరాలు శుభ్రపరిచారు. కార్యాలయాల్లో వృథా మెటీరియల్స్, పాడైన పరికరాలు, ఇతర వ్యర్థాలు తొలగించారు. ఈ సందర్భంగా విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు మాట్లాడుతూ కాంప్లెక్సును పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రతి రోజు పరిశీలిస్తామన్నారు. నగరాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం సిబ్బందితో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.

రవాణాశాఖ కార్యాలయంలో...

మురళీనగర్: రవాణాశాఖ కార్యాలయంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనరు ఆర్.సి.హెచ్.శ్రీనివాసరావు ఉద్యోగులతో 'నేను... నా పరిసరాల పరిశుభ్రతకు తగినంత సమయం కేటాయిస్తాను' అంటూ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్రాంగణం శుభ్రపరిచారు. వైశాఖీ స్పోర్ట్సు పార్క్‌లో గ్రీన్ క్లైమెట్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు సరితా మంగవేణి, సంస్థ వలంటీర్లు తదితరులు స్వచ్ఛ పరిసరాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.

ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో

సీతంపేట: రామాటాకీస్ రోడ్డులో గల ప్రభుత్వ ప్రాంతీయ నేత్రవైద్యశాలలో స్వచ్ఛ ఆంధ్ర చేపట్టారు. పరిసర ప్రాంతాల్లో వైద్యులు, జూనియర్ వైద్యులు, సిబ్బంది మొక్కలు నాటారు. ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి, ప్రొఫెసర్లు, డాక్టర్లు రమణ, ప్రేమలత, ఆర్ఎంఓ నవీన్‌కుమార్, డాక్టర్ శ్రీలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

సీతమ్మధార రైతుబజార్‌లో

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్ పరిసరాలను ఎస్టేట్ అధికారి కృష్ణమూర్తి పర్యవేక్షణలో రైతులు, డ్వాక్రా గ్రూపుల సభ్యులు, బజార్ అటెండర్ సతీశ్, సిబ్బంది శుభ్రం చేశారు.

ఈపీడీసీఎల్ కార్యాలయంలో..

సీతమ్మధార: స్వచ్ఛాంధ్ర లక్ష సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి పిలుపునిచ్చారు. సంస్థ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ నిర్వహించారు. స్వచ్ఛ ఉద్యోగులతో సీఎండీ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు వి.విజయలలిత, వి.రామచంద్రప్రసాద్, సీజీఎంలు డి.సుమన్ కళ్యాణి, జె.శ్రీనివాసరావు, అచ్చి రవికుమార్ పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో...

అక్కయ్యపాలెం: స్వచ్ఛ విశాఖ రూపకల్పనకు కృషి చేయాలని సీతమ్మధార ఎంఈవో ఎం.రామారావు పిలుపునిచ్చారు. గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర నిర్వహించారు. పాఠశాల ఆవరణలో చెత్తను విద్యార్థులతో కలిసి శుభ్రం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం బి.లక్ష్మీనరస, సీఆర్పీ భాగ్యలక్ష్మి, పీడీ ఎ.సునంద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఆర్టీసీ ద్వారకా కాంప్లెక్సులో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్ఎం


ఎన్జీజీవోఎస్ కాలనీ పాఠశాలలో చెత్త తొలగిస్తున్న ఎంఈవో


మాధవధార ఆర్టీఏ కార్యాలయ ఆవరణ శుభ్రం చేస్తున్న ఉద్యోగులు

కనకమ్మకు తులసి దళార్చన

జగదాంబకూడలి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బురుజుపేట కనకమహాలక్ష్మి ఆలయంలో శనివారం తులసిదళార్చన చేశారు. జేఈవో తిరుమలేశ్వరరావు సమక్షంలో పండితులు ఉభయదాతలతో పూజలు చేయించారు. అనంతరం ఆయుష్య హోమం నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

27న శ్రీకృష్ణ మందిర వార్షికోత్సవం

కంచరపాలెం, ఫిబ్రవరి 15, (ఆంధ్రజ్యోతి): స్థానిక గొల్ల కంచరపాలెంలోని శ్రీ కృష్ణ మందిరం వార్షికోత్సవాన్ని ఈనెల 27వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శి పల్లా ఎర్నికుమార్ కొయ్య జగదీష్ తెలిపారు. ఈమేరకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆం.నేయ శర్మ నేతృత్వంలో ఆరోజు స్వామివారికి విశేష పూజలు, ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తామన్నారు. సాయంత్రం భజన, సంకీర్తనలు జరుగుతాయన్నారు.

'మహాసభలు జయప్రదం చేయాలి'

అల్లిపురం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న విజయవాడలో జరగనున్న విద్యుత్ మీటర్ రీడర్స్ సంఘం రాష్ట్ర మొదటి మహాసభలు జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్ఎల్ అచ్యుతరావు అన్నారు. ఈమేరకు అల్లిపురంలోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో శనివారం పోస్టరును ఆవిష్కరించారు. ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు ప్రవేశపెడుతున్నందున నాలుగు వేల మంది ఉద్యోగాలు కోల్పోతారన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మన్మథరావు, ఎల్.రామకృష్ణ, కె.శివారెడ్డి, డి.క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తొలి పది నెలల్లో కస్టమ్స్ ఆదాయం రూ.11,198.36 కోట్లు

... 5వ పేజీ తరువాయి

పోర్టు ఛైర్మన్ ఎం.అంగముత్తు మాట్లాడుతూ, ఎగుమతి, దిగుమతిదారులకు అనుకూలమైన విధానాలు అమలు చేస్తున్నామన్నారు. వీఎస్ఈజెడ్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. పలువురు వ్యాపారులు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రతినిధులకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కమిషనర్ శ్రీధర్ పాల్గొన్నారు.

భారీ డిస్కౌంట్ల పేరుతో బురిడీ

... 5వ పేజీ తరువాయి

పెద్ద మొత్తంలో కిలోల లెక్కన కొనుగోలు చేసి లారీల్లో నగరానికి తెస్తున్నారు. రోడ్ల పక్కన అమ్మితే మంచి రేటు రాదని...హోటళ్లను ఎంపిక చేసుకుంటున్నారు. వీటిలో చాలా వాటికి ప్యాకింగ్ ఉండదు. సరైన మడతలు ఉండవు. సైజులు రెగ్యులర్‌వి ఉండవు. స్టిక్కర్‌పై ఒక నంబరు, ఒరిజినల్ సైజ్ వేరుగా ఉంటుంది. ధరలు ఎక్కువ వేసేసి, 70 శాతం డిస్కౌంట్ అంటూ రూ.600 నుంచి రూ.1,000కు విక్రయిస్తున్నారు. వాస్తవానికి ఇప్పుడు ఆన్‌లైన్ షాపింగ్ వచ్చిన తరువాత..సంప్రదాయ షాపింగ్ మాల్స్ కూడా పోటీని తట్టుకోవడానికి ఆ ధరలకే అన్నిరకాల దుస్తులు అందుబాటులో ఉంచుతున్నాయి.

తేడా వస్తే పరిస్థితి ఏమిటి?

నగరంలో ఏ షాపింగ్ మాల్‌లో ఏమి కొన్నా తేడా వస్తే ఎక్స్ఛేంజ్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లోనూ ఆ సదుపాయం ఉంది. కానీ మూడు రోజుల సేల్ అంటూ వచ్చి, భారీ డిస్కౌంట్లు అంటూ బురిడీ కొట్టించే వారి దగ్గర కొంటే...ఆ తరువాత తేడా వస్తే అడగడానికి ఇక్కడ ఎవరూ ఉండరు. ఎక్స్ఛేంజ్ సదుపాయం ఉండదు. పోనీ మళ్లీ వచ్చినప్పుడు అడుగుదామంటే ఒకసారివచ్చిన వారు రెండోసారి రావడం లేదు. కొనుగోలుదారులు ఈ డిస్కౌంట్ సేల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి.

పందుంపుల్లల సందుకు సరికొత్త కళ

▸▸ ఆక్రమణల తొలగింపుతో విశాలంగా మారిన రహదారి

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ పందుంపుల్లల సందు కొత్త కళను సంతరించుకుంది. ఇక్కడ రెండురోజుల క్రితం పోలీసు లు ఆక్రమణలను తొలగించడంతో సువిశాలంగా కనిపిస్తోంది. ఈ మార్గం లో 60 ఏళ్లకు పైగా దుస్తుల వ్యాపారం సాగుతోంది. దీంతో మునిసిపల్ స్టేడియం వైపు వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొనేవారు. రోడ్లు ఆక్రమణకు గురవడం, రాజకీయ ఒత్తిళ్లతో తొలగింపునకు జీవీఎంసీ, పోలీసులు వెనకడుగు వేయడంతో సమస్యకు పరిష్కారం లభించలేదు. అయితే పూర్ణామార్కెట్ ప్రక్షాళనలో భాగంగా వన్‌టౌన్ సీఐ జేడీ బాబు ఆధ్వర్యంలో ఆక్రమణలు తొలగించారు. రోడ్డు ఆక్రమించి వ్యాపారాలు చేస్తే కేసులు పెడ తామని హెచ్చరించారు. వర్తక సంఘం ప్రతినిధి పెంటకోట సత్యనారాయణతో మాట్లాడారు. దీంతో ఆక్రమణలను వ్యాపారులు స్వచ్ఛందంగా తొలగించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


విశాలంగా మారిన మార్కెట్

'నోటీసులను వెనక్కి తీసుకోకపోతే ఉద్యమం'


సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల ప్రతినిధులు

సీతంపేట, ఫిబ్రవరి 15, (ఆంధ్రజ్యోతి): వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చే మీడియాను బెదిరించేలా ఆర్డీవో ఇచ్చిన నోటీసులను వెనక్కి తీసుకోవాలని, లేదంటే ఉద్యమం చేస్తామని దళిత మహిళ ప్రజా సంఘాలు, జర్నలిస్టులు గళమెత్తారు. ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ ఆధ్వర్యంలో పౌర గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో పీఓడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, చైతన్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు కె.లలిత తదితరులు మాట్లాడుతూ లీడర్ పత్రిక సంపాదకుడు వీవీ రమణమూర్తికి విశాఖ ఆర్డీఓ శ్రీలేఖ చట్ట విరుద్ధంగా నోటీసులు ఇచ్చారన్నారు. భావ ప్రకటన, వాక్ స్వాతంత్ర్యాన్ని, పత్రికా స్వేచ్ఛను హరిస్తూ బెదిరించేలా నోటీసు సారాంశం ఉందన్నారు. విశాఖలో భూ కుంభకోణాలు జరుగుతున్నాయని, ప్రతికలు, చానల్స్ వాటిని వెలుగులోకి తెస్తున్నాయన్నారు. మీడియాను నిరోధించేలా ఆర్డీవో నోటీసు ఉందని, వెంటనే వెనక్కి తీసుకోకపోతే రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, జర్నలిస్టు సంఘాలతో కలిసి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ మేరకు భవిష్యత్తు కార్యచరణ రూపొందిస్తున్నామన్నారు. సమావేశంలో రాజకీయ ఖైదీల విడుదల కమిటీ కన్వీనర్, న్యాయవాది కె.పద్మ, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు డెంకాడ ఆనంద్, ఈఎన్ఎస్ బాలు, డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్, వీవీ గిరి, కిశోర్, ఎస్.సుధాకర్, లలిత, జె.శ్యామల, విజ్ఞానంద్, వెంకటలక్ష్మి, బాల నాగమ్మ, వాల్మీకి నాగరాజు, బూసి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంతోనే ప్రజలకు సంపూర్ణ రక్షణ

▸▸ విశ్రాంత ఎస్పీ డాక్టర్ కె.రాజశిఖామణి


అంబేడ్కర్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఐడీజేఏస్ ప్రతినిధులు

సీతమ్మధార, ఫిబ్రవరి 15, (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజల హక్కులను రాజ్యాంగం పరిరక్షిస్తోందని విశ్రాంత ఎస్పీ డాక్టర్ కె.రాజశిఖామణి స్పష్టం చేశారు. అంబేడ్కర్ భవన్‌లో ఇంటర్నేషనల్ దళిత జర్నలిస్టుల నెట్‌వర్క్ (ఐడీజేఎస్) ఆధ్వర్యంలో 'రాజ్యాంగం అవశ్యకత..పరిరక్షణ' అంశంపై శనివారం నిర్వహించిన సదస్సులో ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం పాత్రిపాదికపై గొప్ప రాజ్యాంగాన్ని అదించిన ఘనత అంబేడ్కర్‌కు దక్కిందన్నారు. రాజ్యాంగ విలువల పరిరక్షణలో మీడియా ప్రధాన పాత్ర పోషించాలన్నారు. అంబేడ్కర్ లా కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కోట పల్లవి మాట్లాడుతూ రాజ్యాంగాన్ని ప్రశ్నిస్తే ఉల్లంఘన కాదన్నారు. ప్రాథమిక హక్కులు ఆదేశిక సూత్రాలు మేలు చేసేవన్నారు. సదస్సులో ఈపీఎస్ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, ఐడీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తంగేటి నానాజీ, డాక్టర్ బి.రమేశ్‌బాబు, బొడ్డు కళ్యాణరావు, సీఐ బి.లూథర్ బాబు, పి.సత్యనారాయణ, కె.చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యం పెంచుకోవాలి

కంచరపాలెం, ఫిబ్రవరి 15,(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాల్లో ఉపాధ్యాయులు బోధనలో నైపుణ్యం పెంపొందించుకోవాలని గోపాలపట్నం ఎంఈవో డి.దివాకర్ అన్నారు. ఆర్పీపేట క్లస్టర్ కాంప్లెక్స్ శనివారం ఉన్నత పాఠశాలలో జరిగింది. కార్యక్రమంలో ఎంఈవో దివాకర్ ఆకట్టుకునే బోధనా పద్ధతులను వివరించారు. క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ సాంకేతికతకు అనుగుణంగా బోధనా సామర్థ్యాలను మార్చుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులకు 1,2 తరగతులు ఒక విభాగం, 3 నుంచి 5తరగతులు ఒక విభాగంగాను, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు సబ్జెక్టుల వారీగా ఆర్పీలు శిక్షణ ఇచ్చారు. ఏడు పాఠశాలల టీచర్లు, హెచ్ఎం పాల్గొన్నారు.


సూచనలిస్తున్న గోపాలపట్నం ఎంఈవో దివాకర్

సీతమ్మధార: సీతమ్మధార పీ అండ్‌టీ కాలనీలోని ఎన్ఎంసీహెచ్ స్కూల్‌లో స్కూల్ క్లస్టర్ కాంప్లెక్స్ శనివారం నిర్వహించారు. ఉపాధ్యాయుల బోధన, కొత్తగా ఏర్పాటయ్యే పాఠశాలలు, మార్పులపై వివరించారు. వెనుకబడిన పిల్లల విద్యాభివృద్ధికి తీసుకుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఉపాధ్యాయులు, హెచ్ఎం రాంప్రసాద్, ఎంఈవో కేపీ బాలమణి పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: విద్యార్థులను విద్యావంతులుగా తీర్చి దిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని స్కూల్ క్లస్టర్ ప్రిన్సిపాల్ బి.లక్ష్మీనరస అన్నారు. గ్రేటర్ 26వ వార్డు జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన స్కూల్ క్లస్టర్ సమావేశంలో మాట్లాడుతూ త్వరలో జరగనున్న పరీక్షల్లో ప్రతి విద్యార్థి మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్లస్టర్ పరిధిలోని 8 ప్రాథమిక, ఉన్నత పాఠశాలల నుంచి 50 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఎంఈవో ఎం.రామారావు తదితరులు పాల్గొన్నారు.

డీజిల్ పంచాయితీపై కలెక్టర్ సీరియస్

... 5వ పేజీ తరువాయి

తెలుసుకున్నారు. బకాయిలు చెల్లించేంత వరకూ డీజిల్, పెట్రోల్ సరఫరా చేయడానికి ఆథరైజ్డ్ బంకు యజమాని నిరాకరిస్తున్నారని, అందుకే ఫాగింగ్‌తోపాటు జోన్-2 పరిధిలోని చెత్త తరలింపు వాహనాలను నిలిపేయాల్సి వచ్చిందని ఆయన వివరణ ఇచ్చారు. బంకుకు బిల్లు బకాయిలు ఎందుకు చెల్లించలేదని చీఫ్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్‌ను జిల్లాకలెక్టర్ ప్రశ్నించారు. తనకు పూర్తి వివరాలతో బిల్లు పంపించలేదని, కొన్ని అభ్యంతరాలు ఉండడంతో వాటిని పరిష్కరించాలని మెకానికల్ విభాగం అధికారులకు సూచించినా, ఇంతవరకూ స్పందించలేదని ఆయన చెప్పారు. అనంతరం మెకానికల్ ఎస్ఈ గణేష్‌కుమార్‌ను వివరణ కోరితే తమ వైపు నుంచి అన్ని వివరాలు ఇచ్చామని, ఫాగింగ్‌కు అవసరమైనదానికంటే ఎక్కువ పెట్రోల్, డీజిల్ వినియోగిస్తున్నట్టు ప్రజారోగ్య విభాగం నుంచి బిల్లు పెట్టడంతో తాము అభ్యంతరం వ్యక్తంచేశామని వివరించారు. అధికారులంతా ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడంతో కలెక్టర్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించి, తిరిగి డీజిల్, పెట్రోల్ సరఫరాను పునరుద్ధరించడంతోపాటు ఫాగింగ్ ప్రారంభం కావాలని ఆదేశించారు. అధికారుల మధ్య సమన్వయం లోపం వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే ఉపేక్షించేది లేదని స్పష్టంచేసినట్టు సమాచారం. పత్రికల్లో కథనాలు వచ్చేంత వరకూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురాపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తంచేసినట్టు తెలిసింది. దీంతో రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చినట్టు తెలిసింది.

అమ్మాయిలు మిస్సింగ్!

... 5వ పేజీ తరువాయి

సోషల్ మీడియాలో పెడతామని, కుటుంబ సభ్యులకు పంపిస్తామని బెదిరింపులకు దిగుతుంటారు. ఈ పరిస్థితిని యువతుల నుంచి పెళ్లై పిల్లలు ఉన్న మహిళల వరకూ ఎదుర్కొంటున్నారు. కొంతమంది బయటకు వెళ్లిపోయి పెళ్లి చేసుకుని కొద్దిరోజులకే మోసపోతున్నారు. మరికొందరు మోసగాళ్ల బెదిరింపులు, బ్లాక్‌మెయిల్‌కు భయపడి వారు చెప్పినట్టు చేస్తున్నారు. ఇంకొందరు మాత్రం తమ వీడియోలు ఫొటోలు ఎక్కడ బయపెట్టేస్తే కుటుంబసభ్యులు, బంధువులు ఎదుట తలెత్తుకుని బతకలేమనే మనస్తాపంతో ఇళ్లు విడిచిపోతున్నారు. ఈ తరహా కేసులు గత కొంతకాలంగా పెరుగుతుండడం ఆందోళనకు గురిచేస్తోంది. గత ఏడాది జనవరి ఒకటి నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 12వ తేదీ వరకూ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో 539 మంది మహిళలు అదృశ్యమైతే వారిలో 388 మందిని పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాలికల విషయానికి వస్తే గత ఏడాది జనవరి ఒకటి నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 12 వరకు 163 మంది అదృశ్యమైతే వారిలో 149 మందిని పోలీసులు కనిపెట్టి నగరానికి తీసుకువచ్చారు.

పిల్లలను ఓ కంట కనిపెట్టండి

... 5వ పేజీ తరువాయి

కనిపిస్తుంటాయని చెబుతున్నారు. ఆ తరువాత దశలో పిల్లలు వ్యవహారశైలి మరింత ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందంటున్నారు.

తీవ్రంగా స్పందించే తీరు..

12 నుంచి 14 ఏళ్ల వయసుకు వచ్చేసరికి కొంతమంది పిల్లల వ్యవహారశైలి పూర్తి భిన్నంగా ఉంటోంది. కోర్కెలు పెరుగుతున్నాయి. వాటిని తీర్చుకునే మార్గాల కోసం అన్వేషిస్తుంటారు. ఆ సమయంలో పిల్లలను తల్లిదండ్రులు మరింత జాగ్రత్తగా కనిపెట్టుకుని ఉండాలి. పిల్లల స్నేహితులు, వారి అలవాట్లు, తిరిగే ప్రదేశాలు గురించి స్పష్టమైన అవగాహన ఉండాలి. లేకపోతే తప్పుడు మార్గాల వైపు వెళ్లే ప్రమాదం ఉంది. పిల్లల వ్యవహారశైలి భిన్నంగా ఉంటే మాత్రం కాస్త అప్రమత్తంగా ఉండి తల్లిదండ్రులు వారితో ఎక్కువ సమయం గడపడం ద్వారా విపరీతమైన సమస్యలకు దారితీయకుండా కాపాడుకోవచ్చు. ఈ వయసులో పిల్లలు అనేకం కోరుతుంటారు. వాటిని తీర్చే విషయంలో తల్లిదండ్రులు కొంత జాగ్రత్తగా వ్యవహరించాలి. ఆర్థిక పరిస్థితులు, కుటుంబ ఇబ్బందులు వంటివి అర్థమయ్యేలా చెప్పి కాదనాలి. అవసరమైనవి అయితే కొంత ఇబ్బంది అయినా కొనవచ్చు. అవసరం లేనివి అడిగితే మాత్రం...ఆ విషయాన్ని అర్థమయ్యేలా చెప్పాలి. కొట్టో, తిట్టో వద్దని చెప్పడం వల్ల పిల్లలు మరింత అగ్రెసివ్‌గా తయారై, తల్లిదండ్రుల పట్ల కసిని పెంచుకునే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఈ వాతావరణం విపరీతమైన పరిణామాలకు దారితీయవచ్చు.

గుడ్ పేరెంటింగ్‌తో పరిష్కారం

గుడ్ పేరెంటింగ్ అన్నది చాలా కీలకం. పిల్లలను పెంచే విధానమే భవిష్యత్తులో వారి జీవితాలకు భరోసాను కల్పిస్తుంది. ప్రతిరోజూ కొంత సమయం పిల్లలతో గడపాలి. చిన్న వయసు నుంచి ఇలా సమయం వెచ్చించడం చాలా మంచిది. పదేళ్లు దాటిన తరువాత మాత్రం తప్పనిసరి. అప్పుడే పిల్లల్లో వచ్చే విపరీతమైన మార్పులను గుర్తించి వాటిని సరి చేసేందుకు అవకాశం ఉంటుంది. ప్రతిరోజూ మంచి,చెడులు, సమాజంలో వస్తున్న మార్పులు, ఇంట్లో ఉన్న పరిస్థితులను, వారి బాధ్యతలను తెలియజేస్తూ ఉండాలి. గుడ్ పేరెంటింగ్ మాత్రమే పిల్లలను మంచి మార్గంలో తీసుకువెళ్లేందుకు దోహదం చేస్తుందని నిపుణులు చెబున్నారు.

ఇలా చేయాలి..

చిన్న వయసు నుంచి పిల్లలను నలుగురితో కలిసేలా చేయాలి. శారీరక శ్రమ కలిగించే యాక్టివిటీస్‌లో భాగం చేయడం ద్వారా ఫోన్ వంటి వాటికి దూరంగా ఉంచవచ్చు. ఇరుగుపొరుగుతో కలిసి ఆడుకునేలా ప్రోత్సహించాలి. దీనివల్ల పిల్లల్లో ఆత్మన్యూనతా భావం తగ్గుతుంది. పెద్దలు చెప్పే మాటలను వినేలా అలవాటు చేయాలి. పుస్తకాలు చదివేలా ప్రోత్సహించాలి. ఇలా చేయడం వల్ల పిల్లల్లో మొండితనం తగ్గుతుంది.

ప్రాథమిక స్థాయిలోనే గుర్తించాలి

కొన్నాళ్లుగా పిల్లల్లో అతి ప్రవర్తన ప్రధానమైన సమస్యగా ఉంటోంది. కౌమార దశ దాటిన తరువాత పిల్లల్లో ఈ తరహా వ్యవహారశైలి అధికంగా కనిపిస్తోంది. ఎంత చెప్పినా పిల్లలు దారిలోకి రావడం లేదని తల్లిదండ్రులు మా వద్దకు తీసుకువస్తున్నారు. అటువంటి వారికి కౌన్సెలింగ్ చేయాల్సి వస్తోంది. తల్లిదండ్రులు ప్రాథమిక దశలో పిల్లల వ్యవహారశైలిని గుర్తించి చక్కదిద్దే ప్రయత్నం చేస్తే ఈ ఇబ్బంది ఉండదు. పిల్లల్లో నియంత్రించలేని ప్రవర్తన, కడుపు నొప్పి, తలనొప్పి, దీర్ఘకాలం విచారంగా ఉండడం, కారణం లేకుండా బరువు తగ్గడం, చదువులో చురుకుదనం లేకపోవడం, మానసిక కల్లోలం, చికాకు వంటి లక్షణాలు కనిపిస్తే అప్రమత్తం కావాలి. ప్రతి చిన్నదానికి అలగడం, కోప్పడడం వంటివి కూడా పిల్లల్లో మానసిక ఇబ్బందులకు కారణంగా గుర్తించాలి.

- డాక్టర్ ముత్యాల బాలాజీ, మానసిక వైద్య నిపుణులు

బర్డ్ ఫ్లూ టెన్షన్

... 5వ పేజీ తరువాయి

తినొచ్చని వైద్యులు చెబుతున్నారు. గుడ్లు కూడా బాగా ఉడకబెట్టి తినడం మంచిది. కొద్దిరోజులపాటు ఆమ్లెట్స్, సగం ఉడికిన గుడ్లు తినకుండా ఉండడం మంచిదంటున్నారు. అలాగే, గ్రిల్డ్ చికెన్, ఉడికీ, ఉడకని చికెన్‌కు దూరంగా ఉంటే మంచిదని సూచిస్తున్నారు. బర్డ్ ఫ్లూ నమోదైన ప్రాంతానికి విశాఖ దూరంగా ఉండడం వల్ల ప్రస్తుతం ఇబ్బందేమీ ఉండదని, కానీ తగిన జాగ్రత్తలను పాటించాలని పేర్కొంటున్నారు.

ఇలా వ్యాప్తి..

సాధారణంగా కోళ్ల నుంచి మనుషులకు ఈ వ్యాధి అంత వేగంగా రాదు. ఆయా కోళ్ల ఫారాల్లో పనిచేసే వారికి వచ్చేందుకు ఎక్కువ అవకాశం ఉంటుంది. కోడి మలం, మూత్రం అంటిన వారికి ఈ వైరస్ సోకుతుందని, అది అతి తక్కువ సందర్భాల్లో మాత్రమే జరుగు తుందని వైద్యులు పేర్కొంటున్నారు. కోళ్ల నుంచి మనుషులకు సోకితే మాత్రం స్వైన్ ఫ్లూకు ఇచ్చే మందులు అందించి కోలుకునేలా చేస్తారు. బర్డ్ ఫ్లూ మనుషులకు సోకితే శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, డయేరియా, పొత్తి కడుపులో నొప్పి, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. కేసులు నమోదైన పరిసర ప్రాంతాల్లో ప్రజలకు ముప్పు కొంచెం అధికంగా ఉంటుందని, కాబట్టి అటువంటి వారంతా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నగరంలో ప్రజలకు ఇబ్బంది లేదని, అయితే ప్రస్తుత పరిస్థితుల్లో జాగ్రత్తలు తీసుకోవడం మేలన్నారు.

బర్డ్ ఫ్లూతో 'జూ'లో అలర్ట్

▸▸ మూడు వారాల నుంచి జంతువులకు చికెన్, గుడ్లు సరఫరా నిలిపివేత

విశాఖపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గోదావరి జిల్లాల్లో బర్డ్ ఫ్లూ వైరస్ ప్రబలడంతో నగరంలోని ఇందిరా ప్రియదర్శిని జంతుప్రదర్శనశాల (జూ) అధికారులు అప్రమత్తమయ్యారు. వాస్తవానికి మూడు వారాల క్రితం పాట్నా జూలో కొన్ని పక్షులకు వైరస్ సోకినప్పుడే సెంట్రల్ జూ అథారిటీ దేశంలోని అన్ని జంతుప్రదర్శన శాలలను అలర్ట్ చేసింది. దీంతో జంతువులకు ఆహారంగా చికెన్, గుడ్లు ఇవ్వడాన్ని నిలుపుదల చేశారు. చికెన్‌కు బదులుగా మటన్ సరఫరా చేస్తున్నారు. ఇంకా పక్షులు ఉండే ఎన్‌క్లోజర్ల నిర్వహణ విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వాటి వద్ద విధులు నిర్వహించే సిబ్బంది ఇంటి నుంచి వచ్చిన తరువాత విధిగా డ్రెస్ మార్చుకోవాలి. అది కూడా ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అధికారులు ఆదేశించారు. పక్షులున్న ఎన్‌క్లోజర్ల వద్దకు ఇతర జంతువులు వెళ్లకుండా చూడాలని సూచించారు. ఇంకా సిబ్బందికి శానిటైజ్ బాటిల్స్ సరఫరా చేస్తున్నారు. జంతువులకు ఆహార పదార్థాలు తీసుకువచ్చే వాహనాలను కూడా శానిటైజ్ చేయాలని నిర్ణయించారు. రెండు, మూడు రోజుల్లో జూ రెండు ప్రధాన గేట్ల వద్ద సందర్శకులు కూడా విధిగా చేతులు శుభ్రం చేసుకునేలా శానిటైజ్ బాటిల్స్ సిద్ధం చేయనున్నారు. బర్డ్‌ఫ్లూ వైరస్ ప్రబలుతున్న నేపథ్యంలో జూలో అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని క్యూరేటర్ మంగమ్మ తెలిపారు. జంతువులు, పక్షుల రక్షణకు చర్యలు తీసుకున్నామన్నారు. జూ సందర్శనకు వచ్చే సందర్శకులు ఎన్‌క్లోజర్‌లకు దగ్గరగా వెళ్లి జంతువులు, పక్షులను తాకరాదని, ఆహారం వంటివి వేయవద్దని విజ్ఞప్తి చేశారు. ఎన్‌క్లోజర్లకు దూరంగా ఉండాలని సూచించారు. పక్షులు, జంతువుల రక్షణ ప్రతి ఒక్కరూ జూ అధికారులకు సహకరించాలని కోరారు.

దొంగను పట్టుకోబోయి.. రైలు ఢీకొని.. ఢిల్లీలో 'అనంత' జవాన్ మృతి


జవాన్ లక్ష్మన్న

బ్రహ్మసముద్రం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): భార్య మెడలోని తాళిబొట్టు గొలుసును తెంచుకువెళుతున్న దొంగను పట్టుకునే క్రమంలో రైలు కిందపడి జవాన్ లక్ష్మన్న (32) మృతి చెందారు. ఈ ఘటన ఢిల్లీలో శుక్రవారం రాత్రి జరిగింది. అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం మండల కేంద్రానికి చెందిన లక్ష్మన్న. 2014లో బీఎస్ఎఫ్ జవానుగా ఉద్యోగంలో చేరారు. డిసెంబరులో ఆయన జమ్మూ కశ్మీర్‌కు బదిలీ అయ్యారు. లక్ష్మన్నకు ఐదేళ్ల క్రితం కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లాకు చెందిన లక్ష్మితో వివాహమైంది. నెల క్రితం సెలవుపై కుటుంబ సమేతంగా సొంతూరికి వచ్చారు. 16న విధుల్లో చేరాల్సి ఉండడంతో బుధవారం తిరుగు ప్రయాణమయ్యారు. శుక్రవారం రాత్రి హజరత్ నిజాముద్దీన్ ఈస్ట్ రైల్వేస్టేషన్‌కు 50 కి.మీ. దూరంలో రైలు నెమ్మదిగా వెళ్తున్న సమయంలో లక్ష్మి మెడలోని మంగళసూత్రాన్ని ఒక దొంగ లాక్కొని పరుగులు తీశాడు. దొంగను పట్టుకునేందుకు రైలు నుంచి లక్ష్మన్న కిందకు దూకగానే పక్క ట్రాక్‌పై వచ్చిన రైలు ఢీకొట్టింది. దీంతో లక్ష్మన్న అక్కడికక్కడే మృతి చెందారు. కళ్లెదుటే భర్త మృతి చెందడంతో లక్ష్మి స్పృహ తప్పి పడిపోయారు. అక్కడే ఉన్న మరో జవాను లక్ష్మన్న కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. విధుల్లో చేరటానికి వెళ్లిన కుమారుడి మృతి వార్త విని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

వాటర్ వర్క్స్ విభాగంలో ఇంజనీర్ల కొరత

జీవీఎంసీ గాజువాక జోన్‌లోని 20 వార్డులకూ ఒకే ఒక్క అసిస్టెంట్ ఇంజనీర్!

తరచూ తాగునీటి సరఫరాలో ఇబ్బందులు

తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు



గాజువాక, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ)ర్ ఎంతో కీలకమైన గాజువాక జోన్‌లో వాటర్ వర్క్స్ విభాగంలో ఇంజనీర్ల కొరత నెలకొంది. ఈ విభాగంలో పూర్తి స్థాయిలో ఇంజనీర్లు లేకపోవడంతో పర్యవేక్షణ కొరవడి దిగువ స్థాయి సిబ్బంది ఆడిందే.. ఆట పాడిందే పాటగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విభాగంలో గతంలో నలుగురు ఇంజనీర్లు ఉండేవారు. ప్రస్తుతం కేవలం ఒక ఇంజనీర్ పర్యవేక్షణలో విభాగం మొత్తం నడుస్తోంది. దీంతో ఏ వార్డులో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది.

గతంలో నాలుగు వార్డులకు ఒకరు చొప్పున నలుగురు సహాయక ఇంజనీర్లు ఉండేవారు. దీంతో ఆయా వార్డులో తాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు ఉండేవి కావు. తాగునీటి సరఫరా పైపుల లీకేజీలు, ఇతర సమస్యలు ఏమైనా ఎదురైతే వెంటనే సిబ్బంది స్పందించి మరమ్మతులు చేపట్టేవారు. జోన్ పరిధిలో ప్రధానంగా పైపు లైన్ల లీకేజీల కారణంగా తరచూ భారీ మొత్తంలో తాగునీరు వృథాగా పోతోంది. ఈ సమస్యను పరిష్కరించడంలో ఇంజనీర్లు పర్యవేక్షణ లేకపోవడంతో కొన్ని వార్డుల్లో అరకొరగా తాగునీరు సరఫరా జరుగుతుండడంతో ప్రజలు నీటి కోసం నానాపాట్లు పడుతున్నారు పైపు లైన్లకు నిర్వహణ లేకపోవడంతో 72వ వార్డు పరిధి మెహర్ నగర్ పరిసరాల్లో నిత్యం తాగునీరు వృథాగా పోతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా జోన్ పరిధిలో కొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరాలో సమయపాలన పాటించకపోవడంతో నీటి కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుందని మహిళలు వాపోతున్నారు. అందువల్ల ఉన్నతాధికారులు స్పందించి వాటర్ వర్క్స్ విభాగంలో ఖాళీగా ఉన్న ఇంజనీర్ల పోస్టులను భర్తీ చేసి తమకు తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



మెహర్ నగర్‌లో వృథాగా పోతున్న తాగునీరు

ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

» అగనంపూడి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి

అగనంపూడి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత శుభ్రతతో పాటు ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని స్థానిక ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంపై సిబ్బంది, రోగులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంఓ ఆమె పాల్గొని మాట్లాడారు. ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రతను పాటించాలన్నారు. అనంతరం వైద్యులు, రోగులు, సిబ్బందితో ఆమె ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైద్యులు లలిత, గోపీకృష్ణ, ప్రత్యూష, ఏవో రవిరాజ్, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వైద్యులు, సిబ్బంది, రోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ భారతి

గోపాలపట్నం: ఇక్కడి రైతు బజారుతో పాటు పరిసరాల్లో ఉన్న చెత్తాచెదారం, వ్యర్థాలను రైతులు, వర్తకులు తొలగించారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ కార్యక్ర మంలో భాగంగా రైతు బజారుతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. అనంతరం రైతు బజార్ ఎస్టేట్ అధికారి ప్రసాద్ రైతులతో ప్రతిజ్ఞ చేయించారు.



రైతుబజారు పరిసరాలను శుభ్రం చేస్తున్న రైతులు, వర్తకులు

వేపగుంట: గ్రేటర్ 94వ వార్డు పరిధి అప్పలనర్సయ్య నగర్‌లో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కొండవాలు ప్రాంతాల్లోని పరిసరాలను ప్రజలందరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తడి, పొడి, ప్రమాదకర చెత్తను వేరు చేయాలని, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఏపీ నెలల్లో ఎటువంటి పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టాలో కాలనీవాసులుకు సూచించారు. కార్యక్రమంలో శానిటేషన్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

21న గాజువాకలో చిన్మయ యువ తరంగ్

గాజువాక, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): స్వామి చిన్మయానందులు ప్రారంభించిన చిన్మయ యువ కేంద్రం 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 21న చిన్మయ యువ తరంగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ప్రతినిధులు తెలిపారు. యువ తరంగ్ కార్యక్రమ పోస్టరును శనివారం గాజువాక సర్దార్ నెస్ట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ సర్దార్ నెస్ట్ సహకారంతో దేశ భక్తి, నైతిక విలువలు, సమాజసేవ, భారతీయ సంస్కృతిని చాటిచెప్పేందుకు చిన్మయ యువ తరంగ్‌ను కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు వెంకన్నచౌదరి, జయంతి, వాణిశ్రీ, రమణి, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్‌లో 21 నుంచి యువ తరంగ్ ఫెస్ట్



విజ్ఞాన్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న గాయకుడు ధనంజయ్

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ కళాశాలలో ఈ నెల 21 నుంచి రెండు రోజుల పాటు యువతరంగ్-2కే25 యూత్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన బ్యానర్‌ను శనివారం కళాశాల ప్రాంగణంలో సినీ గాయకుడు ధనంజయ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించే ఫెస్టివల్‌లో విద్యార్థులు పాల్గొని ఆనందంగా గడపాన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ జె.సుధాకర్ మాట్లాడుతూ ఏటా మాదిరిగానే ఈ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహిస్తామని, జాతీయ స్థాయిలో నిర్వహించే యువ తరంగ్‌కు అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాళ్లు వై.శ్రీనివాసరావు, అరుంధతి, తదితరులు పాల్గొన్నారు.



గాజువాకలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు



ఎంపీ శ్రీభరత్‌ను సత్కరించి స్వాగతం పలుకుతున్న నాయకులు

ఎంపీ శ్రీభరత్‌కు సాదర స్వాగతం

గోపాలపట్నం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌తో కూడిన రైల్వే జోన్‌ను కేంద్రం ప్రకటించాక ఢిల్లీ నుంచి విశాఖ వచ్చిన విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్‌కు రైల్వే యూనియన్ నాయకులు విమానాశ్రయంలో ఘనంగా స్వాగతం పలికారు. శనివారం సాయంత్రం ఢిల్లీ నుంచి విశాఖ చేరుకున్న ఎంపీకి రైల్వే యూనియన్ నేత చలసాని గాంధీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, పలువురు రైల్వే యూనియన్ నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ విశాఖలో రైల్వే అభివృద్ధికి కృషి చేస్తానని, సౌత్ కోస్ట్ రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభించాలని కేంద్రాన్ని కోరుతామన్నారు. అనంతరం నాయకులు, ఉద్యోగులు శ్రీభరత్‌ను సత్కరించారు.

మహిళలకు కారు, ఆటో డ్రైవింగ్‌లో శిక్షణ

మల్కాపురం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కోరమాండల్ ఎరువుల కర్మాగారం సంస్థ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా మహిళలకు ఆటో, కారు డ్రైవింగ్‌లలో శిక్షణ ఇచ్చే కార్యక్రమానికి శనివారం శ్రీకారం చుట్టింది. 58వ వార్డులో ఉన్న ఆసక్తి గల మహిళలకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని సంస్థ డీజీఎం (హెచ్‌ఆర్) రెడ్డిపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధిలో భాగంగా ఆటో, కారు డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వడంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించి, ఉపాధి కల్పించే దిశగా కోరమాండల్ సంస్థ అడుగులు వేస్తుందన్నారు. ఇందులో ఫెమీ రైడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ ద్వారా మహిళలకు శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు జె.మహేశ్, ఎస్.వెంకటరమణ, వేణుగోపాల్‌రెడ్డి, రాధిక బెహరా, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో మరొకరికి ప్రాణ దానం

గాజువాక, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న మరొకరికి ప్రాణదానం చేసిన వారవుతామని వాసవి ఇంటర్నేషనల్ క్లబ్ రీజనల్ చైర్మన్ కొల్లూరు రమేశ్ అన్నారు. ఇక్కడి వాసవి కల్యాణ మండపంలో వాసవి క్లబ్, ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో రక్తం అందక ఏ ఒక్కరూ ఇబ్బందులు పడకూడదని, ఆరోగ్యవంతమైన యువత రక్తదానం చేయాలని కోరారు. అనంతరం 50వ సారి రక్తదానం చేసిన కె.సతీశ్‌కు సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు శరత్‌చంద్ర గుప్త, శైలజ, వినోద్‌బాలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్ల పంపిణీ

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, ఇతర సాంస్కృతిక రంగాలలోనూ రాణించాలని గాజువాక ఎంఈవో ఎ.సునీత అన్నారు. అక్కిరెడ్డిపాలెం హైస్కూల్‌లో శనివారం నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు 150 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లను ఎంఈవో అందజేశారు. హైస్కూల్ హెచ్‌ఎం ఎంఎల్ఎస్ కాంతం మాట్లాడుతు విద్యార్థులు క్రీడల్లో మరింత రాణించేందుకు నాంది ఫౌండేషన్ సహకరించడం అభినందనీయమన్నారు.

యువత సమాజ సేవ కూడా చేయాలి

మల్కాపురం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): యువత కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా సమాజంలో జరుగుతున్న విషయాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు సమాజ సేవ చేయాలని సెయింట్ ఆన్స్ సొసైటీ విశాఖపట్నం సుపీరియర్ సిస్టర్ సాండ్రినా అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన సీనియర్ విద్యార్థినుల విజయోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వివిధ పోటీలలో, సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు. కరస్పాండెంట్ సిస్టర్ గెసెల్లా మాట్లాడుతూ సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి, మహిళా సాధికారతకు విద్యార్థినులు ప్రతీకలుగా నిలవాలన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి మాట్లాడుతూ విద్యార్థినులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారి అనసూయాదేవి, అధికారులు అంజలిదేవి, నదియా, తదితరులు పాల్గొన్నారు. పలు సేవా కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు బహుమతులిచ్చారు.

తుమ్మపాలలో వీఎంఆర్‌డీఏ పార్కు

హైదరాబాద్ ట్యాంక్ బండ్ తరహాలో అభివృద్ధి చేయాలని నిర్ణయం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి జిల్లా కేంద్రంలో విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) అభివృద్ధి పనులు చేయాలని నిర్ణయించింది. దాదాపుగా రెండు దశాబ్దాల క్రితం రావు గోపాలరావు పేరుతో ఆడిటోరియం నిర్మించింది. ఆ తరువాత భారీ వ్యయంతో ఎటువంటి ప్రాజెక్టులు చేపట్టలేదు. వీఎంఆర్‌డీఏలో అనకాపల్లి జిల్లా కూడా కీలకమైనందున స్థానిక ప్రజలకు ఉపయోగపడేలా పనులు చేపట్టాలని వీఎంఆర్‌డీఏ చైర్మన్, కమిషనర్‌లను కూటమి నేతలు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ల్యాండ్ మార్కులా నిలిచిపోయేలా పార్కు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం తుమ్మపాలలో చెరువును పరిశీలించారు. దీనిని హైదరాబాద్ ట్యాంక్ బండ్ తరహాలో అభివృద్ధి చేయాలని భావిస్తున్నామని, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత దీనిపై చర్యలు చేపడతామని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ తెలిపారు.



తుమ్మపాల చెరువు

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శనివారం శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో వేద పండితులు వేకువజామున వేంకటేశ్వరస్వామికి పంచామృతాలతో అభిషేకించాక పలు రకాల పుష్పాలతో తోమాలసేవ చేసి అలంకరించి పూజలు జరిపారు. సాయింత్రం ఆలయ మండపంలోని ప్రత్యేక వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవ విగ్రహాలను అదిష్టింపజేసి పుష్పాలతో సహస్రనామార్చన, నక్షత్ర హారతి, కుంభ హారతి ఇచ్చారు. పూజాది కార్యక్రమాల్లో పాలక మండలి సభ్యులతో పాటు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కాగా దివ్యక్షేత్రంలో నిర్వహిస్తున్న అన్నదానానికి స్థానిక భక్తులు జీవీ సత్యనారాయణ,, రాజ్యలక్ష్మి దంపతులు రూ.15 వేలను విరాళంగా అందజేశారు.



ఎస్టీబీఎల్‌లో ఉభయ దేవేరులతో పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

పెదగంట్యాడ,: జీవీఎంసీ 65 వ వార్డు గరుడాద్రిపై వెలసిన వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. సుప్రభాత సేవ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారికి తులసి దళాలతో భక్తులు పూజలు నిర్వహించాక భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మధ్యాహ్నం అన్న సమారాధనను చేపట్టారు. ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డి రమణ, ధర్మకర్త మంత్రి మంజుల, తదితరులు పాల్గొన్నారు.

వేపగుంట: నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న కల్యాణ వెంకన్నకు ప్రత్యేక పూజలు, అర్చనలు, 108 స్వర్ణ పుష్పాలతో సహస్ర నామార్చన చేశారు. సాయంత్రం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణాన్ని భక్తులు పఠించారు.



పూజలందుకున్న గౌరీపరమేశ్వరులు

ఘనంగా గైరమ్మ సంబరం

గోపాలపట్నం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి కొత్తపాలెంలో గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో గైరమ్మ సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో గౌరీపరమేశ్వరులకు పూజలు జరిపారు. మధ్యాహ్నం అమ్మవారి సారెను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఉత్సవమూర్తుల ఊరేగింపును చేపట్టారు. సాయంత్రం నుంచి ప్రధాన రహదారిలో జరిగిన వేడుకలను తిలకించడానికి పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

పెదగంట్యాడ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కె.సత్యనారాయణ డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గాజువాక కమిటీ ఆధ్వర్యంలో శనివారం గంగవరంలో పేదల నుంచి ఇళ్ల స్థలాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ సొంతిళ్లు లేక అనేక కుటుంబాలు నానా పాట్లు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు పల్లేటి పోలయ్య, పోతయ్య, సోమేశ్, మాధవరావు, పోలారావు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ సీనియర్ కబడ్డీ జట్టు కోచ్‌గా వైవీ



వెంకట శ్రీనివాసరావు (వైవీ)

మల్కాపురం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సీనియర్ కబడ్డీ జట్టు కోచ్‌గా 58వ వార్డు పరిధి ఎదురువానిపాలేనికి చెందిన పోర్టు ట్రస్టు ఉద్యోగి ఎదురు వెంకట శ్రీనివాసరావు (వైవీ) నియమితులయ్యారు. ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు ఒడిశా రాష్ట్రం కటక్‌లో జరగనున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో వైవీ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన జట్టు సభ్యులు ప్రతిభను కనబరచనున్నారు. ఈ సందర్భంగా వైవీ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జరగనున్న కబడ్డీ పోటీల్లో విజయం సాధించేలా జట్టు సభ్యులకు శిక్షణ ఇస్తున్నామన్నారు.

సినిమా గైడ్

- **లైలా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక), మౌర్య (గోపాలపట్నం),
- **తండేల్:** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)
- **మదగజరాజ:** జగదాంబ, సౌజన్య (గోపాలపట్నం),
- **సంక్రాంతికి వస్తున్నాం:** శారద, మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్:** శరత్, శ్రీకన్య, కిన్నెర, సుకన్య, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ,కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 10, వంకాయలు (తెలుపు) 16, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 36, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 40, బీరకాయలు 46, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 12, క్యారెట్ 26 దొండకాయలు 28, బంగాళ దుంపలు 15, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది)40, బరబాటి 30, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 70, బద్దచిక్కుడు 26, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 130, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 40, కీర దోస 26, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 32 చిలగడదుంపలు 38, కంద 68, దేముడు చిక్కుడు 28, గోరు చిక్కుడు 28, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 25, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 30, క్యారపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	90
లైవ్ ధర	100
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్

పదింతల ప్రణాళికతో సన్నద్ధం కావాలి

జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్

పెందుర్తి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు పదింతల ప్రణాళికతో విద్యార్థులు సన్నద్ధం కావాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ అన్నారు. మండలంలోని సరిపల్లి జడ్పీ పాఠశాలను డీఈవో సందర్శించారు. క్లస్టర్ కాంప్లెక్స్ నిర్వహణను సమీక్షించారు. పదో తరగతి పరీక్షకు సంబంధించి వంద రోజుల ప్రణాళికపై క్లస్టర్ పరిధిలో గల జడ్పీ పాఠశాల హెచ్‌ఎంలతో సమావేశమై పదో తరగతి విద్యార్థులందరూ శత శాతం ఉత్తీర్ణత సాధించాలని, ఇందులో ఎటువంటి మినహాయింపులు లేవని.. అందుకు తగ్గట్టుగా విద్యార్థులకు ఉపాధ్యాయులు తర్ఫీదు ఇవ్వాలన్నారు. బోధన గాడి తప్పితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డీఈవో హెచ్చరించారు. అనంతరం ప్రేమ్‌కుమార్ పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. పదికి పదింతల ప్రణాళిక కోసం నిత్య సాధన చేయాలన్నారు. చదువులో వెనకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. ఎస్1లో అధిక శాతం మార్కులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.

ఎస్‌పీఎస్‌బీ టీ20 క్రికెట్ పోటీల విజేత 'స్టీల్‌ప్లాంట్'

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ బోర్డు (ఎస్‌పీఎస్‌బీ) ఆధ్వర్యంలో బొకారో స్టీల్‌ప్లాంటులో శనివారం జరిగిన టీ20 క్రికెట్ పోటీల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్ జట్టు విజేతగా నిలిచింది. తొలుత సేలం జట్టు బ్యాటింగ్ చేసి నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి 128 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్ చేసిన విశాఖ స్టీల్‌ప్లాంట్ జట్టు 16 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 129 పరుగులు చేసి విజయం సాధించింది. స్టీల్‌ప్లాంట్ జట్టు విజేతగా నిలవడంతో ఇన్‌చార్జి సీఎండి ఏకే సక్సేనా టీమ్ సభ్యులకు అభినందనలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల్లో సత్తా చాటాలి



క్రీడాకారులలో కణితి జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సూర్యప్రకాశ్, తదితరులు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రావులపాలెంలో ఆదివారం నుంచి జరగనున్న రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్న 87వ వార్డు కణితి జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాకారులకు శనివారం హెచ్‌ఎం సూర్యప్రకాశ్, స్థానిక నాయకుడు వెంకటరమణ, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.మన్నాజీ, నారాయణరావుల చేతుల మీదుగా స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి క్రీడల్లోనూ విద్యార్థులు రాణించి విజేతలుగా నిలిచి పాఠశాలతో పాటు ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు వి.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోలమాంబ ఆలయ వార్షికోత్సవం

అగనంపూడి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఫార్మాసిటీ పునరావాస కాలనీ ఈ-బోనంగి గ్రామస్తుల ఆరాధ్య దైవం పోలమాంబ ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక పుష్పాలు, నూతన వస్త్రాలతో అలంకరించి పూజలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయం మహిళా భక్తులంతా సారెను పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించి, పూజలు చేశారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అమ్మవారిని దర్శించుకొని పూజలు జరిపారు. మధ్యాహ్న అన్న సమారాధనను చేపట్టారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో జరిగిన తీర్థంలో సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అట్టా సన్యాసి అప్పారావు, మంత్రి గిరిప్రసాద్, జగదీశ్, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

గాజువాక, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని సెంట్రల్ మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ పాపులేషన్ రీసెర్చ్ కమిటీ ప్రతినిధులు సూచించారు. గాజువాక పీహెచ్‌సీని శనివారం వారు సందర్శించారు. ఆస్పత్రిలో మందులు ఇచ్చే గది, స్టోర్ రూమ్, ల్యాబ్, రక్తపరీక్షల గది, డెలివరీ రూమ్, వార్డులను పరిశీలించారు. మందులను ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలని, రోగులకు మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. కమిటీ ప్రతినిధులు డాక్టర్ వైవీ రమణ, డాక్టర్ సీహెచ్ పాదాలు ఆస్పత్రి ప్రాంగణాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

వాట్సాప్‌లో ప్రభుత్వ సేవలు



(ఎంవీపీ కాలనీ, ఆంధ్రజ్యోతి)

స్మార్ట్ ఫోన్ వినియోగదారులందరికీ వాట్సాప్ అత్యవసరమైన యాప్‌గా మారిపోయింది. సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడం, ఫొటోలు, పీడీఎఫ్‌లు పంపించడం, కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులతో నిత్యం అందుబాటులో ఉండేందుకు ఇది చక్కని సాధనం. ఉదయం లేచింది మొదలు రాత్రి నిద్ర పోయే వరకు వాట్సాప్ వెనుకే జీవితం పరుగులు పెడుతోంది. ఇప్పటివరకు సమాచారం, వినోదం కోసం మాత్రమే వినియోగించే ఈ యాప్‌ను రాష్ట్ర ప్రభుత్వం 'మన మిత్ర' పేరుతో వివిధ రకాల సేవలను పొందేందుకు అవకాశం కల్పించింది. సాంకేతికత కొత్తపుంతలు తొక్కుతున్న సమయంలో ఇలా ఎవరి సెల్‌ఫోన్ నుంచి వారే తమకు కావాల్సిన ప్రభుత్వ సేవలను పొందేలా తీర్చిదిద్దింది.

రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్ పాలనకు తెరతీసి పౌరులకు 161 రకాల సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇలాంటి సాంకేతికతతో సేవలందించడం ప్రపంచంలోనే మొదటిసారని నిపుణులు చెపుతున్నారు. మన మిత్ర పేరుతో దీనిని ప్రజల చెంతకు చేర్చిన ప్రభుత్వం ఇందుకోసం

మన మిత్ర నంబరు
95523 00009

- హాయ్ అని టైప్ చేస్తే చాలు..
- అందుబాటులోని సర్వీసులు ప్రత్యక్షం

9552300009 నంబరును కేటాయించింది. ఇక నుంచి వివిధ రకాల ధ్రువపత్రాల కోసం కార్యాలయాలు, అధికారులు, సిబ్బంది చుట్టూ తిరగనవసరం లేకుండా, మధ్యవర్తులు, మామూళ్లు లాంటి బెడద తప్పేలా 'మన మిత్ర' సేవలందించనుంది. వరదలు, అత్యవసర సమాచారం వంటివి దీనిద్వారా పౌరులకు అత్యంత వేగంగా అందనున్నాయి. తొలి విడతలో విద్యుత్, దేవదాయ, రెవెన్యూ, పురపాలక శాఖ, రవాణా సంస్థ సేవలతో పాటు, వినతులను స్వీకరించనుంది. మొత్తంగా 520 రకాల పౌర సేవలను మన మిత్రలో అందించాలన్నది ప్రభుత్వ ధ్యేయం. ప్రస్తుతం తెలుగు, ఆంగ్ల భాషల్లో సేవలు లభిస్తున్నాయి. మరిన్ని భాషలు జోడించే దిశగా కసరత్తు జరుగుతోంది.



అందుబాటులో సర్వీసులు

తొలి ప్రయత్నంలో విద్యుత్తు, ఏపీఎస్ ఆర్టీసీ, దేవదాయ, రెవెన్యూ, పురపాలక శాఖల సేవలతో పాటు ఈ శాఖలో వినతులను స్వీకరిస్తారు.ముందుగా సెల్ ఫోన్‌లో 95523 00009 నంబరును ఫీడ్ చేసుకోవాలి. వాట్సాప్‌లో ఈ నెంబరుకు హాయ్ అనే సందేశాన్ని పంపించాలి. ప్రస్తుతం ఎనిమిది విభాగాల సేవలు కనిపిస్తాయి. తిరిగి సేవను ఎంచుకోండి అనే సమాచారం తెలుగులో వస్తుంది. సేవను క్లిక్ చేస్తే, అందుబాటులో ఉన్న సేవలు శాఖల పేర్లతో కనిపిస్తాయి. వీటిలో మనకు ఏది అవసరమో క్లిక్ చేయాలి. ఉదాహరణకు వివిధ ధ్రువ పత్రాల కోసం రెవెన్యూ శాఖను ఎంచుకుంటే అందులో మనకు ఏది అవసరమో దానిని ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ఆయా పత్రాలకు కావాల్సిన వాటిని జత చేయాల్సి ఉంటుంది. ఉదాహరణకు ఆధార్ నంబర్లు అడిగితే సంబంధిత చూపించిన కాలమ్ బాక్సులో టైప్‌చేయాల్సి ఉంటుంది. ఎంచుకున్న సేవల ఆధారంగా వ్యక్తిగత వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ఫిర్యాదులు, పరిష్కార సేవలు అందుబాటులో ఉంటాయి. దీనిద్వారా ఫిర్యాదు పరిస్థితిని తెలుసుకునే వీలుంటుంది. దీంతో పాటు ముఖ్యమంత్రి సహాయనిధికి చేసిన దరఖాస్తు పరిస్థితిని కూడా తెలుసుకునే వీలుంది. ఇక విద్యుత్ బిల్లులు, ఆస్తి పన్నులు చెల్లించవచ్చు. రెవెన్యూ శాఖకు సంబంధించిన భూముల రికార్డులు, వివిధ ధ్రువీకరణ పత్రాలు పొందవచ్చు. ఏపీఎస్ఆర్టీసీ టికెట్ బుకింగ్, రద్దు వంటివి ఉన్నాయి. దేవదాయ విభాగంలో రాష్ట్ర పరిధిలోని తిరుపతి మినహా ఇతర ముఖ్యమైన దేవాలయాలకు సంబంధించిన సేవలు పొందవచ్చు. దర్శనం, గదుల బుకింగ్, సేవలు, దానాలు వంటివి ఉంటాయి. నగరంలోని సింహాచలం దేవస్థానంతో పాటు కాణిపాకం, విజయవాడ దుర్గాదేవి ఆలయం, అన్నవరం, ద్వారకా తిరుమల, శ్రీకాళహస్తి దేవాలయాల సేవలున్నాయి.

నగరాల పరిధిలో...

నగరాల్లో నివసిస్తున్న వారు తమకు కొత్త కొళాయి కనెక్షన్, ట్రేడ్ లైసెన్స్, ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్ను, నీటి పన్ను చెల్లించవచ్చు. రెవెన్యూ పరిధిలో 13 సేవలు అందుబాటులో ఉన్నాయి. ఎన్టీఆర్ వైద్యసేవకు సంబంధించి కొన్ని సేవలున్నాయి. పోలీసు శాఖలో పోయిన ధ్రువపత్రాలపై ఫిర్యాదు చేయవచ్చు. విద్యా విభాగంలో విద్యార్థులు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యాన్ని కల్పించారు. ఆర్టీసీ సేవల్లో ఎక్కడి నుంచి ఎక్కడకు ప్రయాణించాలో నమోదుచేస్తే, బస్సుల లభ్యత, టిక్కెట్ ధర చూపిస్తుంది. టికెట్ బుక్ చేసుకుంటే బస్సు బయలుదేరే సమయానికి ముందుగా రిమైండర్ వస్తుంది. రానున్న రోజుల్లో ప్రస్తుతం ఉన్న శాఖల్లోనే ఇతర సేవలూ అందుబాటులోకి రానున్నాయి.



వాట్సాప్‌లో మొదటగా వచ్చే మెసేజ్



వాట్సాప్‌లో ప్రస్తుతం ఎంచుకునే సేవలు



జీబీఎస్ రోగులకు మెరుగైన వైద్య సేవలు


రోగి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద

మహారాణిపేట, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో జీబీఎస్ (గులియన్ బారే సిండ్రోమ్)తో బాధపడుతున్న ఐదుగురు రోగులకు ప్రత్యేక వైద్యులతో మెరుగైన చికిత్స అందిస్తున్నట్లు అందిస్తున్నట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద తెలిపారు. వైద్యాధికారులతో కలిసి శనివారం ఆయన రోగులను పరిశీలించారు. వారికి అందుతున్న సేవలు, వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. చికిత్సలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని వైద్యులకు సూచించారు. కాగా ఆక్సిజన్ ప్లాంట్ వద్ద పటిష్ఠ భద్రత చర్యలు చేపట్టినట్టు సూపరింటెండెంట్ తెలిపారు, ఇటీవల ప్లాంట్‌ల వద్ద పైపులను కొంతమంది కోసివేయడంతో ప్రత్యేక భద్రత కల్పించామన్నారు. ప్లాంట్ పరిసరాలను పరిశీలించారు. ఇతరులు లోపలికి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 24 గంటలు భద్రత కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాసవీలత, ఆర్ఎంవో డాక్టర్ మెహర్‌కుమార్, వైద్యులు పాల్గొన్నారు.

'భావ విపంచి'కి జాతీయ పురస్కారం


వెంకట నారాయణమూర్తి

విశాఖపట్నం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత, గాయకులు, నటుడు ఉండవిల్లి వెంకట నారాయణమూర్తి రాసిన భావ విపంచి కవితా సంపుటి జాతీయ పురస్కారానికి ఎంపికయింది. ఖతర్ రాజధానిలో ఇటీవల ఈ కవితా సంపుటిని ఆవిష్కరించారు. కొనిరెడ్డి ఫౌండేషన్, చదువుల సాహిత్య కళావేదిక వచ్చేనెలలో ఈ పురస్కారాన్ని అందజేయనున్నాయి.

స్వచ్ఛ విశాఖ సాధనకు కృషిచేయాలి

- కలెక్టరేట్‌లో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం

మహారాణిపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ ఆరోగ్యకరమైన, ఆహ్లాద జీవితం గడిపేలా అందరూ కృషి చేయాలని కలెక్టర్ ఎం ఎన్ హరేంధిరప్రసాద్ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలలు, పాఠశాలల్లో అధికారులు సిబ్బంది పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా కలెక్టరేట్‌లో జేసీ, డీఆర్వో, ఇతర అధికారులతో కలిసి పరిసరాల్లో చెత్తను తొలగించి శుభ్రం చేశారు. గార్డెన్‌లోని పిచ్చిమొక్కలను తొలగించారు, స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ఆవశ్యకతను వివరించే పోస్టర్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచడంలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, అధికారులు భవానీ శంకర్, శేషశైలజ, ఏవో ఈశ్వరరావు, సెక్షన్ సూపరింటెండెంట్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


కలెక్టరేట్ పరిసరాలను శుభ్రం చేస్తున్న కలెక్టర్, అధికారులు

మెరుగైన సమాజ నిర్మాణంలో సహకార సంస్థల పాత్ర కీలకం

- నాఫ్కాబ్ చైర్మన్ లక్ష్మీ దాస్

సిరిపురం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మెరుగైన సమాజ నిర్మాణంలో సహకార సంస్థల పాత్ర కీలకమని నేషనల్ ఫెడరేషన్ ఫర్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్స్ (నాఫ్కాబ్) చైర్మన్ లక్ష్మీ దాస్ పేర్కొన్నారు. సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో ది విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంకు 110వ ఏడాదిలోకి అడుగుపెడుతున్న సందర్భంగా శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో మెరుగైన విద్య, వైద్యం, గృహ నిర్మాణాలు, మౌలిక వసతుల కల్పన కోసం సహకార సంస్థలు కృషి చేయాలన్నారు.అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ విలువలతో సేవలందిస్తున్న వీసీబీ ప్రజల మన్ననలు పొందుతోందన్నారు. విశాఖ ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ విశాఖలో సుదీర్ఘ కాలం సేవలందించిన ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు ఇతర ప్రాంతాల్లో బ్రాంచ్‌లు ఏర్పాటు చేసిందన్నారు. వీసీబీ పూర్వ చైర్మన్ మానం ఆంజనేయులు సామాన్యుల జీవన స్థితిగతులు మెరుగుపడేలా సహకార బ్యాంకులు పనిచేయాలన్నారు. వీసీబీ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు మాట్లాడుతూ 1916లో బ్యాంకు స్థాపించి వ్యవస్థాపకులు శ్రీపతి భద్రయ్యపంతులు, బి.రామకృష్ణశాస్త్రి, బి.తమ్మయ్యశాస్త్రి, ఎం.పట్టాభిరెడ్డి తదితరుల ఆధ్వర్యంలో బ్యాంకు కార్యకలాపాలు ప్రారంభించిందన్నారు. సమావేశంలో ఏపీ కో ఆపరేటివ్ ఫెడరేషన్ అధ్యక్షుడు చిట్టూరి రవీంద్ర, ఉపాధ్యక్షుడు షేక్ జిలానీ, సిటిజన్ సొసైటీ గౌరవ అధ్యక్షుడు ఎం.ఎస్.ఆర్.వి.ప్రసాద్, డైరెక్టర్ ఎం.వెంకటరత్నం, బ్యాంకు డైరెక్టర్లు జేవీ సత్యనారాయణమూర్తి, ఏజె స్టాలిన్, పీవీ నరసింహమూర్తి, సీతంశ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


సహకార పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాఫ్కాబ్ చైర్మన్ లక్ష్మీ దాస్, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, తదితరులు

ఆర్టీసీ బస్టాపుల్లో ఆక్రమణల తొలగింపు

- స్పందించిన పోలీసు యంత్రాంగం
- పట్టించుకోని టౌన్ ప్లానింగు అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విశాఖపట్నం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్టీసీ బస్టాపుల ఆక్రమణలపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురించడంతో పోలీసు అధికారులు స్పందించారు. ఇసుకతోట బస్టాపులో పాత కార్లను, సర్వీసు రహదారిలో కార్ల రిపేరింగ్ సెంటర్ల యజమానులు ఉంచిన వాహనాలను కూడా తొలగించారు. ఎంవీపీ కాలనీలో సమతా కాలేజీ బస్టాపులోనే నిర్వహిస్తున్న పాన్‌షాపును మూసివేయించారు. అప్పుఘర్ లుంబినీ పార్కు, బస్టాపులో ఫాస్ట్ ఫుడ్ స్టాల్‌ను, తెన్నేటి పార్కు బస్టాపులో తోపుడు బళ్లను తీసివేయించారు. రహదారుల పక్కన ఆక్రమణలు లేకుండా చూడాల్సిన బాధ్యత టౌన్ ప్లానింగ్ విభాగానిది. అయితే వారు కనీసం స్పందించలేదు. పోలీసులు తొలగించిన ఆక్రమణలు మళ్లీ రాకుండా సచివాలయ సిబ్బందికి బాధ్యత అప్పగించాల్సి ఉంది. లేదంటే వారం రోజుల్లోనే పూర్వ పరిస్థితి వచ్చే ప్రమాదం ఉంది.


తెన్నేటిపార్కు వద్ద ఇలా...


సమతా కాలేజీ వద్ద మూతపడిన దుకాణం


ఇసుకతోట జాతీయ రహదారి బస్టాప్

క్రైం... crime news

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



అగనంపూడి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. జీఆర్పీ ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి తెలిపిన వివరాలివి. అగనంపూడి సమీపంలో రైలు ఢీకొనడంతో సుమారు 55 ఏళ్ల వయసు గల వ్యక్తి మృతిచెందాడు. నలుపు నిక్కరు, ఎరుపు రంగు టీ షర్ట్ ధరించి ఉన్నాడు. ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిస్తే రైల్వే పోలీసులను సంప్రదించాలని లక్ష్మి కోరారు.

గాజువాకలో వ్యక్తి ఆత్మహత్య

గాజువాక, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తనను విడిచి భార్య దూరంగా ఉండడంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గాజువాకలో శనివారం జరిగింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన భైన్‌పాల్‌సింగ్ గాజువాకలోని ఓ అపార్ట్‌మెంటులో ఇద్దరు స్నేహితులతో కలిసి ఉంటూ భెల్ హెచ్‌పీవీపీలోని ఓ సంస్థలో కుక్‌గా పనిచేస్తున్నాడు. రెండేళ్ల క్రితం అతడిని భార్య విడిచిపెట్టింది. దీంతో మనస్తాపానికి గురై ఫ్లాట్‌లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్ హుక్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గాజువాక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్న కుమార్తెను తల్లిని చేసిన మృగాడి అరెస్టు

పెందుర్తి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): వరుసకు అన్నయ్య కుమార్తెను తల్లిని చేసిన మృగాడిని శనివారం విజయవాడలో పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు అధికారి వెస్ట్ ఏసీపీ పృథ్వీరాజ్ ఆదేశాల మేరకు సీఐ కేవీ సతీశ్‌కమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తి గోశాల సమీపంలోని ప్రహ్లాదపురానికి చెందిన ఓ బాలిక తల్లి చిన్నతనంలోనే మృతి చెందింది. తండ్రి మరో పెళ్లి చేసుకోవడంతో అమ్మమ్మ సంరక్షణలో ఉంది. 2012లో బాలిక అమ్మమ్మ మృతిచెందడంతో పిన్ని, చిన్నాన్నల వద్ద ఉండేది. బాలికకు యుక్తవయసు వచ్చాక ఆమె ఆస్తిని దక్కించుకోవాలని చిన్నాన్న కుట్రపన్నాడు. మాయమాటలు చెప్పి ఆమె వద్దనున్న రూ.13 లక్షలు తీసుకుని చినముషిడివాడలో స్థలం కొనుగోలు చేశాడు. ఆ స్థలం వివాదాస్పదంకావడంతో ఆమె నిలదీసింది. దీంతో 2013లో ఇంట్లో ఆమె పిన్ని లేని సమయంలో బలవంతం చేశాడు. ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. 2015లో దగ్గరి బంధువుతో వివాహం జరిపించాడు. భర్తతో శ్రీకాకుళం వెళ్లిన ఐదు నెలలనే దంపతుల మధ్య విభేదాలు రావడంతో ఆమెను తిరిగి ప్రహ్లాదపురానికి తీసుకువచ్చాడు. అనంతరం ఆమెపై చిన్నాన్న లైగింక దాడికి పాల్పడడంతో గర్భవతి అయింది. విషయం బయటకు పొక్కితే పరువు పోతుందని ఆమెను 2016లో మలేషియా పంపాడు. డెలివరీ సమయానికి విజయవాడ తీసుకువచ్చి ఓ ఆస్పత్రిలో చేర్చాడు. ఆస్పత్రి రిజిస్టర్‌లో బిడ్డ తండ్రిగా అతడే సంతకం చేశాడు. తనను మోసం చేసి రూ.13 లక్షల నగదుతో పాటు 30 తులాల బంగారాన్ని కాజేసి, తల్లిని చేశాడంటూ చిన్నాన్నపై ఆమె 2023లో పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటినుంచి పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. నిందితుడు ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించగా న్యాయస్థానం డిస్మిస్ చేసింది. దీంతో విజయవాడలో అతడిని అరెస్టు చేసినట్టు సీఐ సతీశ్‌కుమార్ తెలిపారు. వెస్ట్ ఏసీపీ పృథ్వీరాజ్ నిందితుడిని కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించారని వివరించారు.

ఏపీ టూరిజం కాంట్రాక్టు కార్మికుల నిరసన


రుషికొండ బీచ్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

సాగర్‌నగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జీతాలు చెల్లించాలంటూ రుషికొండలో పనిచేస్తున్న ఏపీ టూరిజం కాంట్రాక్టు కార్మికులు శనివారం నిరసన చేపట్టారు. పారిశుధ్య కార్మికులు, లైఫ్, సెక్యూరిటీ గార్డులతో పాటు వివిధ పనులు చేసే 38 మంది ఆందోళనకు దిగారు. నవంబరు నుంచి జీతాలు లేక ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వారు బ్లూ ఫ్లాగ్ బీచ్ మేనేజర్ సతీశ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి రెండు మూడు రోజుల్లో జీతాలు అందేలా చూస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు.

డయల్ యువర్ సీపీకి నాలుగు ఫిర్యాదులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి శనివారం నిర్వహించిన 'దివ్యాంగ్ సురక్ష డయల్ యువర్‌సీపీ' కార్యక్రమానికి నాలుగు కాల్స్ వచ్చాయి. బాధితుల సమస్యలను విన్న సీపీ వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు.